ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జూన్, జూలై 2021

సంచిక : 442

వెల : 25/-


కి. రాజనారాయణన్


కె. కె. రంగనాథాచార్యులు


అదృష్టదీపక్


కాళీపట్నం రామారావు

జనసాహితి ప్రచురణ

# ప్రముఖ కన్నడ దళిత కవి డా॥ సిద్ధ లింగయ్య స్మృతి



కర్నాటకలో దళిత బండాయ సాహిత్య ఉద్యమ ప్రముఖులలో ఒకరైన ప్రొఫెసర్ సిద్ధ లింగయ్య కోవిడ్‌తో తన 67వ ఏట 11-06-2021న బెంగుళూరులో మరణించారు. ఆయన 1954లో బెంగుళూరులోనే జన్మించారు.

సామాజిక న్యాయం కోసం దళిత హక్కుల క్రియాశీల కార్యకర్తగా, బి. కృష్ణప్పతో కలిసి దళిత సంఘర్ష సమితి సంస్థాపకునిగా కృషిచేసిన సిద్ధ లింగయ్య బెంగుళూరు విశ్వవిద్యాలయంలో కన్నడ బాషా శాఖాధిపతిగా పనిచేశారు. హంపీలోని కన్నడ విశ్వవిద్యాలయపు సిండికేట్ సభ్యునిగా వున్నారు. కన్నడ పుస్తక ప్రాధికార అధారిటీకి, కన్నడ అభివృద్ధి ప్రాధికార సమితికి ఛైర్మన్‌గా వున్నారు. తన 34వ ఏట 1988లో శాసనమండలి సభ్యునిగా, మరల 2006లో కూడా రెండవసారి ఎన్నికయ్యారు. వీరి స్వీయచరిత్ర 'ఒరుకెరి' (ఊరు-వాడ)ను వివిధ విశ్వవిద్యాలయాలలో పాఠ్య గ్రంథంగా పెట్టారు.

1975లో ఆయన మొదటి కవితాసంపుటి 'సాంగ్స్ ఆఫ్ ది హోలియా అండ్ మాదిగ'లోని పలు గేయాలు విరసన ప్రదర్శనకారులు పదే పదే పాడుతుంటారు. 1947 స్వాతంత్ర్యంపై ఆయన రాసిన విమర్శనాత్మక కవితను అణచివేతకు గురైనవారి సంస్థలు తమ సమావేశాలలో ప్రారంభగీతంగా వాడుతుంటాయి.

ఆయన రాసిన 'మై పీపుల్' (నా ప్రజలు') కవితకు అనువాదం ఆంగ్లంలో కె. నరసింహామూర్తి చేశారు. దాని ఆధారంగా తెలుగులో చేసిన అనువాదం.

## నా ప్రజలు

ఆకలితో మలమల మాడి మరణించేవారు
స్పృహ కోల్పోయేట్లు తన్నులు తినేవారు
నీ కాల్మొక్కుతానంటూ ప్రాధేయపడేవారు
అగ్రవర్ణాల ముందు - చేతులు కట్టుకుని
విధేయులుగా వుండేవారు
ఇదిగో - చూడండి - వీరు! - వీరే నా ప్రజలు!
కణకణ మండే ఎండలో చెమటలు కక్కుతూ
దుక్కిదున్ని, విత్తనాలు వేసి, పంట పండించి
అలసిసొలసి విట్టూర్పులతో కాలం గడిపేవారు
తినడానికి తిండి, కట్టడానికి బట్ట లేక
ఖాళీ చేతులతో మిగిలేవారు
వీరు! వీరే నా ప్రజలు!

బండరాళ్ళను మోసి, బంగళాలు కట్టి
వాటి క్రింద బాధలతో చితికిపోయేవారు
రోడ్డుప్రక్క, పడి, మౌనంగా రోదించేవారు
వీరు! వీరే నా ప్రజలు!

నిప్పులు కురిపిస్తూ రెచ్చగొట్టే మాటల ఫలితంగా
అగ్నికి ఆహుతై బూడిదయ్యేవారు
దేవుడి పేరు జపిస్తూ విందులు కుడిచేవారికి
చెప్పులు, బూట్లు కుట్టి ఇచ్చేవారు
వడ్డీ వ్యాపారుల చేతుల్లో బాధితులు
వీరు! వీరే నా ప్రజలు!

బంగారాన్ని గనుల నుండి త్రవ్వితీసేవారు
అయితే, తినడానికి తిండిలేనివారు
చెప్పిన పని ఖచ్చితంగా చేసేవారు
గాలిని భోంచేసి జీవించేవారు
వీరు! వీరే నా ప్రజలు!

అనువాదం : కొత్తపల్లి రవిబాబు ✤

44 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

సంపుటి : 44

సంచిక : 11, 12

జూన్ & జూలై 2021

442

www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ❏ ముఖచిత్రం | : అమరులు కి. రాజనారాయణన్, కాళీపట్నం రామారావు, కె.కె. రంగనాథాచార్యులు, అదృష్టదీపక్ | | .....01 |
| ❏ రెండవ అట్ట | : కన్నడ దళిత కవి డా॥ సిద్ధ లింగయ్య | | .....02 |
| ❏ మూడవ అట్ట | : శవవాహిని గంగ | – పరుల్ ఖక్కర్ | .....35 |
| ❏ నాల్గవ అట్ట | : ఛాయరాజ్‌ని స్మరించుకుంటూ.... వేటగాడివి కవీ! (కవిత) | | .....36 |
| ❏ సంపాదకీయం | : ఇక్కడ బతకడం అంటే చావుకి తెగించటమే | | .....05 |
| ❏ కథలు | : లైఫ్ ఆఫ్ జై | – డా॥ కే.వి. రమణరావు | .....07 |
| ❏ వ్యాసాలు | : పుట్టుకలోనే మరణం వున్న సిద్ధాంతం | – కె.కె. రంగనాథాచార్యులు | .....11 |
| | : అతను ఎన్నుకున్న బాట అందరికీ వెలుగుబాట | – నిర్మలానంద | .....27 |
| ❏ పుస్తక సమీక్ష | : కారా మాష్టారి 'చావు' కథపై | – ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ | .....20 |
| | : కిరా నవలలు 'గోపల్లె', 'గోపల్లె జనాలు' | – వేములపల్లి రాధిక | .....21 |
| | : నిబద్ధ కవిత్వం ఫలించిన 'నిరీక్షణ' | – అదృష్టదీపక్ | .....26 |
| ❏ వ్యంగ్యం | : అమూల్ యం | – శంకరం | .....36 |
| ❏ సినిమా సమీక్ష | : 'గణశత్రు' | – బాలాజీ (కోల్‌కతా) | .....24 |
| ❏ బాలసాహితి | : భవిత, జ్యోత్స్న వేసిన బొమ్మలు | | .....10 |
| ❏ కవితలు | : రామిశెట్టి (**16**), వల్లభాపురం జనార్దన, చలపాక ప్రకాశ్ (**17**); ఆలూరి బైరాగి (**18**) | | |
| ❏ ప్రకటనలు | : పాలస్తీనా పోరాటానికి సంఘీభావం | | .....18 |
| | : లక్షద్వీప్ పోరాటానికి అండగా నిలుద్దాం | | .....19 |
| ❏ వివిధ | : ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**35**); సాహిత్య, సాంస్కృతిక సామాజికాంశాలు (**38-40**) చైతన్యవాహిని (**41**); ఈ పుస్తకాలు అందాయి (**42**) | | |
| ❏ శాశ్వతనిధి | : కోమలి సూర్యారావు, చెన్నూరి అనిల్‌కుమార్ | | .....04 |
| ❏ సంతాపాలు | : కె.కె. రంగనాథాచార్యులు (**06**), దేవిరెడ్డి వెంకటరెడ్డి (**20**), కెన్నెత్ డేవిడ్ కౌండా (**23**), కీరా, అదృష్టదీపక్ (**29**), రిజ్వా ఫైజర్, కట్టా నరసింహులు, గోపి, సుందర్‌లాల్ బహుగుణ (**30**), కాలెపు శివశేఖర్, రాజా సురేశ్, బొమ్మల కట్టయ్య, నన్నపనేని అయ్యన్‌రావు (**31**), మనోజ్‌దాస్, బుద్ధ దేవ్ దాస్ గుప్తా (**32**), ఇందు జైన్, మైథిలీ శివరామన్, యలవర్తి రాజేంద్రప్రసాద్ (**33**), ఎం. రాజేంద్ర, నేతల ప్రతాప్‌కుమార్, లాల్‌బహదూర్ వర్మ, జక్కం రమణారెడ్డి (**34**), కారా (**37**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

**30-7-6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**

ఫోన్ : **7075957010** prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. **59,** రాధాక్రిష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – **532001**

ఫోన్ : **9441913829** prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

‘ప్రజాసాహితి’
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
“అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**


| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై ‘ప్రజాసాహితి, విజయవాడ’ అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ | |
| | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# నటుడు, దర్శకుడు
# కామ్రేడ్ కోమలి సూర్యారావు



**మంచి** నటుడు దర్శకుడు అయిన కామ్రేడ్ కోమలి సూర్యారావు ‘ప్రజాసాహితి’ పత్రిక ప్రారంభం నుండి దానికి పాఠకుడు, అభిమాని, కార్యకర్త కూడా! 31-10-1943న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జన్మించిన సూర్యారావు, కుటుంబ కారణాల రీత్యా, కృష్ణాజిల్లా గుడివాడ హైస్కూల్లో చదువుకున్నారు. 1962 ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి కామ్రేడ్ గంజి రామారావుగారి విజయం కోసం తన వంతు కృషి చేశారు. తిరిగి కాకినాడకు చేరిన తర్వాత ఔత్సాహిక కళాకారులతో 1970లో ఒక బృందాన్ని రూపొందించి, ఆచార్య ఆత్రేయ రచించిన ‘పరివర్తన’ నాటకానికి దర్శకునిగా ప్రధానపాత్రధారిగా ఎంతో కృషి చేశారు. వివిధ ప్రాంతాలలో ఆ నాటకాన్ని ప్రదర్శించారు. కాకినాడ మెడికల్ కళాశాల ప్రగతిశీల విద్యార్థులతో కలిసి ‘యువ సాహితీ సాంస్కృతిక సంస్థ’ను (Y.L.C.O) నిర్మించటంలో సూర్యారావు పాత్ర చెప్పుకోదగినది. ‘జీవనాడి’ పత్రికను ఆలంబన చేసుకుని చైతన్యవంతంగా ఈ బృందం పనిచేస్తూ ఉండేది. కామ్రేడ్ కరీమ్ లాంటి కొత్త కళాకారులకు ఆనాటి ‘కరువుకథ’ నాటికను నేర్పటంలోనూ, ఆ నాటక ప్రదర్శనలు పేటలలోనూ చుట్టుపక్కల గ్రామాలలోనూ ప్రదర్శించడంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ‘ప్రజాసాహితి’ పత్రికకు చందాలు పెంచటంలో చురుకుగా కృషి సలిపారు. హక్కుల రంగంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓ.పి.డి.ఆర్) జిల్లా బాధ్యునిగా పనిచేశారు. 90వ దశకంలో తుని దగ్గర పాయకరావుపేటలో పాఠశాలను ఏర్పాటు చేసి, దాని నిర్వహణ బాధ్యతలతో తలమునకలవుతూ 2006 అక్టోబరు 9న హఠాత్తుగా గుండెజబ్బుతో మరణించారు.

కామ్రేడ్ కోమలి సూర్యారావును జ్ఞాపకం చేసుకుంటూ వారి తమ్ముని కుటుంబం ‘ప్రజాసాహితి’ శాశ్వతనిధికిగాను 25 వేల రూపాయలు విరాళంగా అందించారు. వారికి కృతజ్ఞతలు.

# చెన్నూరి అనిల్ కుమార్



**చెన్నూరి** అనిల్‌కుమార్ 1980 జనవరి 23న జన్మించాడు. తల్లిదండ్రులు సూర్యచంద్రరావు, సుబ్రహ్మణ్యకుమారి గుంటూరు వాస్తవ్యులు. అనిల్ కుమార్ విద్యార్థి దశలో గుంటూరులో ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ (డి.ఎస్.ఓ)లో క్రియాశీల సభ్యునిగా కృషిచేశాడు. అనారోగ్యంతో 2007 జూన్ 2వ తేదీన మరణించాడు. అనిల్‌కుమార్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు ‘ప్రజాసాహితి’ శాశ్వతనిధికి 25 వేల రూపాయలు విరాళంగా అందించారు. వారికి కృతజ్ఞతలు.

## సంపాదకీయం

# ఇక్కడ బతకడమంటే – చావుకి తెగించటమే!!

**ఇంతవరకు** బతకడాన్ని నేరం చేసిన మూడు పాతికల స్వాహాతంత్ర్యంలో మోడీ పాలనకొచ్చేసరికి ఊపిరిపీల్చడమూ, నోరువిప్పి మాట్లాడడమూ కూడా 'రాజ ద్రోహం' అయిపోయింది. 'చావడాన్ని' కారు చవక చేశారు. మరణాన్ని నిత్యకృత్యం చేస్తున్నారు. దీంతో నానాటికీ దేశ పాలక విధానాలు తీసికట్టై జన జీవనం అల్లకల్లోలమైపోతున్న సంక్షోభం దాపురించింది. సెక్షన్ 124ఎ నిబంధనలకు సంబంధించి చాలా సందర్భాల్లో కోర్టులు ఎన్నిసార్లు అభిశంసించినా ముఖ్యంగా మోడీ ప్రభుత్వం మంకుపట్టుతో 'రాజద్రోహం' పేరుతో భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోంది. ఈ నేపథ్యంలో దేశకాలమాన పరిస్థితుల్ని విహంగవీక్షణంగా పరిశీలిస్తే ప్రజాజీవనం అల్లకల్లోలమైన నేటి సమయంలో మనం ఉన్నది స్వతంత్ర దేశంలోనేనా అనే సందేహం వస్తుంది. ఎందుకంటే ఇక్కడ పాలకులు తమనితాము 'దేశభక్తులు'గా ప్రకటించుకున్నారు. దేశ ప్రజలందరినీ ప్రభుత్వాల్ని కూలదోసే 'కుట్రదారులు'గా ప్రకటిస్తున్నారు.

కరోనా రెండవ కాటుకు భయపడుతూ కటకటపడుతూ, నత్తనడక నడుస్తూన్న జనజీవనంపై అదనంగా పెట్రోలూ – డీజిలూ పోసి, నిత్యావసరాల ధరలను కొలిమిలా మండిస్తున్నారు. ఈ ఏడాది కాలంలోనే ఏవి ఆగినా, వ్యవసాయ ఉత్పత్తి పడిపోకుండా రైతాంగం కృషి చేశారు. అయినా, నిత్యావసరాల ధరలు 40–50 శాతం పెరిగిపోయాయి. ప్రస్తుతం అమలులో వున్న దేశ చమురు విధానం చూస్తే, ఒక లీటరు పెట్రోలు ధర మీద 63% పన్నుల భారమే వుంది. అందులో రాష్ట్రాల వాటా 23 శాతం కాగా, కేంద్రం వాటా 40 శాతం. టి.ఎ.పి.ఐ. (తుర్కుమినుస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, ఇండియా) పైపు లైను ద్వారా మన దేశానికి ముడిచమురు చవకగా అందిస్తామని ఇరాన్ సిద్ధపడినా మన దళారీ పాలకులు అమెరికన్ సామ్రాజ్యవాదపు హుంకరింపులకు జడిసి ససేమిరా మీ వద్ద తీసుకోమని అంటున్నారు. దీంతో రవాణారంగం ధరల మీద ధరలు పెంచుకుంటూ పోతుంది. అశేష ప్రజానీకం వినియోగించే ప్రతి వస్తువు మీదా ధరలు బాదుడు పెరుగుతోంది. దీనికి తోడు కొత్తగా పెంచబోతున్న ఆస్తిపన్ను, చెత్తపన్ను, నీటిపన్ను ఇతరేతర పన్నులు వీటితోపాటు జి.ఎస్.టి ప్రజల్ని నిలువుదోపిడీ చేస్తున్నాయి. వీటికి తోడు కరోనా రెండు అలలతో కుదేలైపోయిన భారత ప్రజారోగ్య వ్యవస్థ వీటితోపాటు, కార్పొరేట్‌రంగానికి అప్పచెప్పటం ఆందోళన కల్గిస్తోంది. ఇన్నాళ్ళూ దేశంలో మతాల మధ్య, కులాల మధ్య, పెంచి పోషించిన వైరుధ్యాల చిచ్చు కొనసాగుతుండగా ఇవాళ భిన్న వైద్య విధానాల మధ్య కూడా చిచ్చు రగిలించారు. పాలకులు ప్రజల్లో అభద్రతను అనైక్యతలను రెచ్చగొట్టి తమ పదవీ వ్యాపార స్వప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు. ప్రజల హాహాకారాల మధ్యనే ఎన్నికల జాతరలు జరుపుతున్నారు. జనం మరణయాతనల మధ్యనే గుత్త పెట్టుబడిదారులకు ప్రజాధనాన్ని గోరుముద్దలుగా తినిపిస్తున్నారు. ప్రజల సమస్యలతో సంబంధం లేకుండా మేం చెయ్యాలనుకున్నది చేసి తీరుతాం అంటూ ధనాఢ్య వర్గాల మోచేతి నీళ్ళు తాగే పాలకవర్గాల బెదిరింపులు రెట్టింపయ్యాయి. నాల్గు లక్షలమంది కరోనా మృతుల కుటుంబాలకు నాల్గు లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వలేమని భారత ప్రభుత్వం చేతులెత్తేసింది. కానీ భారతీయ స్టేట్ బ్యాంక్ ద్వారా భారత ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాల కాలంలో 1,23,000 కోట్ల రూపాయల పారిశ్రామికవేత్తల బకాయిలను రెండో ఆలోచనే లేకుండా రద్దు చేసింది. దేశంలో రాజ్యాంగం ప్రకారం అందరూ సమానులే, కానీ కొందరు ఎక్కువ సమానులు. ఆఖరికి కోవిడ్ బారిన పడిన దేశ ప్రజల శవాలతో గంగానది వల్లకాడుగా భోరుమని రోదిస్తుంటే ఆ గుండెకోతను కవితగా రాసిన గుజరాతీ కవయిత్రి పరుల్ ఖక్కర్‌పై అశ్లీలమైన బెదిరింపుల కొరడాలు ఝుళిపిస్తున్నారు. గౌరవప్రదమైన బతుకు ఎలాగూ ఈ దేశ ప్రజలకి లేదు, కనీసం మర్యాదకరమైన అంతిమ ఘడియలు కూడా సాధ్యం కాని పరిస్థితులను పాలకులు సృష్టించారు.

ఇక దేశంలో సాగుతున్న వాక్సినేషన్ పద్ధతిని గమనించిన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వాక్సిన్ రేటు విషయంలో తేడాల్ని ప్రశ్నిస్తూ (ఏప్రిల్ 27) ఒకసారి; కోవిడ్ మరణాలను చూస్తే కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు చనిపోవడమే కావాలని వుందిలా కనిపిస్తోందనీ (ఢిల్లీ హైకోర్టు ఏప్రిల్ 28) మరోసారి; ఆక్సిజన్ సరఫరా విషయంలో తాము ఇచ్చేవరకూ చావకుండా వుండమని, ఎదురుచూడమని చెప్తారా అంటూ (ఢిల్లీ హైకోర్టు ఏప్రిల్ 21) వెంటవెంటనే నిలదీస్తూనే – 14 నెలలు ఆక్సిజన్, వాక్సిన్ ఉత్పత్తి ఎందుకు చేయలేదనీ (ఏప్రిల్ 28) భారత న్యాయవ్యవస్థ వరుసగా మోడీ ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూనే వుంది. 'లాన్సెట్' అనే వైద్య పత్రిక ప్రకారం దేశ ప్రజారోగ్యవ్యవస్థ ఎలా వుందన్నది 199 దేశాలలో సర్వే చేయగా మనదేశం 145వ స్థానంలో వున్నది. కానీ ఇక్కడ సత్తా చాటుకోవాలని వచ్చిన ఒక మేధావి – పరిపాలనలో న్యాయస్థానాల జోక్యం సరైందికాదని, పాలకవర్గాలకు వత్తాసుగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు.

చిన్నదైన కెన్యా దేశం ఈ కరోనా కాలంలోనే భారతదేశానికి 12 టన్నుల కాఫీపొడి సాయం చేసింది. కానీ దేశంలో వందమంది ప్రపంచ కుబేరులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లున్నారు. ఈ ఏడేళ్ళ కాలంలో ఆసియా కుబేరుల్లో ఆదానీ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇదే ఏడేళ్ళలో దేశంలో పేదరికం 27 శాతంకి పెరిగిపోయింది. ఈ పరిణామాల్ని పరిశీలించే ప్రపంచ బ్యాంకు 'వరల్డ్ ఎకానమిక్ ఔట్‌లెట్' సర్వే ప్రకారం 2025 నాటికి భారత్ పేదరికంలో అతి చిన్న దేశమైన బంగ్లాదేశ్‌కంటే దిగజారిపోనుందని తీర్మానించింది.

ఇలాంటి దిగజారుడు స్థితిలో భారతదేశం కరోనా మూడవ పడగ నీడలోకి ప్రయాణం చేస్తోంది. దేశ ఆర్థిక స్థితి ఇలా కునారిల్లుతున్నప్పుడు సుదూర భవిష్యత్‌లోనైనా తరువాతి తరాలు ఈ భారత సమాజాన్ని తన స్వంత కాళ్ళమీద నిలబడేలా చేస్తాయేమో అనే ఆశాకిరణమేదీ కనబడటంలేదు. ఎందుకంటే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఇక్కడి తరగతి గది కూడా వ్యాపార సంస్కృతికి బలైపోతోంది. ఈ విషయంలో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం దొందుకు దొందూ అన్నట్టు వ్యవహరిస్తున్నాయి.

జాతీయ విద్యావిధానం 2020 ద్వారా రేపటి తరాలను సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల, దేశీయ గుత్త పెట్టుబడిదారుల మార్కెట్ ఎకానమీ విధానాలకు బలిపెడుతున్నారు. సందట్లో సడేమియాలా ప్రశ్నించే గొంతుల్ని చిదిమేయడానికి బిజెపి వర్గాలు మతతత్వ అరాచకీయాల సొంత అజెండాతో అశాస్త్రీయ భావాలను పాఠ్యాంశాల ద్వారా నేర్పే ప్రక్రియల్ని బలోపేతం చేస్తున్నారు. ఇది చాలక, రోజువారీ జీవన విధానంలో కార్యకారణ సంబంధాలపట్ల కనీస అవగాహన పెంచుకోడానికి వీలులేని మూఢనమ్మకాలనూ, అశాస్త్రీయ ఆలోచనల్నీ పనిగట్టుకొని ప్రజల్లో రెచ్చగొడుతున్నారు. విద్యారంగం భూమికని తలకిందులు చేసేందుకే కాషాయీకరణను ముందుకు తెస్తున్నారు. అందుకు మోడీ నాయకత్వం కాకపోతే – మరో యోగీ నాయకత్వం ముందుకు వస్తుంది. నిజానికి సామాజిక విలువలు గల సంఘటితశక్తిగా వ్యక్తిని చూడగలగడం ద్వారానే ఈ భారతదేశం పెను సంక్షోభం నుండి ఒడ్డెక్కగలదు. కానీ వ్యక్తి కేంద్రక అభివృద్ధికి – ఈ సొంత ఆస్తి వ్యవస్థ కట్టుబడి వుంది.

ఈ జీవన విధ్వంసం నుండి దేశ ప్రజలను చైతన్యపరచి సంఘటితపరిచే సాంస్కృతికోద్యమ పోరాటం జరగాలంటే దేశంలో ఏం జరుగుతోందో, ఎందుకు జరుగుతోందో, ఎవరివల్ల ఎలా జరుగుతోందో, నిరంతరంగా, విసుగూ విరామం లేకుండా, బిగ్గరగా ప్రజలకు అవగాహన అయ్యేలా చెబుతూ వుండడమే ప్రజానుకూల శక్తుల నిరంతర కార్యాచరణగా వుండాలి. నూతన ప్రజాతంత్ర సాహితీ సాంస్కృతిక విప్లవానికి ప్రజల్ని సమాయత్తం చేయడానికి ప్రజాపక్షం వహించే మేధావులూ, రచయితలూ, కళాకారులూ, విద్యార్థీ యువతరం, ఈ స్పష్టమైన ప్రజాకార్యాచరణకి పూనిక వహించాలి. ✹

# కేకే రంగనాథాచార్యులుగారి మరణానికి సంతాపం



**వేలాదిమంది** విద్యార్థులకు తెలుగు భాష, సాహిత్యాలను శాస్త్రీయంగా బోధించిన, వందలాది పరిశోధకులకు మార్గదర్శకులుగా పనిచేసిన మార్క్సిస్టు సాహితీ విమర్శకులు ఆచార్య కోవెల్ కందాళై రంగనాథాచార్యులు (80) కోవిడ్‌తో 15-5-2021న హైదరాబాద్‌లోని తార్నాకలో మరణించారు. ఆయన 14-6-1941న తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జన్మించారు.

ఆయన విశ్లేషణాత్మక రచనలు, గంభీరమైన ప్రసంగాలు, చతురోక్తులతో సాగించే సంభాషణ... ఏదైనా... ఆలోచింపచేసేవిగా, విజ్ఞానదాయకంగా, వివేచన కలిగించేవిగా ఉండేవి. విప్లవ రచయితల సంఘం, జనసాహితి వ్యవస్థాపకులలో ఒక ముఖ్యుడైన జ్వాలాముఖి, కె.కె.ఆర్ హైదరాబాదులోని సీతారాం భాగ్ దేవాలయ ప్రాంగణంలో పెరిగారు. జ్వాలాముఖితో పాటు తాను దిగంబర కవులలో ఒకరు కాకపోయినా ఆయన వారితో బాగా సన్నిహితంగా వుండేవారు. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథంతో మాత్రమే సమాజాన్ని, చరిత్రను, సంస్కృతిని, తద్వారా సాహిత్యాన్ని అవగాహన చేసుకోగలుగుతామనే నిర్ధారణకు కేకేఆర్ కూడా వచ్చారు. కనుకనే 1970 జులై 4న విరసం ఆవిర్భావ ప్రకటన చేసిన 14 మందిలో వీరూ ఒకరిగా ఉన్నారు. ఆయన, ఊర్మిళగారూ కులాంతర వివాహం చేసుకున్నారు.

ఆయన తెలుగు, సంస్కృతం, భాషాశాస్త్రాలలో 3 ఎం.ఏ. డిగ్రీలు పొందారు. ప్రాచీన తెలుగు శాసన భాషపై బద్రిరాజు కృష్ణమూర్తి పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. సారస్వత పరిషత్తు ఓరియంటల్ కళాశాలలో 20 ఏళ్లకు పైగా ప్రిన్సిపల్‌గా ఉండి తన అపార సంస్కృత ఆంధ్ర భాషాపాండిత్య సంపదను విద్యార్థులకు పంచారు. 1987లో కేంద్రీయ విశ్వ విద్యాలయానికి ఆచార్యులుగా, తెలుగుశాఖ అధిపతిగా, డీన్ గా పని చేశారు. ఆయనను ఆచార్యులకే ఆచార్యుడు అని అంటే అతిశయోక్తి కాదు. "తెలుగు సాహిత్యం – మరోచూపు"; 'తెలుగులో తొలి సమాజ కవులు'; 'తెలుగు సాహిత్య వికాసం'; 'తొలినాటి తెలుగు కథానికలు'; 'ఆధునిక తెలుగు సాహిత్యమూ – విభిన్న ధోరణులు'; 'బహుముఖం' (వ్యాస సంకలనం) వంటి అనేక రచనలు చేశారు.

తెలుగు సాహిత్య విమర్శ, పరిశోధనలలో ప్రత్యేక ఒరవడి దిద్దిన కేకేఆర్, ఏది రాసినా అదొక ప్రామాణిక పత్రం లాగా ఉండేది. 1989 'ప్రజాసాహితి'లో ఆయన రాసిన సంస్కృతి అంటే... అనే వ్యాసం అనేక ముద్రణలకు నోచుకుంది. ఆయన రచనల సంకలనం అయిన 'బహుముఖం'లోని వ్యాసాలన్నీ సాహిత్యకారులకు ఆకర పత్రాలు (Reference) లాంటివి.

ఒక గొప్ప సాహితీవేత్తను మనం కోల్పోయాము. వారి లేని లోటు పూడ్చలేనిది. కేకేఆర్ మరణానికి జనసాహితి సంస్థ ప్రగాఢ సంతాపాన్ని తెలియపరుస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తోంది. ✹

కథ



# లైఫ్ ఆఫ్ జై

- డా॥ కే.వి. రమణరావు

**కారును** సైడురోడ్లోకి తిప్పి పార్కింగ్ కోసం వెతుకుతున్నాడు జైరాజ్. జేబులో ఫోను రెండుసార్లు మోగి ఆగిపోయింది. ఇళ్ల యజమానులు వీధినే పార్కింగ్ లాట్‌గా మార్చుకొని రోడ్డుకు రెండువైపులా వాళ్ల కార్లు పెట్టుకున్నారు. చివరకు ఒక ఇంటిముందు గేటుకడ్డంరాని ఖాళీ కనపడింది. 'ఇంటివోనరు చూసాడంటే తిట్లు తప్పవు, డ్రైవర్లంటే అందరికీ అలుసే. మాలాంటివాళ్లను గౌరవంగాజూసే రోజెప్పుడన్నా వస్తుందా' అనుకుంటూ అక్కడ కారుపెట్టి గబగబా నడిచి అతని ఇల్లున్న సన్నటి సందులోకి తిరిగాడు.

ఇంటి తలుపుకు తాళం వేసి వుంది. ఉస్సూరమంటూ మెట్లమీద కూర్చున్నాడు.

ఫోనులో సందేశం వచ్చింది, తీసి చూసాడు. చంద్రకళ నుంచి రెండు మిస్డ్ కాల్స్, ఒక సందేశం. ఆమె ఫోను చేస్తే తను తీయడంలేదని నిష్టూరం చేస్తూ పెట్టిన సందేశం. తీస్తే కోపంగా మాట్లాడుతుంది. 'ఎటుపోతోందో తెలియని తమ ప్రేమ విషయం చెప్పి "మొగోళ్లకు ఆడోళ్ల బాధలు అర్థమైతాయని అనుకోడం నాదే పొరపాటు. నాకోసం వొక్కసారి తిరప్తి రావచ్చుగదా జై" అంటుంది. 'తనకు పెళ్లిసంబంధాలు చూస్తున్నారని అతను తనని పెళ్లిచేసుకోవడం ఆలస్యంజేస్తే తను దక్కనని' హెచ్చరిస్తుంది.

చంద్రకళ అతనిమీద అరచినా ఆమె గొంతు వినడం అతనికి సాంత్వనగా ఉంటుంది. ఆమె అతనికి దూరబ్బంధువు, మొదట్లో అతని తల్లికోసం తరచుగా ఇంటికొచ్చేది. జైరాజ్ నిర్లిప్తంగా వున్నా అతని వ్యక్తిత్వం నచ్చి క్రమంగా అతనిపట్ల ప్రేమను పెంచుకుంది. అతని బీదస్థితిని చూసి కూడా ఆమె ప్రేమించడం అతనికెప్పుడూ వింతే. 'హెచ్చుతగ్గులను లెక్కచెయ్యనిది ప్రేమ వొకటేనేమో. స్థితిగతులకు సంబంధంలేకుండా మనుషులను ప్రేమించేవాళ్లు కరువైపోతున్నారు' అనుకునేవాడు. చంద్రకళంటే అతనికీ యిష్టమే. ఐతే ఇది సినిమా కాదు, జీవితమనీ తెలుసు. అతని కళ్లకు ఆమె అందంగానేకాదు అందనంత ఎత్తులో కూడా కనబడుతుంది.

చంద్రకళది మధ్యతరగతి స్థాయి, ముగ్గురుపిల్లల్లో మూడోది. ఆమె తండ్రిది తిరుపతిలో శానిటరి పరికరాల వ్యాపారం, గట్టిమనిషి. విషయం తెలిసి కూతుర్ని మందలించాడు. 'జై చాలా మంచివాడని, కష్టపడతాడని, బాధ్యతగావుంటాడని' చంద్రకళ చెప్పిచూసింది. అతను ఒప్పుకోలేదు. 'జైకి వ్యాపారంచేసే తెలివితేటలు లేవు, మన సమాజంలో కష్టపడే మంచివాళ్లకు గుర్తింపు వుండదు. మనం మన స్థాయి నుంచి పైకి వెళ్లడానికే ప్రయత్నించాలి' అని అతను కూతురికి హితబోధ చేసాడు. ఆమె మనసు మార్చుకోకపోవడం గమనించి ఆమెను కట్టడి చేసి పెళ్లిసంబంధాలు వెతకడం మొదలుపెట్టాడు.

'బతుకుతెరువుకోసం ఈ హైదరాబాదు సిటీకి వలస వచ్చాడు. తన నిలకడలేని డ్రైవరు ఉద్యోగపు బొటాబొటి సంపాదనతో నలుగురు బతకాలి, ఇద్దరు చెల్లెళ్లు చదువుకోవాలి. చేసిన అప్పులు తీర్చాలి. తీసుకున్న అప్పు ఎగ్గొట్టడానికి తనేమీ బడావ్యాపారి కాదు. వడ్డీ చెల్లించడం ఆలస్యమైతేనే పాట్లు తప్పడంలేదు. ఈ పరిస్థితులలో పెళ్లనే ఆలోచనే భయానకంగా వుంది' అనుకున్నాడు.

మరో మెస్సేజి వచ్చింది. కారు వోనరు చిదంబరంగారి భార్య అంటే 'అమ్మగారు' పంపిన పూజాస్టోరు నుంచి తేవాల్సిన సామాన్ల లిస్టు. దాన్ని స్టోరతనికి పంపిస్తూండగా ఇంటిముందు పక్కింటి గణేశ మోటారుసైకిలు ఆగింది. వెనకసీట్లోంచి జైరాజ్ తల్లి మల్లమ్మ, ఆమె ఒళ్లోకూర్చున్న చిన్నచెల్లి దీప దిగారు.

"యెంతసేపైంది వొచ్చి జై?" అనడిగింది ఆమె తాళం తీస్తూ. జైరాజ్ జవాబివ్వలేదు.

మోటారుసైకిలు స్టాండేసి వచ్చాడు గణేశ. "దీపాకు వొళ్లు కాలిపోతావిణ్ణిందినా, డాక్టరు యింజక్షనిచ్చిండాడు. సాయంత్రానికి తగ్గిపోతిందన్నాడు" అన్నాడు.

జైరాజ్ అయిష్టంగా నవ్వి "థాంక్స్ రా" అని లేచి ఇంట్లోకెళ్లాడు.

"సాయంత్రమొస్తాత్తా, యాలోగా అవుసరముంటే చెప్పు" మల్లమ్మతో చెప్పి వెళ్లిపోయాడు గణేశ.

గణేశ నాన్న మునిస్వామిదీ తిరుపతే కాబట్టి తోడుగా వుంటారని వాళ్లింటిపక్కనే రెండు గదుల ఇల్లు అద్దెకి తీసుకున్నాడు జైరాజ్.

"యీ గణేశగాణ్ణెందుకు పిల్చుకోని పొయినావు? మణితో ఆటో దెప్పించుకోచ్చు గదా?" అడిగాడు జైరాజ్ లోపలికొచ్చాక కొంచెం కోపంగా.

"యిప్పుడు మణి యింటర్మీట్టుగదరా, యేదో పరీక్షుందని పొద్దున్నే యెలబారి పోయింది. దీనికేమో వొళ్లు సలసలా కాగతిణ్ణింది. ఆటో దొరకాలన్నా మెయిన్‌రోడ్డుకు బోవాల. నువ్వేమో యెంతసేపిటికీ రాకపోతివి. నీ డ్రైవరుద్యోగంలో యెప్పుడొస్తావో యెప్పుడు పోతావో తెలిస్తేగదా" అంది మల్లమ్మ.

"యీడి సంగతెల్లుసుగదా మణికోసం మనింటిచుట్టూ తిరగతావున్నాడు. పనీపాటాలేని యెదవ" అని జేబులోంచి కొన్ని వందరూపాయల నోట్లు తీసి మల్లమ్మకిచ్చాడు జైరాజ్.

"జీతమొచ్చిందా?" అనడిగింది మల్లమ్మ, నోట్లు తీసుకుంటూ.

"వొగటోతేదీకే జీతమిస్తే మా సారు చిదంబరం సారెందుకైతాడు. పూజాసామానులకు మా మేడం డబ్బిచ్చిందిలే. ఆ షాపతన్ని యెప్పుడన్నా అర్జంటంటే మార్కెటుకు కార్లో దింపుతావుంటా, యేమనుకోడు. జీతమొచ్చినా కిస్తానని చెప్తాలే"

"జాగర్త నాయనా, పెద్దోళ్లతో యవ్వారం, చెడ్డపేరు తెచ్చుకోవద్దు. మీ నాయనే ఆ ఫ్యాక్టరీ వుద్యోగంలో సచ్చిపోకుండా వుణ్ణింటే నీకీ పాట్లు వొచ్చిండేవా"

"అట్లాంటి ఫ్యాక్టరిలో పన్జేసినందుకే నాయన సచ్చిపోయింది. సరే, టైమైతాంది, నేను బోవాల" అని మగతగా పడుకోనున్న దీప దగ్గరికెళ్లి మంచంపట్టెమీద కూర్చున్నాడు. దీప నీరసంగా నవ్వింది. చెల్లెలి తలనిమిరి "డాక్టరు మందిచ్చినాడుగదా తగ్గిపోతిందిలే" అని లేచాడు.

"రొణ్ణిముషాలుండరా రొట్టెతిని పోదువు గాని" అంది మల్లమ్మ.

"యిప్పుటికే ఆల్సెమైంది, మేడమ్ పూజ టైముకు సామాను అందిచ్చకపోతే ఆమే వొక కాళికాదేవైపోతింది" అంటూ బయటికి నడిచాడు జైరాజ్.

మల్లమ్మ కొడుకు వెనకాలే వచ్చి "జై..., మాణిక్యం ఫోన్జేసినాడు. నీకు జేస్తే నువ్వు ఫోనెత్తలేదంట. రొణ్ణెల్లనించీ వొడ్డీగూడా కట్టడంలేదని కోపంగా మాట్లాడినాడు" అంది చిన్నగా.

"నీకూ చేసినాడా? చిదంబరంసారు రూపాయొడ్డీకి అప్పిస్తానని నేనుద్యోగంలో చేరినప్పుడు చెప్పినాడు. యీపొద్దు మళ్లా అడగతా. ఆయనిస్తే మాణిక్యం బాకీలో ముక్కాలుబాగం తీర్చెయ్యొచ్చు" అని వీధిలోకొచ్చాడు జైరాజ్.

పూజాసామగ్రి తీసుకుని ఎంత తొందరగా వెళ్లినా ఆలస్యమై చిదంబరం భార్య అతని మీద కేకలేసింది. పూజకు వేళ మించిపోతూందని అంతటితో వదిలింది.

జైరాజ్ కారు తుడుచుకునేలోపలే చిదంబరం రెడీఅయి పోర్టికోలోకి వచ్చి మెట్లమీద అసహనంగా నిలబడ్డాడు, గబగబ కారు స్టార్ట్ చేసి వెళ్లి అతన్నెక్కించుకున్నాడు.

"యీరోజు మనం సైట్లెంబడి చాలా తిరిగేదుంది, నువ్వు రోజంతా కారు దగ్గిరే వుండాల" అన్నాడతను కారెక్కగానే.

పొద్దున పది దాటింది. ట్రాఫిక్ విపరీతంగా ఉండడంతో కారు నిదానంగా వెళ్తూంది.

"సార్ మాణిక్యం మాయింటిగ్గూడా ఫోన్లు చేస్తావున్నాడు. మీరిస్తాన్న అమౌంటు" అని చిదంబరానికి గుర్తుచేసాడు జైరాజ్. చిదంబరం అతనిమాట వినిపించనట్టు ఫోన్లో ఏదో చూసుకోవడం మొదలుపెట్టాడు. జైరాజ్ మళ్లీ చెప్తూ ఆ నెల జీతం గురించి కూడా చెప్పాడు.

"అవన్నీ రాత్రి మాట్లాడదాం, డ్రైవింగ్ చేసేప్పుడు మాట్టాడొద్దన్నానా? నడిపేప్పుడు కారు వోనర్ల విలువైన ప్రాణాలు మీ చేతుల్లో వుంటాయని చెప్పినాగదా!" అరిచాడు చిదంబరం.

సికింద్రాబాదు ఆఫీసు దగ్గర అతన్ని దింపాక "గంటలో సైటుకెళ్లాలి, నువ్వు టిఫిన్ చేసివుండు" అని చెప్పి వెళ్లాడు చిదంబరం.

కారు పార్క్ చేసి బేకరీ వైపు నడుస్తూ ఫోన్ చూసుకున్నాడు జైరాజ్. రెండు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. మొదటిది మళ్లీ చంద్రకళ నుంచి. 'ఆమె ఫోన్ చేసినప్పుడు ఎక్కువభాగం తను డ్రైవింగ్‌లోనే ఉంటాడు. వాళ్ల నాయన ఇంట్లో లేనప్పుడో లేదా ఆమె బయటికొచ్చి చేసినప్పుడో మాట్లాడాల్సిందేతప్ప మిగతా టైంలో తను చేసేదానికి లేదు. ఆయన తెలుసుకుంటాడని భయపడి వద్దంటుంది. తనకు ఫోన్లు చెయ్యొద్దంటే వినదు' అనుకున్నాడు.

చంద్రకళ మాట్లాడినప్పుడు బావున్నా ఆ తరువాత అతని గుండె బరువెక్కుతుంది. ఆమె బాధలు వినడం తప్ప ఏదీ చెప్పలేని అసహాయ స్థితి. ఆమె ఇతని పరిస్థితిని అర్థం చేసుకున్నా పట్టించుకోదు. ఏదోవిధంగా పెళ్లైపోతే తరువాత అన్నీ అవే సర్దుకుంటాయని ఆమె నమ్మకం. ఆమె తండ్రి గురించి బాగా తెలిసిన అతనికి అది ఆమె అమాయకత్వమని విశ్వాసం.

రెండోది మాణిక్యం నుంచి. 'అతనికి ఫోన్ చెయ్యడమంటే పులి గుహలోకి మనమే యెదురెళ్లినట్టు. మాట్లడకపోతే అమ్మకు రోజూ ఫోన్జేసి బాధపెడతాడు, ఈవూరొచ్చినప్పుడు యింటికొచ్చి కూతురు వయసులో వున్న పెద్ద చెల్లెలు మణితో ఎకసెక్కాలాడతాడు. డబ్బు బాకీ వుంటే అన్నిటికీ లోకువైపోతారా? మాణిక్యం సరే, డబ్బు విషయంలో మంచివాళ్లు కూడా ఎందుకంత గట్టిగా మారిపోతారో తనకెప్పుడైనా బోధపడుతుందా?' అనుకుంటూ మాణిక్యానికి ఫోన్ చేసి "సారీ అనా, డ్రైవింగ్లో వుండి ఫోన్ తీలా" అన్నాడు జైరాజ్. ఆ తరువాత ఐదు నిముషాలు అతని తిట్లను, బెదిరింపులను ఓపిగ్గా భరించి "మా సారు రేపు మన్నాట్లో దుడ్లిస్తానని నమ్మకంగా చెప్పినాడనా" అని మరోసారి హామీ యిచ్చాడు.

మాణిక్యం మాటలకు అతనికి గొంతులోకి తన్నుకొచ్చిన బాధను కష్టంగా దిగమింగాడు.

'జింకలున్నచోట తోడేళ్లు పుట్టుకురావడం ప్రకృతిలో సహజమని తన సైన్సు మాస్టారు చెప్పేవాడు. ఐతే ఇది అడవి కాదుగదా' అనుకున్నాడు జైరాజ్.

"నైట్ డ్యూటి చేసినవా, కళ్లెర్రబడినయ్" జైరాజ్‌కు బ్రెడామ్లెట్ వేస్తూ అడిగాడు బేకరి యజమాని నరేందర్. అక్కడి డ్రైవర్లు, ఇతర వర్కర్లలాగే జైరాజ్ ఆ బేకరీలోనే తింటూంటాడు.

"యిప్పుడే మాణిక్యం ఫోన్లో తిట్టరాని తిట్లు తిట్టినాడునా"

"అసలు నువ్వావూబిలో యెట్లపడినవ్ జై"

"అదంతా పెద్ద కథనా" అని బ్రెడామ్లెట్ తింటూ చెప్పాడు జైరాజ్ "మా నాయన రేణిగుంటకవతల ఫ్యాక్టరీలో పనిచేస్తా ఆక్సిడెంట్లో చనిపోయినాడని చెప్పినాగదా. ఫ్యాక్టరీవాళ్లు ఆయన్దే తప్పనితేల్చి కొంతదుడ్డు పరిహారంగా మా మొహానకొట్నారు. నేను డిగ్రీ మూడోసంవత్సరంలో వుంటినా వాళ్లమాటలు యీళ్లమాటలు విని చదువు సాలిస్తిని. అప్పుటికే డ్రైవింగ్ వచ్చిణ్ణింది. పరిహారందుడ్డు పెట్టి కొత్తకారు కొన్నా. తక్కువైంది మాణిక్యం దగ్గిర అప్పు తీస్కున్నా. తిరప్తికి కొండమీదికి తిప్పేది మొదులుపెట్టినా. బెంగుళూరు, చెన్నై బేరాలు గూడా తగల్తావుణ్ణాయి. మొదుట్లో బాగనే జరగతావుణ్ణిందినా. సగం అప్పుగూడా తీర్చేసినా" అని, ఇంకోకస్టమరు రావడంతో చెప్పడం ఆపి తినడం పూర్తిచేసాడు జైరాజ్.

"మళ్లేమాయె" అన్నాడు నరేందర్ కస్టమరు వెళ్లిపోయాక.

"యేమైతిందీ డ్రైవర్లందరికీ అదే శాపంగదనా. వొకతూరి చెన్నైలో ప్యాసెంజర్లను దింపి వొక్కణ్ణే వస్తావుంటి. పెరియపాలెం దాట్నాక మలుపుదగ్గిర లారీవాడు ర్యాష్‌గా వొచ్చి గుద్దేసినాడు, కారు తుక్కైంది. అదృష్టం బాగుండి నాకు చెయ్యొకటే యిరిగింది, రెణ్ణెల్లు ఆస్పత్రిపాలైనా. ఆ లారీ వోనర్ది పెద్ద కంపెనీ, కోటీస్వరుడు. పైగా వాళ్లస్టేట్లో జరిగింది. నాదే తప్పని తేల్చినారు. నా మీద కేసుపెట్టకుండా దయజూపినామన్నారు. వొచ్చిన యిన్సూరెన్సు దుడ్లు ఆస్పత్రి కర్చులకే సరిపోలేదు. టైముకు తీర్చలేదు గాబట్టి, అగ్రిమెంటులో వుందన్జెప్పి మాణిక్యం కొత్తలెక్కలేసి బాకీ తిరప్తి కొండంత జేసినాడు. యింగ డ్రైవరుగా ఆడకుదరక యీ సిటీకొచ్చినాము. ముందైతే నలుగురు బతకాలగదన్నా"

అక్కడే మరో కారుకు డ్రైవరుగా పనిచేస్తున్న రాములు వచ్చాడు. నరేందర్ ఇద్దరికీ టీ ఇచ్చాడు.

"పోనీ ఏదన్నా క్యాబ్ కంపెనీలో జేరకపోయినవా జై" అన్నాడు నరేందర్.

"అది స్వంత బండ్లుండేవాళ్లకు పనికొస్తుందిగాని మాలాంటోళ్లక్కాదు నరేందర్ బయ్యా. అద్దెకు కొత్తబండ్లెంతమందికి దొరుకుతాయి? పాతవి నడిపితే సిటీట్రాఫిక్ దెబ్బకు నరాలు తెగిపోవడంతప్ప నెలాఖర్న పెద్దగా మిగిలిదేమీ వుండదు" అన్నాడు రాములు.

"ఆ కథా అయ్యిందినా. అసలు మేమీ హైద్రాబాదొచ్చిందే క్యాబుల్లో పనిచేస్తే యెంతో కొంత మిగిల్తిందని. అర్నెల్లకే అర్థమైంది పాతబాడుక్కార్లతో పనిగాదని. నేనొక్కణ్ణే రాకుండా పనిమాలి మా ఫ్యామిలిని గుడా తెచ్చినా. చిదంబరంసారు వుద్యోగమేగాకుండా అడ్వాంసుగా అప్పు గుడా యిస్తానంటే ఆయనద్దగ్గిరజేరి అవస్తలు పడతావున్నా" అన్నాడు జైరాజ్.

నరేందర్ వేరే కస్టమర్లొస్తే అటెళ్లాడు.

"యేమంటున్నాడు మీ సారు?" అడిగాడు రాములు

"డ్రైవరు కారు నడిపితే చిదంబరంసారు యెనకసీట్లోనించి డ్రైవరును నడుపుతాడు రాములన్నా. కారెక్కినకాణ్ణించి దిగిందాకా 'స్పీడుగా బోనీయ్.... రెడ్ లైటు పడేలోపల సిగ్నల్ దాటేయ్... ఆ బైకువాడొస్తున్నాడు చూసుకో.... ఆ తెల్లకారు నెంబరెంత చూడు....' యిట్లా అరస్తానేవుంటాడనా. సరింగా సిగ్నల్ దాటేముందు యింగోపక్క తిరగమని చెప్తాడు. యెక్కడెంతసేపుంటాడో చెప్పడు. రాత్రిం బగుల్లు కార్లోనే వుంటావున్నా. యింటికి బోయిరావాలన్నా, కడాకు టీ తాగి రావాలన్నా టెంషనే" తనగోడు చెప్పుకున్నాడు జైరాజ్.

"వోనర్లంతా అట్లుండరుగాని మీ చిదంబరం సారు మాత్రం గొప్పోడు. ఆయనద్దగ్గర డ్రైవరుగా ఆర్నెల్లకు మించి వున్నోడిని నిన్నే చూస్తావున్నా జై. నీకంటే ముందుండిన బాలునాయక్ రోజూ యేడ్చేవాడు" అన్నాడు రాములు.

"ఆయన అప్పుగా దుడ్లిస్తే ఆయన బాకీ తీరిందాకా ఆయనదెగ్గిర పంజేస్తా రాములన్నా. అవసరాలున్నోణికి వూరంతా అడివే. ముందు మాణిక్యం బాకీ తీరితే చాలు" అని జైరాజ్ పక్కనున్న నేరేడుచెట్టుకిందకెళ్లి ఇంటికి ఫోన్ చేసి దీప జ్వరం కొంచెం తగ్గిందని తెలుసు కున్నాడు. తిరిగొచ్చేసరికి నరేందర్ రాములుతో చెప్తున్నాడు.

"మనవోళ్లు పొద్దై కడుపు చేత్తో పట్టుకొని సిటీలకొస్తున్నం. కాని సిటి బరువంత మనమీదే పడుతున్నదన్నట్టు నలిగిపోతున్నం. రోజూ యింటికి పనికి మైళ్లకొద్దీ బస్సుల్ల దిరిగాలె. అటు తళ్తళా మెరిసే బిల్డింగులు యిటేమో మనకు బాత్రూంబోవాలన్నా కనాకష్టం. ఆడపిల్లల పరిస్తితి చెప్పేపనేలేదు. సిటీలైఫు బేజారైతదిగాని వెనక్కుబోయే పరిస్థితిలేదు" అన్నాడు నరేందర్ దిగులుగా నేరేడుచెట్టు వైపుచూస్తూ.

నేరేడుచెట్టు నరేందర్ బేకరీ పక్కన రెండు బిల్డింగుల మధ్య పాతిక అడుగుల వెడల్పు ఖాళీ స్థలంలో ఉంటుంది. అదెప్పటిదో ముసలిచెట్టు. దానికింద ఐదడుగుల ఎత్తున్న పాతబడిన చిన్న గుడి ఉంది. గుడి వెనకవైపు చెట్టునీడలో ఆ చుట్టుపక్కల పనిచేసేవాళ్లు క్యారేజిల్లో తెచ్చుకున్న తిండి తింటారు, ఆ చెట్టు కిందికి పోయి ఫోన్లలో మాట్లాడుతుంటారు.

"అదేంగుడినా? లోపల పులిమింద కూచ్చున్న దేవుడి బొమ్మొంటింది" నరేందర్ని అడిగాడు జైరాజ్.

"యెవరికెరిక? ముందిదంతా పెద్ద తోటంట. గుడి యెప్పుడు కట్టిన్రో తెలీదు. రోజూ యెవరో పొద్దున్నే వొచ్చి పూజ చేసిపోతరంతే"

"పులిస్వారీ అంటే మాటలుగాదనా. కొండమనుషుల దేవుడైవుంటాడు. మావూరి కోనదగ్గిర యిట్లాటిదే వుంది, ఆ పులిబొమ్మను చూస్తే మనం అదురుకోవాల్సిందే"

"పులిమీదున్నతను యెవరైతేనేంది, ఆ గుడైనా వుంది గాబట్టి ఆ చెట్టు, ఆ స్థలం మిగిలున్నయి. మనవాళ్లంతా పోయి ఆ చెట్టు కింద ఫోన్లల్ల కష్టాలు మాట్లాడేది విని ఆ దేవుడు, పులి యెప్పుడో పారిపోయుంటరు. యీమాటెవర్తోనన్న అనేవ్ జై. అక్కడ దేవుడు లేడని ప్రచారమై పదిరోజుల్లో చెట్టు, గుడి తీసేసి అక్కడ బిల్డింగు కట్టేస్తరు" అన్నాడు నరేందర్ నవ్వుతూ.

జైరాజ్‌కి మిస్డ్ కాల్ వచ్చింది. కాల్ చూసుకుని "చిన్నమేడం, మా సారు కూతురు" అంటూ పక్కకెళ్లి ఆమెకు ఫోను చేసాడు. రెండు నిముషాలు మాట్లాడాక తిరిగొచ్చి "వస్తానా. జూబ్లీహిల్స్‌లో సారింటికిబోయి చిన్నమేడం నెక్కించుకోని దిల్సుక్‌నగర్లో వాళ్ల ఫ్రెండింట్లో దింపి మళ్లా మా సారు కోసం యిక్కడికి రావాల" అని కారు దగ్గరికి పరిగెత్తాడు జైరాజ్.

చిదరంబరం భార్య మరో పని కూడా చెప్పడంతో జైరాజ్ రావలసిన సమయం కంటే అరగంట ఆలస్యంగా వచ్చాడు. పార్కింగు దగ్గర చిదంబరం అప్పటికే పచార్లు చేస్తున్నాడు.

సిటీ బయట బిల్డింగు సైట్ల వైపు వెళ్తూ మధ్యాహ్నభోజనానికి చిదంబరం శివార్లలోని తన వ్యాపార భాగస్వామి విల్లా దగ్గర ఆగాడు. అక్కడ హొటళ్లు లేకపోవడంవల్ల జైరాజ్ కార్లో పెట్టుకున్న బిస్కట్లు, జాంపండు తిన్నాడు.

చెట్టుకింద వెయిటింగ్లో ఉండగా చంద్రకళ దగ్గర్నుంచి ఫోనొచ్చింది. వెంటనే తీసాడు.

"రెండ్రోజుల్నించి చేస్తావున్నా, రాజుగారికి ఫోన్తీసేదానికే తీరికలేదు" అంది కోపంగా.

"నాకంత కళలేదని తెలిసినా 'షరామామూలే' అన్నట్టు అంటానేవుంటావు" అన్నాడు.

చంద్రకళ ఆపకుండా ఐదునిముషాలు మాట్లాడింది. 'తనకు ఒక పెళ్లి సంబంధం ఖరారైందని, జైరాజ్ వెంటనే తిరుపతొచ్చి తనను తీసుకెళ్లి ఏ గుళ్లోనో రహస్యంగా పెళ్లిచేసుకోవా'లని గట్టిగా చెప్పింది. 'ఎప్పుడొస్తా'వని ఏడ్చింది. జైరాజ్ రాకపోతే 'ఎవరికీ చెప్పకుండా తనే హైద్రాబాదు వచ్చేస్తా'నని బెదిరించింది.

'తొందరపడి ఏమీ చెయ్యొద్దనీ, తను నాలుగు రోజుల్లో తిరుపతి వచ్చి అన్నీ వివరంగా మాట్లాడతా'నని ధైర్యం చెప్పాడు జైరాజ్. చిదంబరం రావడంతో ఫోన్ పెట్టేసాడు.

డ్రైవ్ చేస్తూ ఆలోచనల్లోపడ్డాడు జైరాజ్. అతనికి చాలా దిగులేసింది. 'ఆమె కోరినట్టు తనసలు ఆమెను పెళ్లిచేసుకోగలడా? చిదంబరమో మరొకరో డబ్బుసర్దినా, ఒక ఊబిలోంచి మరొక ఊబిలోకి వెళ్లడమే. ఇప్పుడు పెళ్లి చేసుకోవడమంటే చంద్రకళనుగూడా ఊబిలోకి లాగడమే. ఆమె నాకు కళ కాదు కల' అనుకున్నాడు.

'రెండు మూడు రోజుల్లో తిరుపతికి వెళ్లి తనని మరచిపొమ్మని ఆమెకు ఎలాగైనా

నచ్చజెప్పాలి. కష్టమైనా సరే ఇంక ఆమెను తల్చుకోకుండా ఉండాలి' అని నిర్ణయించుకున్నాడు.

సైట్లు చూసుకొని, అక్కడక్కడా తిరిగి రాత్రి తొమ్మిదికి చిదంబరం ఒక కొత్తమనిషితో స్టార్ హొటల్లో డిన్నర్ చేసాడు. కారును పదిగంటలకు ఒక మల్టిప్లెక్స్ దగ్గర ఆపించాడు.

“యిది 'లైఫ్ ఆఫ్ పై' అని ఆ మధ్య వచ్చిన సినిమా. బెనిఫిట్ షో అన్జెప్పి మూడు టికెట్లు తగలగట్టారు. నా ఫ్రెండుతో మాట్లాడేదుంటే సిన్మాలోకూర్చొని మాట్లాడుకుందాం యిక్కడికే రమ్మన్నాను. కారు పార్కింగులో పెట్టి నువ్వూ సినిమాలో కూర్చో, వూరికే బైటేంజేస్తావ్” అని జైరాజ్‌కి టికెట్టు ఇచ్చి లోపలికెళ్ళిపోయాడు చిదంబరం.

జైరాజ్ ఇంటికి ఫోన్ చేస్తే దీపకు మళ్లీ జ్వరం వచ్చిందని, మణి ఇంటికొచ్చేసరికి సాయంత్రమైందని వాళ్లమ్మ చెప్పింది. దగ్గర్లో వున్న బడ్డీ దగ్గర సమోసాలు తిని, టీ తాగి తమ స్క్రీన్ చూసుకుని లోపలికెళ్లాడు.

సినిమా అయ్యాక ఇంటికి వస్తున్నప్పుడు “సినిమా బావుంది జై, నీకు అర్థమైందా?” అని అడిగాడు చిదంబరం.

“అర్థమైంది సార్” అన్నాడు జైరాజ్.

“సినిమాలో ఆ 'పై' అనే కుర్రాడు పాపం ఆ చిన్న పడవలో అన్ని రోజులు భయంకరమైన పెద్దపులిని పక్కనబెట్టుకుని ప్రాణాలరచేత్తో పట్టుకుని వెళ్లడం యెంతకష్టం! టెన్షన్‌తో వాడు క్షణక్షణం నరకం అనుభవించి వుంటాడు?” అన్నాడు చిదంబరం.

“పెద్దపులిదేముంది. నాతో పోలిస్తే ఆ 'పై' అనేవోడిది యేం పెద్ద టెంషన్ సార్. వాణ్ణొచ్చి మీ దగ్గిర డ్రైవరు పని వొక్కరోజు చెయ్యమనండి తెలుస్తుంది” అన్నాడు జై నిస్పృహగా, రద్దీలేని రాత్రిరోడ్డు మీద వేగంగా కారుపోనిస్తూ.

“అంతేనంటావా” అని చిదంబరం పెద్దగా నవ్వేసి మంచి మూడ్లోకెళ్లి దారి పొడుగునా సరదాగా మాట్లాడాడు. ఇంటిదగ్గర కారు దిగగానే జైరాజ్‌కు ఇవ్వాల్సిన జీతం, ఇస్తానన్న అప్పులో సగం ఫోనుద్వారా బదిలీచేసి వడ్డీరేటుని, తిరిగివ్వాల్సిన తేదీలను చెప్పాడు. ఆ సమయంలో అతని మాటలు సరదాగా లేవు. ఐనా మాణిక్యం బాకీ చాలావరకు తీరుతుందని జైరాజ్‌కి సంతోషమే కలిగింది.

ఆ మరుసటిరోజు చిదంబరాన్ని తీసుకుని కార్లో బెంగుళూరెళ్లాల్సొచ్చింది జైరాజ్. మూడురోజు సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో చంద్రకళ చాలాసార్లు ఫోన్ చేసిందిగాని డ్రైవింగ్‌లో అతనికి మాట్లాడ్డానికి కుదరలేదు.

బెంగుళూరులో బయల్దేరేముందే తన దగ్గరున్న డబ్బులో చాలావరకు మాణిక్యానికి పంపించి దాదాపు ఖాళీ జేబుల్తో ఇంటికి వచ్చాడు. కాస్త రిలీఫ్‌గా వున్నా నలుగురికి ఈ నెల గడవాలంటే మళ్లీ ఎవరిదగ్గరైనా చేబదులు తీసుకోక తప్పదు. ఇప్పుడున్న సమాజంలో తనలాంటివాళ్లు ఎంత కష్టపడినా అడుగడుగునా బాధల్లేకుండా ఎందుకు బతకలేకపోతున్నారో అతనికి అంతుపట్టలేదు. తన బరువుకే కూలిపోయే వంతెన మీద తను నడుస్తున్న అనుభూతి కలిగి భయమేసింది.

రాత్రంతా కారు నడిపిన ఎర్రని కళ్లతో తెల్లవారుతూండగా ఇల్లు చేరాడు. జైరాజ్ వీధి తలుపు తట్టగానే తెరుచుకుంది.

తలుపుకవతల చంద్రకళ! కట్టుబట్టలతో రాత్రికిరాత్రి బయలుదేరి తిరుపతి నుంచి వచ్చేసినట్టుగా చెదరిన తల, నలిగిన బట్టలు, అర్థంకాని చిరునవ్వు.

ఆమె వెనకాలే మెరుస్తున్న కళ్లతో అమాయకంగా నవ్వుతూ నిలబడిన జైరాజ్ చెల్లెళ్లు. ✷








కె.కె.ఆర్. సంస్మరణలో....

# పుట్టుకలోనే మరణం ఉన్న సిద్ధాంతం

**సంపన్న ప్రథమ ప్రపంచ దేశాల్లోని ప్రత్యేక పరిస్థితుల్లో పుట్టిన ఉత్తరాధునిక వాదంలో తృతీయ ప్రపంచ దేశాలకు సంబంధించిన వాస్తవాలను చూడడానికి నిరాకరించే తత్త్వం ఉంది.**

– కె. కె. రంగనాథాచార్యులు

**అయిదారు** సంవత్సరాల క్రితం ఒక సామాజిక, రాజకీయ వారపత్రికలో ఓ సాహిత్య విద్యావేత్త ప్రపంచవ్యాప్తంగా మూడు నాలుగు దశాబ్దాలుగా అనేక రకాలుగా వినవస్తున్న సాహిత్య సిద్ధాంతాలను గురించి వ్యాసం రాశాడు. అందులో వలసానంతరం తృతీయ ప్రపంచ దేశాలలో వస్తున్న సాహిత్యాన్ని గురించి, అదే కాలంలో సామ్రాజ్యవాద కేంద్రాల నుంచి వస్తున్న సాహిత్య, సాంస్కృతిక సిద్ధాంతాలను గురించి ఆసక్తిదాయకమైన చర్చ చేశాడు. ఈ సిద్ధాంతాల ఆధారంగా వస్తున్న సాహిత్య విమర్శ, విశ్లేషణలలోని వైరుధ్యాలను, అవాస్తవాలను, వాటి అన్వయంలోని వికృత స్వభావాన్ని వివరించాడు.

తృతీయ (వర్ధమాన), ప్రథమ ప్రపంచ (సంపన్న) దేశాల మధ్య కొన్ని దశాబ్దాలుగా సాహిత్య వాణిజ్యంలో గమనించదగ్గ సమస్థితి ఒకటి కనిపిస్తున్నదని అమెరికన్ విశ్వవిద్యాలయాలలోని సిద్ధాంతవేత్తలు కొందరు సూచిస్తున్నారు. గతంలో ఆర్థికంగా, సైనికంగా వలసలుగా ఉండిన దేశాల ప్రజల నుంచి చాలా ముఖ్యమైన సాహిత్యం వస్తున్నది. ఒకప్పుడు వాళ్ళమీద అధికారం నడిపిన సామ్రాజ్యవాద దేశాల నుంచి ఉత్తేజకరమైన సాహిత్య విమర్శ సిద్ధాంతాలు వస్తున్నాయి. ఉత్తరాధునికవాద (ఆధునికానంతర వాద), ఉత్తర నిర్మాణవాద సాహిత్య సిద్ధాంతాలకు, వలసానంతర సాహిత్యానికి గల సహకార స్వభావం ప్రథమ ప్రపంచ దేశాలకు, తృతీయ ప్రపంచ దేశాలకు మధ్య వారధిగా పనిచేయగలదని, దీనివల్ల మేథో రంగంలో శాంతియుతమైన నిర్వలసీకరణ సాధ్యమని ఈ అమెరికన్ సాహిత్య సిద్ధాంతవేత్తలు ప్రతిపాదిస్తున్నారు. సాహిత్య సాంస్కృతిక రంగంలో సాధారణ విమర్శకుడు కూడా ప్రపంచీకృతమైన ఈ నెట్‌వర్క్‌లో పాలుపంచుకోవడానికి అవకాశం ఉందని, ఈ సిద్ధాంతాలను పరస్పర సాపేక్షమైన యాత్రా సిద్ధాంతాలుగా పేర్కొనవచ్చని అభిప్రాయపడుతున్నారు.

ఈ అభిప్రాయాలను గమనిస్తే ఇది ఒకరకమైన సాంస్కృతిక శ్రమ విభజన లాగా కనిపిస్తుంది. వలస పాలన కాలంలో సామ్రాజ్యవాద దేశాల పరిశ్రమలకు వలస దేశాలు ముడిసరుకులను సరఫరా చేసేవి. మారుగా ఈ ముడిసరుకులతో తయారైన పారిశ్రామిక ఉత్పత్తులకు వలసలు మార్కెట్‌గా ఉపయోగపడేవి. ప్రస్తుతం సాంస్కృతిక శ్రమ విభజనకు కూడా అలాంటి స్వభావమే ఉన్నట్టు కనిపిస్తుంది. తృతీయ ప్రపంచ దేశాలు సాహిత్యాన్ని అందిస్తున్నాయి. ప్రథమ ప్రపంచ దేశాలు సిద్ధాంతాలను ఉత్పత్తి చేస్తున్నాయి. దానికి మార్కెట్ మళ్ళీ తృతీయ ప్రపంచ దేశాలే. దీని పేరే సాంస్కృతిక ప్రపంచీకరణం. ఇందులో రెండు ప్రపంచాలకు సమాన ప్రతిపత్తి ఉందా అనేదే ప్రశ్న.

స్థూలంగా 1950లలో మొదలై 1960ల నుంచి విస్తృతంగాను, బహువిధాలుగాను సామాజిక, సాంస్కృతిక, కళా, సాహిత్య సిద్ధాంతాలెన్నో ప్రథమ ప్రపంచ దేశాలలో ఉత్పత్తి అవుతున్నాయి. సాహిత్య విమర్శ పద్ధతులలో అతివేగంగా మార్పులు వస్తున్నాయి. ప్రతి కొత్త సిద్ధాంతమూ కొన్ని రోజులలోనే పాతది అయిపోతుంది. సమాచార సాంకేతిక రంగంలో వస్తున్న వేగమూ, మార్పూ ఈ సిద్ధాంతాలలో కూడా కనిపిస్తాయి. మూడు, నాలుగు దశాబ్దాలుగా వస్తున్న ఈ సిద్ధాంతాలకు స్వయం ప్రకాశకమైన పేర్లు లేవు. ఇది ఆ సిద్ధాంతాలకుండే ద్రవస్థితిని, అసమగ్రతని, అసంపూర్ణతని తెలియజేస్తాయి. అంతకు ముందు ఉండే సిద్ధాంతాలను, భావనలను తెలియజేసే పదాలకు ముందు 'పోస్ట్' చేర్చడం ద్వారా ఈ సిద్ధాంతాలు సూచితమవుతున్నాయి. పోస్ట్ మోడర్న్, పోస్ట్ కలోనియల్, పోస్ట్ ఇండస్ట్రియల్, పోస్ట్ మార్క్సిస్ట్, పోస్ట్ స్ట్రక్చరల్ – ఇంకా ఇలా ఎన్నైయినా చెప్పవచ్చు.

భారతదేశంలాంటి పూర్వ వలస దేశాలకు సంబంధించి పోస్ట్ ఇండిపెండెంట్ అన్న పదం వాడుకలో ఉంది. కొన్ని పదాలలో పోస్ట్ – తరువాత అనే అర్థాన్ని సూచిస్తుంది. ఇది స్పష్టంగా కాల విభాగ సూచకం. కొన్ని కాల విభాగంతో పాటు ప్రత్యేక లక్షణాలను, స్వభావాలను కూడా సూచిస్తాయి. కొన్ని ఏ పదానికి 'పోస్ట్ చేరిందో ఆ పదం సూచించే భావనకు సంబంధించిన మరో దశను గాని, దానికి సంబంధించిన విమర్శనుగాని సూచిస్తాయి. కొన్ని ఆ భావనల కొనసాగింపును సూచిస్తాయి. పోస్ట్ – చెప్పే అర్థాన్ని బట్టి తెలుగులో ఉత్తర, అనంతర అనే పదాలను వాడవచ్చు. కొన్ని సిద్ధాంతాలకు రకరకాల నిర్వచనాలు, కోణాలు ఉన్నందువల్ల కొంత తికమక ఏర్పడే అవకాశం ఉంది. 'పోస్ట్' లాగే 'లేట్' అనే పదాన్ని చేర్చిన పద బంధాలూ ఉన్నాయి. లేట్ – ప్రత్యేక దశను సూచిస్తుంది. లేట్ కేపిటలిజం, లేట్ మోడల్ ఇలాంటివే. నయా సామ్రాజ్యవాదం, నయా మార్క్సవాదం సుపరిచితాలే. వీటితో పాటు విచ్ఛిత్తిని సూచిస్తూ తెలుగులో అంతంలో వాడే 'అంతం' కూడా ఉంది. మహా కథనాల అంతం, చరిత్ర అంతం, మార్క్సిజం అంతం, సిద్ధాంతాల, భావజాలాల అంతం – ఇలా అనేక అంతాలు చర్చలలో కనిపిస్తూ ఉంటాయి. వేదాంతం మొదలుకొని ఈ అంతాలకు అంతులేదు. ఆర్థికరంగంలో అమెరికాతో జపాన్ పోటీకి నిలబడగలిగే స్థాయికి చేరుకొనే దశలో 'అమెరికా అంతం' అన్న

ఆక్రోశం వినిపించింది. ఈ సందర్భంలో రావిశాస్త్రి 'ఆఖరిదశ' కథ మనకు జ్ఞాపకం రావచ్చు. అంతాలతో పాటు మరణాలు ఉన్నాయి. ఈ సిద్ధాంతాలలో పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజంలు సామాజిక శాస్త్రంలో, అంతకంటే ఎక్కువగా సాహిత్య విమర్శ రంగంలో ప్రచలనంలో ఉన్నాయి. వీటికి సమానంగా తెలుగులో స్థూలంగా ఉత్తరాధునికవాదం, వలసానంతరవాదం అనే పదాలను వాడవచ్చు. పోస్ట్ మోడర్న్, పోస్ట్ కలోనియల్‌లలోని పోస్ట్ సంపన్న ప్రథమ ప్రపంచ దేశాలు తమ సాంస్కృతిక ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడానికి ఏర్పడిన ఖాళీని భర్తీ చేసే పదం అని ఒక ఆఫ్రికన్ మేధావి అంటాడు. తరువాత ఏమిటి అన్న ప్రశ్నకు 'పోస్ట్' సమాధానం.

ప్రస్తుత సిద్ధాంతాలలో చాలావరకు ఫ్రాన్స్‌లో ఉత్పత్తి అయినవే. అక్కడి నుంచి అనువాదాల రూపంలో అమెరికాకు, బ్రిటన్‌కు, ఇతర పశ్చిమ యూరప్ దేశాలకు ఎగుమతి అవుతాయి. విశ్వవిద్యాలయాలలో ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి తృతీయ ప్రపంచ దేశాలకు దిగుమతి అవుతాయి. సెమినార్లు, విజిటింగ్ ఫెలోషిప్‌లు, పరస్పరం రాకపోకలు (సాధ్యమైతే స్థిరమైన ఉద్యోగాలు) ప్రారంభమవుతాయి. అదొక్క యాత్రా చరిత్ర. అందుకే ఈ సిద్ధాంతాలను 'పర్యాటక సిద్ధాంతాలు' అన్నారు. ఈ సిద్ధాంతాల పరిజ్ఞానం విదేశయానానికి పాస్‌పోర్టుగా, వీసాగా పని చేస్తుంది. సాంకేతిక రంగంలో కంప్యూటర్ సైంటిస్టులు, సాంస్కృతికరంగంలో ఇటువంటి మేధావులు ప్రస్తుతం అమెరికాకు ఎంతో అవసరం. తృతీయ ప్రపంచ దేశాలకు చెందిన మేధావులు, విద్యావేత్తలు అమెరికన్, యూరోపియన్ విశ్వవిద్యాలయాలలో చేరిన తరువాతనే వలసానంతర వాదం ప్రారంభం అయిందా, అని ఒక సాంస్కృతిక రంగానికి సంబంధించిన విద్యావేత్త వ్యంగ్యంగా ప్రశ్నిస్తాడు. శిష్టస్థాయిలో ఇది అకడమిక్ ప్రపంచం. తెలుగు అకడమిక్ ఉన్నది వదిలించుకోగలిగిందేగాని, ఈ శిష్టస్థాయిని గురించి ఆలోచిస్తున్నట్టు లేదు. తెలుగుకు సంబంధించి విశ్వవిద్యాలయాల వెలుపల సాహిత్య, సాంస్కృతిక ప్రపంచమే తమదిగా బతుకుతున్న యువ బుద్ధిజీవులలో ఈ సిద్ధాంతాల చర్చ ఎక్కువగా జరిగింది, జరుగుతున్నది. వీళ్ళకు దిన పత్రికలు, నాన్ అకడమిక్ పత్రికలు, లేక సొంత ప్రచురణలు వేదిక. నడుస్తున్న చరిత్ర పైన, వర్తమానం పైన పట్టు దొరక్కపోవడం, చాలాకాలంగా పునరావృతమవుతున్న సాహిత్యాధ్యయన పద్ధతులు, భావాలు, సిద్ధాంతాలు అసంతృప్తిని, విసుగుదలను, అసహనాన్ని కలిగించడం – ఏ కొత్త సిద్ధాంతాన్నయినా వెంటనే ఆహ్వానించడానికి కావలసిన వాతావరణాన్ని ఇస్తాయి. కొత్త కోసం, కొత్త సాధనాల కోసం పరితపిస్తున్న వీళ్ళకి కొత్తగా పరిచయం అయ్యే సిద్ధాంతాలు బుద్ధిని మిరుమిట్లు గొలుపుతాయి. అవి ఒక అద్భుత ప్రపంచాన్ని చూపిస్తాయి. 'కొత్త యుగంలో ప్రవేశించాం, కొత్త ఆలోచనలు వచ్చాయి, పాతవన్నీ అంతం అయిపోయాయి' అన్న భావాన్ని కలిగిస్తాయి. వాళ్ళ నిజాయితీని మాత్రం శంకించడానికి అవకాశం లేదు. ఈ పరిస్థితి కొత్తదేమీ కాదు. ఒకరకంగా ఇది చరిత్ర పునరావృతం కావడమే. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందూ, తరువాతా కళా, సాహిత్య రంగాలలో ఆధునికతావాదం పేరిట వచ్చిన సింబాలిజం మొదలైన ఉద్యమాలు, ధోరణులు 'హంగ్రీథర్టీస్'లోని తెలుగు కవులెందరినో అద్భుతంగా ఆకర్షించాయి. ఈ ధోరణులలో కూడా చాలావరకు ఫ్రాన్స్‌లో ఆవిర్భవించినవే. వీటి ఆధారంగా ప్రయోగాలు చేశారు కవులు.

ఆనాటి నుంచి దిగంబర కవుల కాలం దాకా ఎజ్రాపౌండ్, మలార్మే, బాదిలేర్, లూయీ ఆరగాఁ, ఎడ్గార్ ఎలెన్ పో మొదలైన కవుల పేర్లను, వారి కార్యకలాపాలను ఎంతో రొమాంటిక్‌గా చర్చించుకొనేవారు. సంప్రదాయ విమర్శ పరిభాషను పునరావృతం చేసిన భావ కవిత్వ సిద్ధాంతాల సందర్భంలో ఆధునికతావాద ధోరణులు కొత్త ప్రపంచంలోకి తీసుకొని వెళ్ళి ఉండాలి. ఈ పరిధిలోకి రాలేనివాళ్ళెవరూ ఆధునికులుగా కనిపించేవారు కాదు. ఈ నేల పైననే స్వీయ అనుభవాలతో కొత్త చైతన్యంతో గళం విప్పిన జాషువాను సంప్రదాయ సమాజం, తనలో ఇముడ్చుకోగలగడం గొప్ప వైరుధ్యం. సమకాలంలో లియోటార్డ్, జాక్ దెరిదా, బాద్రిలార్డ్, ఫూకో లాంటి పేర్లు వినిపిస్తాయి. ఈ ప్రస్తావన అంతా ఈ సిద్ధాంతాలు అమెరికాలోనో, యూరప్‌లోనో పుట్టాయి గనుక నిరాకరించాలని చెప్పడానికి కాదు. వాటిని నిర్విమర్శగా స్వీకరించడాన్ని, రొమాంటిక్‌గా చూడడాన్ని గుర్తు చేయడమే ఉద్దేశం.

ఉత్తరాధునిక వాదం లేవనెత్తిన ప్రశ్నలు, దానికి అనుసరించిన పద్ధతులు మన పరిస్థితులను, సమకాలీన సాహిత్యాన్ని విశ్లేషించు కోవడానికి ఉపయోగపడగలిగితే తప్పనిసరిగా ఉపయోగించుకోవచ్చును. వలసానంతరవాద విమర్శ రూపాలను అనుకూలమైన పద్ధతిలో స్వీకరించవచ్చు. ఒక సిద్ధాంతంగా ఉత్తరాధునిక వాదం పుట్టుకలోనే దాని మరణం ఉంది. తృతీయ ప్రపంచ దేశాలకు సంబంధించి వాస్తవ నిరాకరణ తత్త్వం ఉంది. అది ప్రథమ ప్రపంచ దేశాలలోని ప్రత్యేక పరిస్థితులలో పుట్టింది. వలస దేశంగా మనదేశంలో రూపు దాల్చిన ఆధునికతను వలసవాద ఆధునికతగా కొందరు భావించడం ఉంది. ఆధునికత యూరప్ కేంద్రకం అయితే, ఉత్తరాధునిక వాదం కూడా యూరో – అమెరికన్ కేంద్రకమే కావాలి. తృతీయ ప్రపంచ దేశాలకు సంబంధించి ఉత్తరాధునిక వాదంకన్నా వలసానంతర వాదానికి కొంత ప్రాసంగికత ఉండవచ్చు. తృతీయ ప్రపంచ దేశాల సాహిత్యానికి సాధారణ రూపంలో పోస్ట్ కలోనియల్ అన్న విశేషణం వాడుకలో ఉంది. భౌగోళికంగా వలస పాలన అంతమయిన తరువాత పూర్వ వలస దేశాలలోని అనుభవాలను, ఆధిపత్య రూపాలను, పరిపాలన విధానాలను, జీవన స్థితిగతులను, సూత్రీకరించడంతోపాటు వలస పాలన కాలంనాటి పరిస్థితులను, భావాలను, అనుభవాలను పునస్సమీక్షించుకోవడంగా వలసానంతర వాదాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఉత్తరాధునిక వాదం ఒక సిద్ధాంతంగా సాధారణ రూపంలో అన్ని రకాల కేంద్రాలకు, తృతీయ ప్రపంచ దేశాలకు మధ్య అన్ని రకాల అసమానతలను, అప్రధానీకరణలను ప్రశ్నిస్తుంది. ప్రథమ, తృతీయ ప్రపంచ దేశాల మేధావులిద్దరికీ వలసానంతర వాదం రూప కల్పనలో పాత్ర ఉంది కానీ, రూపం దాల్చడం మాత్రం అమెరికన్, యూరోపియన్ విశ్వవిద్యాలయాలలో, సంస్థలలో. ఉత్తరాధునిక, వలసానంతర వాదాలు రెండింటికీ ఉత్తర నిర్మాణ, వినిర్మాణ వాదాలు సైద్ధాంతిక ప్రాతిపదికను అందించాయి.

ఒక రకంగా ఉత్తరాధునిక వాద, వలసానంతర వాదాలు అనుసరించే పద్ధతులు ఒకే విధమైనవి. విమర్శ రూపాలలో మాత్రం కొంత తేడా ఉంది. ఈ వాదాలు ఏదో ఒక రూపంలో మన దగ్గర చర్చలో ఉన్నాయి గనుక వాటి ప్రాసంగికతను అర్థం చేసుకోవడానికి వాటి స్వరూప స్వభావాలను అర్థమైనంతవరకు కొంతవరకైనా తెలుసుకోవలసి ఉంటుంది. వాటిలోని అపర్యాప్తతలను, వాటి అస్థిర స్వభావాన్ని కూడా అవగాహన చేసుకోవలసి ఉంటుంది.

## 2

ఆధునికత అన్న భావనకు సంబంధించి కూడా మొదటి నుంచీ కొన్ని భేదాలు ఉన్నా దానికి కనీసపు నిర్దిష్టమైన తాత్త్విక భూమిక ఉంది. విజ్ఞాన శాస్త్రం, చరిత్ర, వీటి ఆధారంగా హేతువు, హేతువాదం, జాతి భావన, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, లౌకిక వాదం అన్న నిర్దిష్ట భావనలు ఆధునికతను నిర్వచిస్తాయి. ఉత్తరాధునిక వాదానికి మొదటి నుంచీ నిర్దిష్టమైన భావ భూమిక లేదు. దేశాలను బట్టి, సంస్థలను బట్టి, కాలాన్ని బట్టి, అస్తిత్వాలను బట్టి, సందర్భాలను బట్టి, అధ్యయన క్షేత్రాలను బట్టి వివిధ స్థాయిలలో ఉత్తరాధునిక వాదానికి వివిధ నిర్వచనాలు, వివరణలు కనిపిస్తాయి. ఆధునికత, ఆధునికతా వాదాలకు లాగా ఉత్తరాధునికతకు, ఉత్తరాధునిక వాదానికి స్పష్టమైన భేదం ఉన్నట్టు కనిపించదు. ఈ రెండింటిని పర్యాయంగా వాడడం కనిపిస్తుంది. ఆధునికీకరణంలాగా ఉత్తరాధునికీకరణం అన్న ప్రయోగం ఉన్నట్టు కనిపించదు. నిర్దిష్ట తాత్త్విక భూమిక, జ్ఞాన సిద్ధాంతం, కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం, ఉత్పత్తి క్రమంతో నిర్దిష్టమైన సంబంధాన్ని అన్వయించ లేకపోవడం దీనికి కారణం కావచ్చు.

పదిహేడు, పద్దెమినిది శతాబ్దాలలో గృహనిర్మాణానికి సంబంధించి ఆధునికీకరణం అన్న పదాన్ని వాడినట్టు కనిపిస్తుంది. తరువాత లేఖన క్రమం ఆధునికీకరణ, భాష ఆధునికీకరణ అన్న భావనలు కనిపిస్తాయి. ఆధునిక, సమకాలీన ప్రపంచంలో భౌతిక, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో ఆధునికీకరణ అన్న భావన విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఉత్తరాధునికత అన్న మాట కూడా తొలుత గృహ నిర్మాణ సందర్భంలోనే వాడడాన్ని గమనించాలి. మూడు, నాలుగు దశాబ్దాలుగా ఉత్తరాధునిక వాదం సాహిత్య విమర్శ రంగంలో విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఉత్తరాధునిక వాదం మొదటి నుంచీ సమస్యాత్మక పదంగానే ఉంది. ఆధునికతకు సంబంధించిన అనేక భావనలను సమస్యాత్మకం చేసిన ఉత్తరాధునిక వాదం చివరకు తానే సమస్యాత్మకమై కూర్చుంది. అది కళా, సాహిత్యరంగాలలో ఆధునికతావాద ధోరణులపైన తిరుగుబాటుగా కనిపిస్తే, మరోచోట దాని కొనసాగింపుగా కనిపిస్తుంది.

సాహిత్య స్వయంప్రతిపత్తి విషయంలో ఆధునికతావాదానికి, ఉత్తరాధునిక వాదానికి పెద్ద తేడా కనిపించదు. కొందరి దృష్టిలో ఉత్తరాధునికత కాల విభాగాన్ని సూచిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అణుశక్తి విస్తరణ, సైనిక కూటాలు, ప్రచ్ఛన్న యుద్ధ భయం, విచ్ఛిన్నమైన ఆధునిక ఆదర్శాలు, స్థానచ్యుతి – ఈ వాతావరణంలో మనిషి మానసిక స్థితి మొదలైనవాటికి సంబంధించిన ఆలోచనే ఉత్తరాధునికత. నూతన ప్రపంచ వైఖరి, ప్రపంచీకరణం, ప్రపంచ ఆర్థిక విధానం, ప్రపంచ గ్రామం కొందరికి ఉత్తరాధునికతను నిర్వచిస్తాయి.

సమకాలీన సాంస్కృతిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను వర్ణించే పదంగా ఉత్తరాధునికతను కొందరు భావిస్తారు. కొందరికి ఉత్తరాధునికత సంభావ్యమానమే కానీ, రూపం తీసుకోని సామాజిక భవిష్యత్తు. ఒక వాతావరణం, ఒక జీవన విధానం. ఆ ప్రత్యామ్నాయం ఆధునికతతో లెక్కలు పూర్తి చేసుకున్న తరువాతే స్పష్టం అవుతుంది. ఈ లెక్కలు పూర్తి చేసుకుంటున్న కాలాన్ని సూచించేదే ఉత్తరాధునికత. అమెరికా సందర్భంలో మధ్య తరగతి ఆధిపత్యం, నేతృత్వం దాడిని ఎదుర్కొనే పరిస్థితే ఉత్తరాధునికత. మధ్యతరగతి ప్రాధాన్యానికి గండి పడడంతో, 'అంతా తమ ప్రయోజకత్వం' అని భావించిన ప్రపంచం ఆ వర్గం ముందే పటాపంచలు అవుతుండడంతో 'చరిత్ర ముగిసింది', 'అమెరికా అంతం' అయిందని చేసిన ఆక్రోశమే ఉత్తరాధునికత.

ఆధునికతతో ఘర్షణగా, విచ్ఛేదంగా ఉత్తరాధునికతను కొందరు చూస్తే, ఆధునికత కొనసాగింపుగా కొందరు చూస్తారు. ప్రపంచీకరణం, స్థానిక చైతన్యాల మధ్య వైరుధ్యం, వినియోగదారీ సమాజాల అట్టడుగు స్థాయిలో బహుళ జాతి సంస్థలు తెచ్చిన భిన్న అనుభవాల సంపుటిగా ఉత్తరాధునికతను కొందరు నిర్వచించారు. మానవ సంబంధాలలో, ఆలోచనలలో, ఆచరణలో, అనుభవాలలో, సంవేదన శీలంలో, భాషాదృష్టిలో వచ్చిన మార్పులే కొందరికి ఉత్తరాధునికత. ఈ ప్రపంచం ఉత్తరాధునిక దశలో ప్రవేశించిందని కాక, సమకాలీన ప్రపంచాన్ని దర్శించే విధానంలో ఉత్తరాధునికత ఉందని కొందరంటారు. 'తూర్పు యూరప్ దేశాలలో కమ్యూనిస్టు పాలన అంతమైన తరువాత, సోవియట్ రష్యా విచ్ఛిన్నమైన తరువాత ఉత్తరాధునిక వాదం ప్రధానంగా మార్క్సి వాద వ్యతిరేక ధోరణిగా ముందుకు వచ్చింది.

మానవ జాతిని ఒక అఖండ పదార్థంగానో, స్థూలమైన రెండు వర్గాల మొత్తంగానో గుర్తించడం కాక సూక్ష్మాతి సూక్ష్మ విభాగాల అస్తిత్వాన్ని, బహుళ సాంస్కృతిక స్థితిని గుర్తించడం, విఖండత, లింగ, వర్ణ, ప్రాంత చైతన్యాలను ఉత్తరాధునిక వాదం సాంస్కృతిక రంగంలో ముందుకు తీసుకొని వచ్చిన అంశాలు. ఒకరకమైన ఉత్తరాధునిక వాదం 'సంస్కృతికి ఉత్పత్తి విధానంతో సమానమైన స్థానాన్ని ఇస్తుంది. ఒక్కొక్కసారి ప్రధాన స్థానాన్ని కూడా ఇస్తుంది. ఉత్తరాధునిక వాదం సాంస్కృతికాధ్యయనం అన్న కొత్త విషయాన్ని ముందుకు తీసుకొని వచ్చింది. సామాజిక జీవితంలోని అన్ని కోణాలను – ఆర్థికరంగం, రాజ్యం, రాజ్యాంగం, ఆధిపత్యం, మనస్తత్వ నిర్మాణం మొదలైన వాటినన్నిటినీ, ఉత్తరాధునిక వాదం సాంస్కృతిక రూపాలుగానే చూస్తుంది. సాహిత్యం, రాజకీయాలు, సినిమాలు, టీవీ, వ్యాపార ప్రకటనలు మొదలైనవాటిలోని జనరంజక ధోరణులను, వాటి స్వభావాన్ని సమకాలీన సాంస్కృతిక జీవన రూపాలుగా చూస్తుంది. నవ్య మార్క్సి వాదులలో కొందరు ఉత్తరాధునిక వాదాన్ని అనంతర పెట్టుబడిదారీ విధానపు సాంస్కృతిక తర్కంగా చూశారు. ఆర్థిక విధానాలైన మార్కెట్, గుత్తాధిపత్యం, బహుళ జాతి సంస్థారూపాలకు, ఉత్పత్తి విధానాలైన ఆవిరి యంత్రాలు, విద్యుద్యంత్రాలు, అణు చోదిత యంత్రాలు, ఎలక్ట్రానిక్స్‌లకు, కళా, సాహిత్య రంగాలలోని వాస్తవికత, ఆధునికతావాద, ఉత్తరాధునిక వాదాలకు మధ్య గల సంబంధాన్ని గుర్తింపజేశారు.

మార్క్సువాదులు ఆధునికతకు పారిశ్రామికీకరణం, పెట్టుబడిదారీ విధానం, బూర్జువా సంస్కృతులకు గల సంబంధాన్ని వివేచిస్తారు. అనంతర పెట్టుబడిదారీ విధానం, వినియోగదారీ సమాజాలలోని సంక్షోభాన్ని ఉత్తరాధునిక వాదం ప్రతిఫలిస్తుందని మార్క్సు వాదులు అంటారు. జ్ఞాన వికాస సిద్ధాంతాల మూలాలను ప్రశ్నించిన ఉత్తరాధునిక వాదం సహజంగానే పునరుద్ధరణ భావాలకు, తిరోగమన భావాలకు దారితీస్తుందని భావిస్తారు.

## 3

ఉతరాధునిక వాదానికి అనేక కోణాలు, నిర్వచనాలు ఉన్నా తాత్త్వికంగా, ఆచరణాత్మకంగా ఆధునికతకు ఉన్న పరిమితులు, పరిధుల పైన విమర్శగా, జ్ఞాన వికాస భావాల పునర్మూల్యాంకనంగానే ఎక్కువగా ప్రచారంలో ఉంది. ఉత్తరాధునిక వాద విమర్శ రూపాలు ఇలా ఉంటాయి: యూరప్‌లో పద్దెనిమిదవ శతాబ్దిలో విస్తరించిన జ్ఞాన వికాస భావాలు విశ్వజనీనాలు, సార్వకాలికాలు, అన్న విషయం నిరూపితం కాలేదు. ఆధునిక జీవితం, సంస్కృతి అంతకు ముందరి మానవ జీవిత రూపాల కంటే, సంస్కృతి కంటే ఉన్నతమైనదన్న విషయం కూడా నిరూపితం కాలేదు.

ఆధునికీకరణం అభివృద్ధిని సూచించదు. అందులో వెలుగుల కంటే నీడలే ఎక్కువ. హేతువు ఆధునికీకరణ పేరిట మానవ జీవితంపై నిర్నిబంధమైన అధికారం చలాయించడం మానవ జీవితంలో అనేక సంకటాలకు దారి తీసింది. మనిషి జ్ఞాన వికాసంలో హేతువు పాత్ర ఉన్నా, మానవ జీవితానికి సంబంధించిన అన్ని అంశాలలోనూ దాన్ని ఉద్దేశపూర్వకంగా సాధనం చేయడం వల్ల మానవ జీవితం, వ్యక్తిత్వం జడప్రాయం అయింది. అంధ విశ్వాసాల నుంచి, అతీత శక్తుల నుంచి విముక్తం చేసేదిగా ముందుకు వచ్చిన హేతువు తానే ఒక దేవుడై కూర్చుంది. జాతి అన్న భావనలో పరిమితులున్నాయి. ఒక జాతిగా గుర్తింపు గల మానవ సమూహంలో వివిధ తెగలు, ఉపజాతులు, విభాగాలు, ప్రాంతాలలో పెరుగుతున్న అస్తిత్వ కాంక్షే దీనికి నిదర్శనం. జాతి రాజ్యాల రాజ్యాంగ యంత్రం, పోలీసు, ఉద్యోగ వ్యవస్థ సాధారణ జనం పైన ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అణచివేతకు సాధనం అవుతున్నాయి. సందిగ్ధత, అనిశ్చితత, ఉత్కంఠ – ఆధునికత ఫలితాలు, పరిణామాలు. ఆధునిక జీవితంలోని అనారోగ్యకరమైన పోటీలు, స్పర్ధలు నేర ప్రవృత్తిని, తీవ్రవాదాన్ని పెంచుతున్నాయి.

ఈ వరుసలోనే వలసానంతర వాద విమర్శ రూపాలను కూడా పరిశీలించడం అనవసరం. ఒకప్పుడు భౌగోళికమైన వలసపాలనలో ఉండి అసమానతలకు, న్యూనతాభావానికి గురైన తృతీయ ప్రపంచ దేశాల చారిత్రక అనుభవాలపై ఆధారపడిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విమర్శగా వలసానంతర వాదాన్ని నిర్వచించవచ్చు. ప్రాతినిధ్యం, అప్రధానీకరణం, కర్తృత్వం, అస్తిత్వం, చరిత్ర, ప్రవచనం మొదలైనవి వలసానంతర సాహిత్య విమర్శలో ప్రధానాంశాలు.

స్థూలంగా వలసానంతర వాద విమర్శ రూపాలు ఇలా ఉంటాయి : జ్ఞానం విషయంలో ఏక రూపత, సమరూపత, విశ్వజనీనత – వలసవాద శక్తులు తృతీయ ప్రపంచ దేశాల పైన రుద్దిన భావాలు. జ్ఞాన వికాస సిద్ధాంతాలలో ప్రధానమైన ఉదార మానవతావాదాన్ని పాశ్చాత్య వలసవాదులు వలస దేశాల విషయంలో పాటించలేదు.

వలస వాదం రూపకల్పన చేసిన 'చరిత్ర' అన్న భావన వలస దేశాలపై ఆధిపత్యం నిలుపుకోవడానికి ఉద్దేశ పూర్వక సాధనంగా పని చేసింది. స్వర్ణయుగాలను, మహా యుగాలను నిర్దేశించడంలో వలసవాద దృష్టి ఉంది. యూరప్ జాతి, హేతువు మొదలైన వాటికి ఇచ్చిన నిర్వచనాలు మొత్తం ప్రపంచ దేశాలకు అదే రూపంలో వర్తించవు. ప్రపంచీకరణం జాతి రాజ్యాల స్వయంప్రతిపత్తిని విచ్ఛిన్నం చేసింది. వలసానంతర వాదంలో మరో ముఖ్యాంశం ప్రాచ్యవాదం అన్న భావన. సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, భావజాల పరంగా, తమ ఆధిక్యాన్ని నిరూపించుకోవడానికి సామ్రాజ్యవాదులు చేసిన కల్పనే ప్రాచ్యం. ప్రాచ్యం కేవలం ఒక భౌగోళిక విభాగం కాదు. యూరప్ తనను తాను నిర్వచించుకోవడానికి, నాగరికులుగా నిరూపించు కోవడానికి కావలసిన 'ఇతరం' (అదర్)గా ప్రాచ్య రూపకల్పన చేసింది. యూరప్‌ను వక్తృస్థానంలో, ఇతరాన్ని శ్రోతృ స్థానంలో నిలిపింది ప్రాచ్యవాదం. సామ్రాజ్యవాదం తృతీయ ప్రపంచ దేశాలలో మత రూఢ వాదం (ఫండమెంటలిజం) పెరగడానికి ఎలా కారణమయిందో 'ప్రాచ్య వాదం' అన్న భావనను ముందుకు తీసుకొని వచ్చిన ఎడ్వర్డ్ సైద్ విస్తృతంగా చర్చించాడు.

## 4

కేంద్రాన్ని తిరస్కరించడం, ఖండాలను మాత్రమే గుర్తించడం ఉత్తరాధునిక వాదం అన్న భావనకు సైద్ధాంతిక రూపం ఇచ్చిన సిద్ధాంతాలలో ప్రధానంగా కనిపించే అంశం. ఈ సిద్ధాంతాలు ఒక్కొక్కసారి తమ పైన తామే ఎదురుదాడికి సిద్ధమవుతాయి. వీటిలో ముఖ్యమైన సిద్ధాంతం మహా కథనాల అంతం. ఉదారమానవతా వాదం ఒక మహా కథనం. మానవజాతిని భౌతిక, బౌద్ధిక, మానసిక బంధనాలన్నిటి నుంచి విముక్తం చేసే సిద్ధాంతంగా ఉదార మానవతావాదం ముందుకు వచ్చింది. ఆ విషయం నిరూపితం కాలేదు. కాబట్టి ఉదార మానవతావాదం అనే మహా కథనం అంతం అయినట్టే. మార్క్సు వాదం కూడా మానవజాతిని విముక్తి చేసే సిద్ధాంతంగా నిరూపితం కాలేదు. బహుళత్వాన్ని, విభిన్నతను అంగీకరించాలి. విభిన్న కథనాలే కాని మహా కథనాలు లేవు. మహా కథనాలపై యుద్ధం, విభిన్న కథనాలను బలపరచడం దీని నినాదం. ఈ నినాదం కూడా మహా కథనమే కదా, అనేది ఈ సిద్ధాంతం పైన వచ్చిన ప్రశ్న. ఉన్న మహా కథనాలు అంతం అయ్యాయో లేదో కానీ, కొత్త మహా కథనాలు రంగంలో ప్రవేశించాయి. ప్రపంచీకరణం ఒక మహా కథనం. ఉదార ఆర్థిక విధానాలు, నూతన ప్రపంచ వైఖరీ మహా కథనాలే.

చారిత్రక కాలాన్ని సూచించేదిగా, ఆధునికత విమర్శ రూపంగా ఉన్న ఉత్తరాధునిక వాదానికి సైద్ధాంతిక ప్రతిపత్తిని కల్పించిన సిద్ధాంతాలు – ఉత్తర నిర్మాణవాదం, వినిర్మాణవాదం. భాషాశాస్త్రంలో ప్రారంభమైన నిర్మాణవాదం సామాజిక, సాంస్కృతిక అధ్యయన రంగాలలో నమూనాగా పనిచేసింది. నిర్మాణవాద మూలాలలోనే పుట్టి దాని పరివర్ధిత రూపంగా ఉత్తర నిర్మాణవాదం వచ్చింది. దానికి మరింత సైద్ధాంతిక స్వభావాన్ని ఇచ్చింది వినిర్మాణవాదం. ఇది వాచక కేంద్రకం. ఈ సిద్ధాంతాల పైన ఆధారపడిన ప్రత్యేక సాహిత్య విమర్శ

పద్ధతిగా ఉత్తరాధునికవాదాన్ని ఇక ముందు వాడుదాం. ఈ తరగతికి చెందిన ఉత్తరాధునికవాద సాహిత్య విమర్శకుల్లో మార్బిస్టులు కూడా ఉన్నారు. ప్రస్తుత రూపంలో ఉత్తరాధునికవాద సిద్ధాంతం ప్రామాణ్యాప్రామాణ్యాలు ఎట్లా ఉన్నా వాటిని అన్వయించిన పద్ధతులు వాస్తవాలను ఎలా తారుమారు చేస్తాయో, వికృతం చేస్తాయో సోదాహరణంగా చూపించినవారున్నారు. ఈ బలహీనత సిద్ధాంతంలోనే ఇమిడి ఉందేమో?

మనం ఉపయోగించే భాష బాహ్య ప్రపంచానికి అద్దం పడుతుందని, భాష ద్వారా ప్రపంచాన్ని అందుకోవచ్చని, ప్రపంచాన్ని చూడడానికి భాష గవాక్షంలా పనిచేస్తుందని, రచనను సూక్ష్మంగా అధ్యయనం చేయడం వల్ల అర్థం సుబోధకం అవుతుందని నిర్మాణ వాదం చెప్తుంది. భాష పారదర్శకం కనుక ప్రపంచానికి, వాస్తవానికి సంబంధించిన జ్ఞానాన్ని ఇస్తుందని, ఇందులో రచయితకు లేక వక్తకు, వాస్తవానికి కూడా ప్రాతినిధ్యం ఉంటుందని కూడా నిర్మాణవాదం చెప్తుంది. పదాలు నిర్దిష్టమైన అర్థాన్ని ఇస్తాయి. భాషవల్ల వాస్తవ జ్ఞానం కలుషితం గాని, వికృతంగాని కాదు. నిర్మాణవాదం వాగ్వ్యవహారానికి ప్రాధాన్యం ఇస్తుంది. ఇక ఉత్తర నిర్మాణ వాదం పదాలు, భాష నిర్దిష్టమైన అర్థాన్ని ఇవ్వవని, అందువల్ల ఒకే అర్థాన్ని నిర్ణయించడం సాధ్యం కాదని అంటుంది. ప్రతి అర్థం మరొక అర్థానికి దారి తీస్తుంది. కాబట్టి నిర్దిష్టమైన అర్థం అంటూ ఉండదు. వినిర్మాణవాదం వాచక కేంద్రకం. వినిర్మాణవాద ఉత్తరాధునిక విమర్శ లిఖిత భాష పైన ఆధారపడిన విమర్శ. ప్రతి వాచకం బహుళార్థాల్ని ఇస్తుంది. కేంద్రీకృతమైన అర్థం అంటూ లేదు.

వాచకం బాహ్య వాస్తవానికి ప్రాతినిధ్యం వహించదు. వాచకానికి సొంత అస్తిత్వం ఉంది. కొంత వాస్తవం ఉంది. భాషాగత వాస్తవం బాహ్య వాస్తవాధీనం కాదు. వాచకంలో బాహ్య వాస్తవం ఉపస్థితమై ఉందనడం అధిభౌతిక దృష్టి. భాష స్వీయ వాస్తవ ఘటితం కాబట్టి భాష వల్ల బాహ్య వాస్తవ జ్ఞానం కలుషితం, వికృతం అవుతుంది. భాషకు క్రీడా స్వభావం ఉంది. దీని ఫలితంగా వాచకం అర్థాలు రకరకాలుగా మారిపోతాయి. వాగ్వ్యవహారంలో వక్త ఉపస్థితుడు. లిఖిత భాషలో వక్త ఉపస్థితుడు కాదు. రచన పూర్తికావడంతో రచయిత పని కూడా పూర్తి అయినట్టే. ఆ తరువాత రచన అర్థంతో రచయితకు సంబంధం లేదు. దీన్నే 'రచయిత మరణం' అన్నారు. తరువాత పాఠకులే అర్థ నిర్ణాయకులు, స్వీయ వాచక నిర్మాతలు. ఈ నిర్మాణాలు కూడా స్థిరాలు కావు. అస్థిరత దాని స్వభావం. భాషలో స్వేచ్ఛా క్రీడ ఉంది. సత్యాలూ స్వేచ్ఛాక్రీడలే.

ఈ రూపంలోని ఉత్తరాధునిక వాదం పైన బాగానే విమర్శలు వచ్చాయి. చారిత్రకంగా చూస్తే వాగ్వ్యవహారంతో పోల్చినప్పుడు లిఖిత సంకేతాలు చాలా ఇటీవలివి. మనిషి భాషను పొందే క్రమంలో వాగ్వ్యవహారం మొదటి దశ. ఆ తరువాతే అభ్యాసంతో లేఖనాన్ని అలవరచుకుంటాడు. ఈ ప్రపంచంలో లేఖనం లేని భాషలే ఎక్కువ. లేఖనం ఉన్న భాషలలో కూడా అత్యధిక శాతం లేఖనం తెలియనివాళ్ళు, వాగ్వ్యవహారం మౌలికం. లిఖిత భాష వాగ్వ్యవహారానికి ప్రతినిధి. భౌతిక, భౌద్ధిక, సామాజిక పరిమితుల వల్ల వక్త లేక రచయిత తాను చెప్పదలచుకున్న విషయాలనన్నిటినీ లిఖిత భాషలో చెప్పలేకపోవచ్చు. సరియైన, అవసరమైన ప్రాతినిధ్యాలు కొరవడవచ్చు. ప్రాతినిధ్యంలో అసమగ్రత ఉండవచ్చు. కొన్నిటికి అప్రధాన ప్రాతినిధ్యం ఉండవచ్చు. అప్రధానీకరణం ఉద్దేశపూర్వకం కావచ్చు, ఉద్దేశ పూర్వకం కాకపోవచ్చు. ఏ భౌతిక, చారిత్రిక పరిస్థితులలో వాచకం పుట్టిందో, ఆ పరిస్థితులు మారడం వల్ల వాచకం అర్థాలు మారవచ్చు.

ఇటువంటి అపర్యాప్తతల్నీ, అసగ్రమతల్నీ, అప్రధానీకరణలను, ప్రాతినిధ్యరాహిత్యాన్ని, చారిత్రిక ప్రాసంగికతలను స్త్రీవాద, దళితవాద, ముస్లింవాద, ప్రాంత వాద సాహిత్యాలు ముందుకు తెస్తూ విమర్శకు పెడుతున్నాయి. అధికార స్వభావాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ విమర్శలకు మూలం జీవితానుభవాలు, జీవిత వాస్తవాలు. ఉత్తరాధునిక వాద పద్ధతులు వీటికి సాధనంగా ఉపయోగించినంతవరకే వాటి ప్రాసంగికత. వాస్తవానికి, జీవితానికి దూరమయినప్పుడు ఆ వాచకంతో ఎవరి కేమి పని? అర్థం అస్థిరం అన్న భావనలోనే అధిభౌతికత ఉంది. ఉపస్థితి, అనుపస్థితుల చర్చ జీవిత వాస్తవాలను వికృతం చేసి చూపడానికే ఉపకరిస్తుంది. భాష సామాజిక కార్యకలాపం. భాష అంటే వ్యాకరణం, వాక్యనిర్మాణ వ్యవస్థ మాత్రమే కాదు. కేవలం పదాలు మాత్రమే కాదు. వాస్తవాలు, అనుభవాలు, భావాలు, ఆలోచనలకు ప్రాతినిధ్యం వహించినప్పుడే అది భాష అవుతుంది. అస్తి, నాస్తి విచికిత్సకు లోనైతే అది భాష కాదు. వినిర్మాణ వాద మూలక ఉత్తరాధునిక వాదంలోని అనేక అంశాలు నీ భాషను నీది కాకుండా చేస్తుంది.

మన జీవితంలో కఠోర వాస్తవాలున్నాయి. తిండీ, గుడ్డా లేకుండా జీవచ్ఛవాల్లా బతుకుతున్న రువాండా మొదలైన ఆఫ్రికన్ ప్రజలు ఉన్నారు. ఎముకలు తేలే వాళ్ళ నగ్న శరీరాలు వాస్తవాలు. ప్రపంచీకరణ పరిధిలోకి వాళ్ళు రారు. ప్రత్యక్ష, పరోక్ష అణచివేతలున్నాయి. పోరాటాలు ఉన్నాయి. ప్రథమ ప్రపంచ దేశాలు భాషతో, సత్యాలతో స్వేచ్ఛాక్రీడ చేయవచ్చు. దాన్ని ఎదుర్కోవడానికి తృతీయ ప్రపంచ దేశాలు భాషను ఆయుధంగా ఉపయోగించాలి. దాన్ని స్వాధీనం చేసుకోవడంలోనే మనిషికి విజయం ఉంది.

న్యాయ–అన్యాయాలు, సత్య–అసత్యాల సారాలు, అర్థాలు, విలువలు చారిత్రక పరిస్థితులను బట్టి, దశలను బట్టి, అధికారం, అణచివేతల స్వభావాలను బట్టి మారవచ్చు, భిన్నం కావచ్చు. కానీ. అవి పూర్తిగా అసత్యాలు కావు. "నిజవేఁవిటి, అబద్ధవేఁవిటి? మేం సిద్ధులం. అబద్ధం నిజం చేస్తాం. నిజం అబద్ధం చేస్తాం. లోకవేఁ పెద్ద అబద్ధం" అని కన్యాశుల్కంలోని బైరాగి ద్వంద్వ ప్రత్యర్థులను ఎప్పుడో ఏకం చేశాడు. దీనికి క్రీడా సిద్ధాంతాలు అవసరం లేదు.

## 5

ఇటీవల సామాజిక శాస్త్రజ్ఞులు ఉత్తరాధునిక వాదానికి దేశీయమైన ప్రత్యామ్నాయంగా గాంధీవాదాన్ని ముందుకు తీసుకొని వస్తున్నారు. దేశానికే కాదు ప్రపంచానికే గాంధీవాదాన్ని ప్రత్యామ్నాయంగా ప్రతిపాదిస్తున్నారు. ఉత్తరాధునికవిమర్శ గాంధీతోనే మొదలయినట్టుగా కూడా చెప్తున్నారు. వాళ్ళ అభిప్రాయాలు ఇలా ఉన్నాయి : దేశీయ సాంస్కృతికచట్రంలోనే గాంధీ అభివృద్ధిని దర్శించాడు. పాశ్చాత్య ఆధునికతకు, తృతీయ ప్రపంచ దేశాల ఆధునికతకు భేదం ఉంది.

మానవ సమాజాన్ని విముక్తం చేసే శక్తి పాశ్చాత్య ఆధునికతకు మాత్రమే లేదు, ఆ శక్తి భారతీయ సంప్రదాయ సంస్కృతికీ ఉంది.

ఉత్తరాధునికవాదంతో పోలిస్తే గాంధీ మరింత బలంగా ఆధునికతను విమర్శించాడు. జాతిరాజ్యాన్ని, ఆధునిక విజ్ఞానాన్ని, సాంకేతికతని, నగరజీవుల వైయక్తికతని సవిమర్శకంగా పరిశీలించాడు. విమర్శనాత్మక సంప్రదాయం గాంధీమార్గం. సంప్రదాయంలో జీవిస్తూనే సంప్రదాయంలోని అస్పృశ్యతను వ్యతిరేకించాడు గాంధీ. సంప్రదాయ సంస్కృతి ఆయుధంగా సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొన్నాడు. బౌద్ధ, జైనాల నుంచి అహింసను, భగవద్గీత నుంచి కర్మయోగ రూపమైన సత్యాగ్రహ ఆచరణను గ్రహించాడు. భక్తి కవుల విముక్తి శక్తిని స్వాయత్తం చేసుకున్నాడు. గాంధీ ప్రజల సజీవసంస్కృతిలో భాగంగా జీవించాడు. గాంధీవాదానికి ఉండే సంప్రదాయ మతభూమిక ఇతరులను వ్యావర్తీకరిస్తుంది. అందువల్ల దాని ఆచరణాత్మకతను గురించి సందేహాలున్నాయి.

విమర్శనాత్మక సంప్రదాయం, విమర్శనాత్మక ఆధునికత అనే ద్వంద్వాలు పాశ్చాత్యమంటే భౌతికం, ఆధునికం; ప్రాచ్యమంటే సాంప్రదాయికం, ఆధ్యాత్మికం అన్న భావాన్ని పునరుద్ధరింపజేస్తాయన్న సందేహం కూడా ఉంది. సామాజిక శాస్త్రరంగంలో తప్ప సాహిత్య విమర్శల్లో గాంధీవాదం ఒక సాధనంగా ప్రచారంలోకి రాలేదు. ఇక దళితవాదం అంబేద్కరిజం అన్న ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చింది. మార్క్సిజంతో జత కలిసిన అంబేద్కరిజాన్ని దేశీయమార్క్సిజంగా అన్వయిస్తూ దళితవాదంలోనే మరో ప్రత్యామ్నాయం ముందుకు వచ్చింది.

## 6

బహుముఖంగా వస్తున్న సిద్ధాంతాలను అలా ఉంచితే, ఉత్తరాధునికవాద, వలసానంతర వాదాలలోని విమర్శ రూపాలు కొన్ని సమకాలీన జీవితంలో, సాహిత్యంలో ప్రాసంగికాలే. ఈ విమర్శ రూపాలు చాలావరకు మార్క్సువాదంలో భాగాలే. ఆధునికోత్తరవాద, వలసానంతరవాద విమర్శ రూపాలు వలస పాలన కాలంలోనే తెలుగు మేధావులలో, సాహిత్యంలో కనిపిస్తాయి.

గురజాడ ఆధునిక పాశ్చాత్య రాజ్యాంగ యంత్రాన్ని కలగూరగంప, స్వార్థపూరితమైందిగా వర్ణించాడు. ఉన్నవ లక్ష్మీనారాయణ పోలీసు వ్యవస్థను రద్దు చేయడం మంచిదనీ, ఉరిశిక్షను రద్దు చేయాలనీ 1921లో చెప్పాడు. విభిన్నతలను గుర్తించని జాతి భావనలోని వైరుధ్యాలను శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి బట్టబయలు చేశాడు. మన సమాజంలో ఆధునికతను అర్థం చేసుకోవడానికి వలస పూర్వదశలోని చైతన్యాన్ని సమాంతర చైతన్యాన్ని అర్థం చేసుకోవాలి. మన సమాజంలో మనిషి సర్వతోముఖమైన అభివృద్ధికి కులవ్యవస్థ పెద్ద ఆటంకం. అంతర్జాతీయ సమాచార వ్యవస్థలూ, మరి ఏ ఇతర సాంకేతిక అభివృద్ధీ కుల నిర్మూలన జరగనిది సాధ్యం కాదు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ పరిపాలన భారతదేశంలో అంతవరకు స్థిరంగా ఉన్న గ్రామీణ వ్యవస్థను విచ్ఛిన్నం చేసిందంటాడు మార్క్స్. వలసపాలనకు పూర్వమే మూడు నాలుగు దశాబ్దాలుగా సంప్రదాయ వ్యవస్థలో కదలికలు ప్రారంభమయ్యాయి. వృత్తికారుల పరిమిత వాణిజ్యం అభివృద్ధి చెందుతున్న దశలో, తదనుబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో కుల, వర్ణ భేదాల హద్దులను చెరిపే ధోరణులున్నాయి. భక్తి ఉద్యమాలు, తెలుగులో తత్త్వకవుల సాహిత్యం ఆధిపత్యాన్ని ప్రశ్నించాయి. కులాలే కాదు, మత భేదాలను కూడా ఈ ఉద్యమాలు, సాహిత్యం అధిగమించే ప్రయత్నం చేశాయి. వలసవాదం రూపంలో తప్ప సారంలో యథాస్థితి కొనసాగడానికి దోహదం చేసింది.

ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్న పోరాటాలను, వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్న సాహిత్యాన్ని రెండువందల సంవత్సరాలకు ముందు ఆగిపోయిన పోరాటాలను మళ్ళీ అందుకోవడంగానే అర్థం చేసుకోవాలి. సంప్రదాయ జీవితం పరిమితం (క్లోజ్). ఆధునిక జీవితం విస్తృతం (ఓపెన్), విస్తృత పరిధి విస్తరిస్తున్న దశలే ఆధునిక పరిణామ క్రమంలోని పూర్వ ఆధునిక, ఉత్తరాధునిక దశలు. ఇది అంచెలంచెలుగా నిరంతరం సాగే ప్రక్రియ. లంబరేఖ సమాంతరరేఖగా పరిణామం చెందే క్రమం.

**('ఇండియా టుడే' వార్షిక సాహిత్య సంచిక 2000 నుండి)** ✸

కవిత

# పౌరసత్వబిల్లు

**- రామిశెట్టి**

పుట్టలో పాములను
గుహలో సింహాలను
కదిపి లేపింది గదా
ఈనాటి మత్తెక్కిన మతం
అస్సాంలో పక్కదేశాల
ప్రజలు వలస వచ్చి
ఏళ్ళు గడిచిపోయింది
సంఖ్యాబలమున్న నేటి
మత ప్రభుత్వం
పౌరసత్వబిల్లును విపక్షాలు
వద్దన్నా రెండు సభల్లో
పాస్ చేసింది
జైనులు,
హిందువులు
తనవాళ్ళేనట
డెబ్భై లక్షల ముస్లింలు
పరాయివాళ్ల క్రింద జమ
పౌరసత్వానికి మతం రంగు
నిద్రించే పాములు
బుసలు కొడుతున్నాయి
గుహలో ఉన్న సింహాలు గర్జిస్తున్నాయి
ఢిల్లీలో విద్యార్థులు
అస్సాంలో గర్జనలు
త్రిపుర ఈశాన్య భారతం
ప్రజలు తండోపతండాలుగా
కదులుతున్నారు
ఇది ఆరని అగ్నిజ్వాల. ✸

# కలాన్ని మాట్లాడుతున్నా

– వల్లభాపురం జనార్దన

ఓ గళం మూగవోయింది
ఓ కలం మూలనపడింది
మరో కలం పాళీ విరిగింది
ఓ శరీరం జండీ మోసిందని
చంకలు గుద్దుకోకు
నేను కలాన్ని మాట్లాడుతున్నా
కత్తులు గొడ్డళ్ళు తూటాలతో
రాసే నా చేతులను నరకొచ్చు
నా మాటల రూపం తుడిపెయ్యొచ్చు
పలికే గొంతును పిసికేయొచ్చు
నాకు రాయడానికి మాటలిచ్చే
సిరా చుక్కలను
నడుములిరిగిన రేఖాచిత్రాలను చెయ్యొచ్చు
నీకిదితప్ప ఇంకేదీ చాతకాదు
రేఖాచిత్రాలలో దాగిన నిజాయితీని చంపలేవు
ఆ గొంతు ధైర్యాన్ని చంపలేవు
ఇది చరిత్ర తేల్చిన నిజం
ఇప్పటికీ తేలుస్తున్న నిజం
నియంతలు ఊరూ పేరే లేకుండా
కొట్టుకుపోయింది మరీ నిజం
నీవెంత గింజుకు చచ్చినా ఆలోచనను చంపలేవు
ఆశయాలను రూపుమాపలేవు
నా గుండె సిరా నుండి జలపాతంలా దూకే రాత
భవిష్యత్తుకు బాట
వింటున్నావా కుర్చీ భేతాళ మాంత్రికుడా
నా నుండి వచ్చే రాత మాట
సమతాపయనానికి బాట
నా గుండె నుండి మాటలను పిండి
రేపటి పంటకోసం నాటుతా
అవి ఆరోగ్యంగా బలంగా ఎదగడానికి
ఎరుపు ఎరుపులేసి పంట పండిస్తా
మరణం అంచులు చూసి తిరిగొచ్చిన రాత ముందు
కత్తులు మొద్దువోతయి
గొడ్డళ్ళు మూలకు పడతయి
నా నుండి వచ్చే రాత మాట రేపటి దేశభక్తి గీతం
నేను రేపటి కొత్త ఆయుధాన్నై
ఉన్మాదాన్ని చంపడానికి బయలుదేరాను
నాకు మరణం లేదు
నేను చిరంజీవిని. పదును తగ్గని ఆయుధాన్ని

కవితలు

# అయోమయ స్థితిలో..!

– చలపాక ప్రకాశ్

ఎవరు ఎక్కడున్నారో తెలియదు!
ఎవరు 'ఉన్నారో' 'లేదో' కూడా
కనీసం తెలియదు!!
కలిసిన క్షణాలను తల్చుకుంటూ...
కలివిడిగా తిరిగిన జ్ఞాపకాలను మురుసుకుంటూ...

'మీరు లేని లోటు పూడ్చలేనిది' అనే మాట
ప్రతిరోజూ వాడుకుంటూ...
మొదట్లో గుర్తొచ్చిన్నప్పుడల్లా కళ్ళు
రెండు కన్నీటి చుక్కలు రాల్చేవి!
గుండెలవిసేలా బాధతో
నరాలు మెలితిరిగిపోయేవి!!

కాలం నేర్పుతున్న మార్పుకు
కన్నీళ్ళూ రాటుదేలిపోయాయి
అడ్డుగోడ కట్టినట్టుగా ఒక చుక్కా కారనంత
బండబారిపోయాయి!!

మీరంతా ఒకమాట కూడా చెప్పకుండా
పిట్టల్లా ఎక్కడికి ఎగిరిపోతున్నారో...
పిట్టల్లా ఎక్కడ పడితే అక్కడ రాలి'పోతున్నారో'....
క్షేమసమాచారాలు తెలుసుకోలేని
అయోమయ స్థితిలో...

(కరోనా కాటుకు పిట్టల్లా రాలిపోతున్న బంధుమిత్రులను
తల్చుకుని కుమిలిపోతూ...)

# తమ భూభాగంపై తాము బ్రతకటానికై పోరాటం చేస్తున్న పాలస్తీనియన్లకు సంఘీభావం తెలుపుదాం!

**పాలస్తీనాపై** ఇజ్రాయెల్ జాత్యహంకారంతో, దురాక్రమణ కాంక్షతో మరల మరల దాడులను సాగిస్తూంది. ఈ బాంబు దాడుల్లో పాలస్తీనా పరిపాలనా భవనాలు, ఆసుపత్రులు, విద్యాలయాలు, అనేక కార్యాలయాలు నేలకూలాయి. వేలమంది నిరాశ్రయులయ్యారు. వందలమంది క్షతగాత్రులయ్యారు. ఎప్పటిలానే పిల్లలు, మహిళలు ఎక్కువమంది చనిపోయారు. పాలస్తీనియన్ల భూభాగాన్ని స్వాధీనం చేసుకోవటానికి ఇజ్రాయెల్ 1948 నుండీ దారుణమైన ఈ దాడులను చేస్తూనే వున్నది. ఐనా తమ మాతృభూమి కోసం, తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పాలస్తీనియన్లు మొక్కవోని ధైర్యంతో పోరాటం చేస్తూనే వున్నారు.

పాలస్తీనా, ఇజ్రాయెల్‌ల మధ్య ఇన్ని దశాబ్దాలుగా శతృత్వం కొనసాగటానికి ప్రధాన కారణం అమెరికా దేశపు సామ్రాజ్యవాద విధానాలే. రెండవ ప్రపంచయుద్ధం ముందువరకూ బ్రిటన్ పాలస్తీనాపై తమ ఆధిపత్యాన్నీ, విభజించి పాలించే పద్ధతులను అమలు చేయగా, ఆ తర్వాత అమెరికా చమురు నిక్షేపాలు పుష్కలంగా వున్న మధ్యఆసియా ప్రాంతంపై పట్టు సాధించటానికి ఇజ్రాయెల్‌ను ఏర్పాటుచేసింది. 1948లో ఐరాసలో అమెరికానే పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్‌కు 55 శాతం ఇప్పించేలా తీర్మానం చేయించింది. పాలస్తీనాకు వెస్ట్‌బ్యాంక్, గాజా భాగాన్ని మాత్రమే కేటాయించారు. జెరూసలేంను ప్రత్యేక హోదా కల్గిన నగరంగా ప్రకటించారు. పాలస్తీనా భూభాగం చుట్టూ గోడలను నిర్మించి బయట ప్రపంచం నుండి వేరుచేశారు. వారి ప్రాథమిక అవసరాలైన త్రాగునీరు, కరెంటు, నిత్యావసరాలను అందకుండా చేయటంతో 1967లో అరబ్ – ఇజ్రాయెల్ యుద్ధం జరిగింది. ఆ సందర్భంగా బాగా పంటలు పండే, పాలస్తీనియన్లకు ఆహారాన్ని అందించే గోలాన్ హైట్స్ ప్రాంతాన్ని పాలస్తీనా నుండి అమెరికా దూరం చేసింది. పాలస్తీనాకు చెందిన 90 శాతం భూభాగాన్ని తమ దౌర్జన్యపూరిత విధానాలతో ఇజ్రాయెల్ దురాక్రమించటానికి అమెరికా ప్రోద్బలాన్ని ఇస్తూంది. ఐరాస భద్రతామండలి అత్యవసర సమావేశంలో పాలస్తీనాపై యుద్ధ దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌ను హెచ్చరించాలని అన్ని దేశాలు కలసి చేసిన తీర్మానాన్ని అమెరికా తన వీటో అధికారంతో అడ్డుకుంది. అంతే కాకుండా పాలస్తీనాకు విద్య, వైద్యం కోసం నిధులు నిలిపివేసి, ఇజ్రాయెల్‌కు ఆయుధాలు సమకూర్చుకోవటం కోసం సంవత్సరానికి 300 కోట్ల డాలర్లు ఇస్తోంది. ముడిచమురుపై ఆధిపత్యం కోసమే యెమెన్, సిరియా, ఇరాక్ వంటి దేశాలపై యుద్ధాలు చేస్తూ, ఆ ఆ దేశాల మధ్య అంతర్యుద్ధాలను సృష్టిస్తుంది, ప్రేరేపిస్తుంది.

అమెరికా సామ్రాజ్యవాద అండదండలతో, వారి అవసరాల కోసమే ఏర్పడిన ఇజ్రాయెల్ ప్రపంచదేశాల నుండి దాడులను ఆపమని చేస్తూన్న ఒత్తిడిని పట్టించుకోవటంలేదు. ప్రస్తుతం జరుగుతున్న దాడుల వెనుక మత దురహంకారంతో పాటు రాజకీయ కారణాలు కూడా కన్పిస్తున్నాయి. నెతన్యాహు పార్లమెంట్ ఎన్నికలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి కావల్సిన మెజారిటీని తెచ్చుకోలేకపోతున్నాడు. ఇజ్రాయెల్ ప్రజలలో జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టి తమ రాజకీయ ప్రాపకాన్ని బలోపేతం చేసుకోవటానికి పాలస్తీనాపై దాడులు చేయిస్తున్నాడు. అందులో భాగమే మే నెల మొదటివారం నుండి జరుగుతున్న యుద్ధ దాడులు. ఐరాస సూచించిన పాలస్తీనా భూభాగంలో అంతర్భాగంగా వున్న షేక్ జారా ప్రాంతం నుండి పాలస్తీనియన్లను వెళ్ళగొట్టటానికి ఇజ్రాయెల్ బాంబుల దాడులు చేస్తోంది.

తాము నివసిస్తున్న ప్రాంతాలకు సార్వభౌమత్వం కోసం పాలస్తీనా ప్రజలు యాసిర్ అరాఫత్ నాయకత్వంలో వీరోచితంగా పోరాటాలు చేసి సాధించుకున్నారు. ఐక్యరాజ్యసమితి గుర్తింపునూ సంపాదించు కున్నారు. స్వయంపాలన చేసుకుంటున్నారు. అదే స్ఫూర్తితో, పోరాట చేవతో పాలస్తీనా ప్రజలు అమెరికన్ సామ్రాజ్యవాదానికి, ఇజ్రాయెల్ దురాక్రమణ యుద్ధ దాడులకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగిస్తున్నారు. వారి కర్తవ్య సాధనకు ప్రజాస్వామికులైన ప్రజలందరం సంఘీభావాన్ని తెలియచేద్దాం!

**– జనసాహితి** ✸

కవిత

## నాకు తెలుసు

**– ఆలూరి బైరాగి**

నాకు తెలుసు, నాకు తెలుసు
ప్రళయవేదనా పంకిల ప్రపంచపథం మధ్య
ప్రేమలు పాసగవనీ
ఈ బండరాళ్ళపైన ఏ మొక్కలు ఎదగవనీ
మనమంతా చీకటిలో ఆకటితో పోరాడే
అస్వతంత్ర సైనికులమనీ,
పెనుతుఫాను చేతుల్లో చిక్కుకొన్న
త్రోవలేని నావికులమనీ
జీవిత ప్రభంజనం
కలయిక సహించదనీ
ఉన్న గడువు కొద్ది అనీ
నాకు తెలుసు ! నాకు తెలుసు !

(చీకటి నీడలు – బైరాగి) ✸

# లక్షద్వీప్ ప్రజల న్యాయమైన, ప్రజాస్వామికమైన పోరాటానికి అండగా నిలుద్దాం!

- జనసాహితి

**పర్యాటక** పరిశ్రమను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా లక్షద్వీప్ దీవులలో సాగుతున్న నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ 'సేవ్ లక్షద్వీప్' పేరుతో అక్కడి ప్రజలు వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్నారు. లక్షద్వీప్ పాలనాధికారిగా నియమింపబడిన ప్రఫుల్ ఖోడా పటేలు అమలుచేస్తూన్న నిరంకుశమైన, అప్రజాస్వామికమైన విధానాలు అక్కడి ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని అశాంతికి గురిచేస్తున్నాయి.

అరేబియా సముద్రంలో మన దేశ మలబార్ ప్రాంతానికి 300 కి.మీ. దూరంలో 32 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల 36 ద్వీపాల సముదాయమే లక్షద్వీప్. అందులో 10 ద్వీపాలు మాత్రమే ప్రజల నివాస యోగ్యమైనవి. ఇవి కేంద్రపాలిత ప్రాంతాలు. ఇందులో నివశిస్తున్న జనాభా మొత్తం 65 వేలమంది. అందులో 96.5% మంది ముస్లింలు కాగా మిగతావారంతా ఇతర మతాలవారు. 92% అక్షరాస్యత గల ఈ దీవులు ప్రజలు జీవనాధారం చేపల వేట, పశుపోషణ.

లక్షద్వీప్ ప్రజలు ప్రధానంగా మాంసాహారులు. అక్కడ బడుల్లో పెట్టే మధ్యాహ్న భోజన పథకంలో కూడా మాంసాహారం వుంటుంది. అక్కడ మద్యనిషేధం అమలులో వుంది. 2020 డిశెంబరు వరకూ అక్కడ ఒక్క కరోనా కేసు కూడా లేదు. వారి వ్యాపార, వైద్య, విద్య అవసరాలకు కేరళ తీరంతో సంబంధాలు కలిగి వుంటారు. దినేశ్వరశర్మ పరిపాలనాధికారిగా వుంటూ 2020లో మరణించేంతవరకూ అక్కడ ప్రజల జీవనశైలీ, సంస్కృతి, ఆహారపు అలవాట్లలో మార్పులేమీ లేవు. ప్రకృతి రమణీయతతో, పర్యావరణ పరిశోధనకు అనువుగా ప్రశాంత జీవితాన్ని అక్కడి ప్రజలు గడుపుతూ వున్నారు.

ప్రఫుల్ల ఖోడా పటేల్‌ను 2020 డిశెంబర్‌లో లక్షద్వీప్ పరిపాలనాధికారిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. 2016 నుండి దాద్రానగర్ హవేలీకి పరిపాలనాధికారిగా వున్న ఆయనకు లక్షద్వీప్‌ల పరిపాలనా బాధ్యతలు కూడా అప్పగించారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడుగా అమిత్‌షా జైలుకు వెళ్ళవలసి వచ్చిన సమయంలో మోదీగారి అండదండలతో ప్రఫుల్ల పటేల్ హోంమంత్రిగా నియమించబడి అమిత్‌షాని గట్టెక్కించారు. దాద్రానగర్ హవేలీ పరిపాలనాధికారిగా వుంటూ ఆయన అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఎదుర్కోలేక కలెక్టర్ గోపీనాథ్ రాజీనామా చేశారు. దాద్రానగర్ నుండి ఏడుసార్లు ఎంపీగా ఎన్నికైన మోహన్‌డేల్కర్ ప్రఫుల్ల పటేల్ వేధింపులకు తాళలేక ముంబయ్‌లో ఆత్మహత్య చేసుకుంటూ రాసిన అతిపెద్ద లేఖలో ప్రధాన కారకుడిగా పటేల్ పేరే వుంది. అటువంటి నేర చరిత్ర గల ప్రఫుల్ల పటేల్ లక్షద్వీప్‌ను పర్యాటక పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు కొన్ని రెగ్యులేషన్స్ తీసుకు వచ్చారు. అందులో 1). జంతు పరిరక్షణ నియంత్రణ చట్టం పేరుతో పశువధను – క్రయ, విక్రయాలను సంపూర్ణంగా నిషేధించటం : ఇది లక్షద్వీప్ ప్రజల జీవనశైలి మీద, ఆహారపు అలవాట్ల మీద, సాంఘిక, సాంస్కృతిక జీవనం మీద ప్రభావం చూపిస్తుంది. అక్కడ ప్రజల ప్రధాన ఆహారమూ పశుమాంసమే – వారి ఉపాధి కూడా పశుపోషణే. ఆర్టికల్ 48 ప్రకారం మన రాజ్యాంగంలో పశుసంపదను కాపాడుకోవాలని చెప్పటంతోపాటు, డెఫిసిట్ లేకుండా చూసుకోవాలని చెప్పారు. అలాగే వ్యాపారంగా, ఆహారంగా వున్న ఆహారపు అలవాట్లను రాజ్యాంగం వ్యతిరేకించలేదు. పటేల్ పరిపాలనాధికారిగా మధ్యాహ్న భోజన పథకంలో కూడా మాంసాహారాన్ని తీసివేశారు. దీనితోపాటు కోస్టల్ రెగ్యులేషన్ యాక్ట్ పేరుతో చేపల వేటను నిషేధించారు. తీర ప్రాంతంలో వున్న వారి నివాసాలను, వలలను, బోట్లను తొలగించేశారు. డైరీ ఫాంలన్నీ మూసేయించారు. 2). ప్రివెన్షన్ ఆఫ్ సోషల్ ఆక్టివిటీస్ యాక్ట్ : ప్రభుత్వ విధానాలను విమర్శించినా, నిరసనలు తెలియచేసినా అక్కడ నేరమే. ఈ నేరానికి శిక్ష యావజ్జీవ కారాగారం. దీనితోపాటు నేరం ఋజువు చేసుకోవాల్సిన బాధ్యత కూడా నేరస్థుడిదే. వీటితోపాటు మాంసాహారాన్ని అమ్మినా, కొన్నా, తిన్నా, ఇంట్లో ఉన్నా ఏడాదిపాటు జైలుశిక్ష మరియు 1000 రూ॥ల జరిమానా. వీటివల్ల ప్రజల జీవనోపాధి పోవటమే గాకుండా ఆహారపు అలవాట్లనూ నేరంగా చూపుతూ జీవన సంస్కృతిని తప్పు పడుతున్నారు. 3). లక్షద్వీప్ డెవలప్‌మెంట్ అథారిటీ రెగ్యులేషన్ యాక్ట్ : ప్రకారం అభివృద్ధి పేరు చెప్పి ఎవరి భూమినైనా, ఎక్కడ భూమినైనా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. దీనితోపాటుగా మైనింగ్, గనుల త్రవ్వకాలు, భవన నిర్మాణాలకు, జాతీయ రహదారులకు రింగ్ రోడ్డులు, విమానాశ్రయాలకు అనుమతిస్తూ పర్యావరణ విధ్వంసానికి గేట్లు బార్లా తెరిచారు. ప్రజల భూమిని లాక్కొని, వారికి కంపెనీల్లో కూలీలుగా ఉపాధి కల్పిస్తామంటున్నారు. 4). ఇద్దరు పిల్లలకన్నా ఎక్కువ వుంటే స్థానిక సంస్థల ఎన్నికలలో పాల్గొనకూడదని అభ్యర్థులపై నిబంధనలు విధించారు : 96 శాతం ప్రజలు ముస్లిం మతస్థులు కావడంతో వారిని ఎన్నికలకు అనర్హులుగా చేయడానికి ఈ నిబంధన విధించారు.

ఇంకా మళయాళం మాట్లాడే వందలాదిమంది కాంట్రాక్టు ఉద్యోగులను తమ విధుల నుండి తీసివేసి – గుజరాత్ నుండి హిందీ మాత్రమే మాట్లాడే అధికారులను తీసుకువచ్చి నియమించారు. హోటళ్ళు, రిసార్టులు నిర్మించి టూరిజాన్ని అభివృద్ధి చేసుకోమని అంబానీ, ఆదానీ కంపెనీలకు అప్పగించారు. మద్యంపై నిషేధాన్ని ఎత్తివేశారు. కేరళతో గల సాంస్కృతిక సంబంధాలను బలహీనపర్చడానికి సమస్త వాణిజ్య కార్యకలాపాలను కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు ద్వారానే జరిగేటట్లు ఆదేశించారు.

ప్రజల ఆచార వ్యవహారాలతోపాటు వారి సంస్కృతి, జీవనోపాధి, వారి మాట్లాడవలసిన భాష, ఏ ఆహారం తినాలో కూడా నిర్దేశిస్తున్న పరిపాలనా విధానాలపై ప్రజలు "లక్షద్వీప్‌ను రక్షించండి!" అని గొంతెత్తి నినదిస్తున్నారు. వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తూన్న ప్రజలపై లాఠీఛార్జ్ చేస్తున్నారు. అరెస్టులు చేస్తున్నారు. సినీనటి ఆయేషా సుల్తానా వంటివారిపై దేశద్రోహ నేరం కేసు పెట్టారు. మే నెలలో జరిగిన కేరళ సాహిత్య ఫెస్టివల్‌లో లక్షద్వీప్‌కు చెందిన కవి ఇస్మత్ హుస్సేన్ పాల్గొని ప్రజల పక్షాన రాసిన కవితను వినిపించాడు. స్వేచ్ఛగా జీవించే హక్కుకై, తమ సంస్కృతిని కాపాడుకోవటానికై, పరిపాలనాధికారి యొక్క నిరంకుశ విధానాలపైనా, దోపిడీ పీడనలపైనా సాగుతున్న ప్రజాపోరాటానికి సంఘీభావాన్ని తెలియచేద్దాం. ✸

కారా మాష్టారు సంస్మరణలో....

# కరోనా విలయపు వేళ చదవాల్సిన, కారా మాష్టారు రాసిన 'చావు' కథ

ఓ.వి.వి.యస్. రామకృష్ణ

**కాళీపట్నం** రామారావు మాస్టారు "చావు" కథ రాసి యాభై యేళ్ళు దాటి ఉంటుంది. వ్యవసాయం తప్ప..., ఇంకా చెప్పాలంటే వర్షాధార వ్యవసాయం తప్ప, ఇతర వ్యాసంగాలు లేని కుగ్రామాల జీవితాల్లోని దోపిడీ సంబంధాలను నేపథ్యంగా తీసుకుని ఈ కథ రాశారు. ఆ కుగ్రామాలలోనూ అత్యంత దయనీయంగా బతుకులు వెళ్ళదీసే దళితవాడలో, ఒక ముసలిదాని శవాన్ని దహనం చేయడానికి ఆ నిరుపేదలు పడిన ఆరాటాన్ని, చేసిన పోరాటాన్ని కారా అద్భుతంగా కథనం చేశారు.

"చావు కబురైనా మరేదైనా.... పొద్దుటేల యేవైనైతేనే ఆల్తో సెప్పాల.... మద్దేనమైతే మాటాడ కొల్లకోడమే. సీటికీ మాటికీ మయాన్న పారొస్తే కూలి దండుక్కాదా?!"... అనే అవగాహనను ఆ దళిత పేటలోని చిన్నపిల్లలే కలిగి ఉండడం..., "నా యిన్నాళ్ళసలీ కాష్టమ్మీదైనా కాలిపోవాల అన్న తల్లి కోరిక తీర్చలేనేమోనన్న కొడుకు వ్యధ"..., "బతికున్న మనిషైతే నీదీ నాదీ - చచ్చిన శవమైతే ఊరందరిదీని" అంటూ సామూహిక బాధ్యతతో శవ సంస్కారాన్ని జరిపించాలని తపన పడే పేట జనం..., అంత్యక్రియలు తెల్లారి చేద్దామని ఊరుకుంటే మరునాటి కూలి సంగతో అనే భయంతో రాత్రికి రాత్రే శవ దహనం చేయాల్సిన నిస్సహాయత, అవసరమయ్యే కర్రల కోసం వెదుకులాటలో పెత్తందార్ల చీదరింపులూ, బెదిరింపులూ...., ఇలా ఫ్యూడల్ దోపిడీ నగ్న స్వరూపాన్ని కారా 'చావు' కథలో ఆవిష్కరించారు.

"పశుల మేతకైనా లేకంట బంజర్లు, పోరంబోకులూ అన్నీ దున్నీసినారు. మిసన్లు, గిసన్లు, ఎరువులు, గిరువులు ఎన్నెన్నొచ్చినాయో సెప్పలేం. ఐతే యిన్నొచ్చినా జరిగిందేటయ్యా!.... జనానికి తిండినేదు. జనవుఁ అప్పులపాలైపోనారు. ఎండీ బంగారాలు ఎప్పుడో పోనాయి. ఎవ్వలికీ సెంటు ముక్క మిగల్నేదు. సూజ్జుస్తుండగానే గొల్లలు, శగిడీలు, మాలమాదిగలు, సిన్న సిన్న రైతులందరూ దుల్లిపోనారు. కాపోళ్ళూ బాగనేరు. అందల పెద్దనాయుళ్ళకీ, సావుకోర్లకీ సెందిపోయింది ఈ భూదేవతంతా".... అంటూ భూమి ఎటునుంచి ఎటు చేతులు మారిందో ఆర్థిక అసమానతలు ఎలా స్థిరీకరించబడుతున్నాయో ఆయన కథనం చేశారు.

కరోనా విలయతాండవం చేస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ కథ చదువుతుంటే అభివృద్ధి మాయలూ, ప్రచారాల ఆర్భాటాలతో ఊదర గొట్టటమే తప్ప ప్రజల జీవితాలలో దోపిడీ సంబంధాలు ఏమీ మారలేదనేది స్పష్టమవుతుంది. చిళ్ళగోచీలూ, చింపుల అంగీలతో వ్యవసాయ కూలీలుగా జీవించినా, ఫ్యాంట్లు వేసి సెల్‌ఫోన్లు వాడుతూ జీవితం బండిని ఈడ్చుకెళుతున్నా.... జనం దోపిడీ ఊబుల్లో మరింత మునిగారా, తేలారా?!.. అనేది ఆలోచించాల్సిన అవసరంగా అనిపిస్తుంది. ఖననం చేస్తే శవాన్ని నక్కలు పీక్కుతింటాయేమో, అంత హీనంగా ముసల్దాని అంత్యక్రియలు జరపొద్దు, దహనమే చేయాలనే పట్టుదల చూపిన పేదజనం సామూహిక తత్త్వం నుండి, నా అన్న - వాళ్ళని సైతం దగ్గరకు రానీయకుండా అంత్యక్రియలు చేయిస్తున్న కరోనా తరుణంలో సమూహం నుండి విడిపోతున్న వ్యక్తి పడుతున్న వేదన స్పష్టమౌతుంది.

ఎలాగైనా కాసిన్ని కర్రలు సంపాదించి జీవుడు దెయ్యం కాకుండా దహనమే చేయాలనేది కథలోని పేదజనం ఆలోచనైతే.... దిక్కులేని కరోనా చావు చావనేకూడదు, మనిషిలోని జీవుడిని ఎలాగైనా నిలుపు కోవాలనుకుంటూ ప్రజలు దేశంలో పరుగులు తీస్తున్నారు. శానిటైజర్లు, మాస్కులు, పల్స్‌ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్లు ఇన్నీ.. బతకాలంటే ఎవరికి వారే సంపాదించుకోవాల్సిన దుస్థితి దాపురించేలా ప్రజల్ని గాలికి వదిలేసిన ప్రభుత్వాల నిర్వాకం పట్టరాని కోపం తెప్పిస్తుంది. కథలో పెత్తందార్ల నిర్వాకానికి ఇప్పుడు కరోనా కాలపు ప్రభుత్వాల నిర్వ్యాపకత్వం ఒక కొనసాగింపుగా.., రాజ్యపు వికటాట్టహాసంగా అనిపిస్తుంది.

ఐతే రాజ్యం చేసే వికటాట్టహాసాన్ని ఓడించాల్సిన అవసరాన్ని, అందుకు జనం వదిలించుకోవాల్సిన వాటిని కా.రా. మాస్టారు కథలో అప్పారావు అనే పాత్ర ద్వారా సూచనగా ప్రస్తావించారు. "నా ఏడుపల్లా బతికున్న శవాల గురించే.... ఎంతకాలం మనవిలాగ కుళ్ళుతాం?!... ఎందును గురించి మనవిలాగ కుళ్ళాల??.. మనకున్నదల్లా ఒక్కటే సలి సంకటం... ఈ సలి సంకటం మన ఎన్నుబాఁవుని పట్టీసింది. ఎవుకులు తినీసింది. సీవూఁ నెత్తురూ మరేటీ మిగల్నేదు" అంటూ వెన్నును పట్టిన చలేందో స్పష్టాస్పష్టంగా సూచించేరు. ఇంకా కొంచెం ముందుకు వెళ్ళి.., ఊరుమ్మడి కలపను స్వంతం చేసుకున్న పందిరి అప్పయ్యను ఎదిరించి కర్రమోపులు తెచ్చిన కుర్రజుట్టును, నుజ్జైపోయిన జన జీవితాలను చావులో సైతం వర్గసమాజపు దుర్మార్గం వదిలిపెట్టదనీ, కనుకనే దానితో రాజీలేని సంఘర్షణ అనివార్యమనీ చెప్పిన కారా మాష్టారు కథ "చావు". ✸

## కథానికా రచయిత దేవిరెడ్డి వెంకటరెడ్డి మరణం

**రాయలసీమ** కథానికా రచయిత దేవిరెడ్డి వెంకటరెడ్డి బెంగుళూరులో మే 1న మరణించారు. ఆయన కథాసంపుటి 'సీమ బొగ్గులు' ఇటీవల విడుదలైంది. ✸

# తమిళనాట తెలుగు వలస పల్లెల జీవితాన్ని అక్షరబద్ధం చేసిన కీరా నవలలు 'గోపల్లె', 'గోపల్లె జనాలు'

- వేములపల్లి రాధిక

**"దాదాపు** ఎనిమిది వందల ఏళ్ళ క్రితం, ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుండి తమను వెంటాడిన గత్తరను తప్పించుకోవడానికి దక్షిణ దిక్కుగా పరుగెత్తి పరుగెత్తి చివరకు ఇప్పటి తమిళనాడులో చివరి కొసనున్న కరిచెల్‌కాడుకు చేరుకుని, అక్కడి అడవులను కొట్టి తీర్చి సాగులోకి తెచ్చుకున్న ఒక గుంపు జనం తాము ఏ నెపంతో ఆ తావుకు వచ్చిందో తమ పిల్లలకు తరతరాలుగా చెప్పుకుంటూ వచ్చారు. కాలం కడుపులో వందల ఏళ్ళు గడచిపోయాయి. 19వ దశాబ్దపు మొదట్లో ఆ కుటుంబాలలో ఒక ఇంట పుట్టిన రాజనారాయణన్ ఆ ఇంటిలో ఒక పెద్దామె వద్ద, ఆ కతను అనేకసార్లు విన్నాడు. విని ఊరుకోలేదు. తన యాభై ఏళ్ళ వయస్సులో ఆ తెలుగు ప్రజలకు కతను తమిళంలో నవలగా మలచి ప్రజలకు విన్పించాడు. అదే 'గోపల్లె' నవల". ఇవి ఈ నవలను తెలుగులోకి అనువదించిన నంద్యాల నారాయణరెడ్డి ముందుమాటలోని వాక్యాలు. కి. రాజనారాయణన్ మాటల్లో చెప్పాలంటే 'ఆ నవలకు శరీరం తమిళమైతే ఆత్మ తెలుగు'.

తమిళంలో కి. రాజనారాయణన్ – 'గోపల్లె గ్రామం' అనే పేరుతో రాయగా నంద్యాల నారాయణ రెడ్డి తెలుగులోకి అనువదించిన నవల 'గోపల్లె'. ఇది తమిళంలో తొలి మాండలిక నవలగా గుర్తింపబడింది. కి. రాజనారాయణన్ తమిళంలో 1976లో వ్రాసిన ఈ నవల 2013లో తెలుగులోకి అనువదింపబడింది. అదేవిధంగా ఈ 'గోపల్లె' నవలకు కొనసాగింపుగా 'గోపల్ల పురత్తు మక్కళ్' అనే నవల 'ఆనంద వికటన్' పత్రికలో ధారావాహికగా వచ్చింది. ఈ నవలకు 1991లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. దీనిని 2016లో శ్రీపాద జయప్రకాష్ తెలుగులోకి 'గోపల్లె జనాలు' అనే పేరుతో అనువదించారు. ఏనాడో వందల సంవత్సరాల క్రితం ఉత్తరాన ఉన్న ఆంధ్రనాడు నుండి దక్షిణపు కొసకు ప్రస్తుత తమిళనాడులోని కరిచల్‌కాడు ప్రాంతానికి వలస వచ్చిన తమ పూర్వీకుల కథను మొదటి నవల 'గోపల్లె' లోను; తర్వాత కాలంలో తెలుగు ప్రజలు తమిళ ప్రజల జీవన విధానంతో మమేకమైన ఆనాటి సాంఘిక జీవనాన్ని, స్వాతంత్రోద్యమాన్ని కలగలిపి రెండవ నవల 'గోపల్లె ప్రజలు'లోనూ ఎంతో సహజంగా చిత్రించారు. కరిచల్‌కాడు ప్రాంతపు తెలుగుతో కలిసిన తమిళ మాండలికంలో కి. రాజనారాయణన్ ఈ నవలను రాశారు.

కిరాగా ప్రసిద్ధిగాంచిన కి. రాజనారాయణన్ పూర్తిపేరు రాయంగల శ్రీ కృష్ణ రాజనారాయణ పెరుమాళ్ రామానుజం నాయకర్.

ఆ కాలాన ఆంధ్రనాడు నుండి తమిళనాడుకు రకరకాల కారణాలతో ప్రజలు వలస వెళ్ళారు. తాము పుట్టి పెరిగిన ఊరిని, నేలనూ, పంట పొలాలను, పాడి పశువులను వదలి భాషతో సహా ఏమీ తమది కాని చోటకు వలస పోవడం మనుష్యుల జీవితాలనెంత వేదనాభరితం చేస్తుందో కిరా 'గోపల్లె' నవలలో అత్యంత సహజంగా చిత్రించారు. "ఎవరికి ఏమి కీడు చేసినాము? ఇట్లాంటి అగచాట్ల పాలయినాము" అని నిత్యమూ శోకించే కొడుకులకు ఆ తల్లి ఓదార్పుగా "నా బిడ్డలారా, ఎక్కడో ఒకనాడులో పుట్టి, ఎక్కడో ఉన్న ఒక నాడుకి వచ్చి బతకాల్సి వచ్చిందే అని మీరు తలచి కలత పడవద్దు. అంతా నేలతల్లి యొక్క తావే! ఆమె చేతికి ఉన్న ఒక వేలి నుంచి మీరు మరొక వేలిమీదకు వచ్చినారు అంతే మీరు దిగులు పడవద్దు" అంటూ చెప్పడం ద్వారా వాళ్ళు, తమకు తాము ధైర్యం కూడదీసుకొనేలా చేసింది. నీరు ఒక అరుదైన సొత్తుగా భావించే ఆ ప్రజలు వలస బాట పట్టి అడవులు, కొండలు కోనలు దాటుతూ శుద్ధమైన నీరు ఊరే గుంట దగ్గర ఆగి ఇదే మనం ఉండాల్సిన చోటు అని అక్కడి అడవిని కొట్టి, చిన్న చిన్న మట్టి గుడిసెలు కట్టడంతో గోపల్లె గ్రామాన్ని ఏర్పరచుకున్నారు. వాళ్ళు తమతో మోసుకుని తెచ్చిన ధాన్యాన్ని తినకుండా విత్తనాల కోసం వాడారు. తాటిపండ్లు, దొండపండ్లు, జెముడుపండ్లు, నేలను తవ్వేటప్పుడు దొరికే తుంగ గడ్డలు, చెట్ల వేర్లూ, అడవి పిట్టల గుడ్లు ఇదీ అదీ అని లేదు. దొరికిన దేనినైనా తిని ప్రాణాలు నిలుపుకుంటూ రేపటి సేద్యానికవసరమైన విత్తనపు గింజల్ని మాత్రం జాగ్రత్త చేసుకోవటం ఆనాటి వలస జీవుల జీవన విధానాన్ని సూచిస్తుంది. ఆ సాగుకు వాళ్ళు పడరాని పాట్లు పడినారు.

రచయిత మాటల్లో చెప్పాలంటే "తుమ్మల బీడును గొడ్డూ గోదలకు మేతగాను, జెముళ్ళ కాడును కొట్టి నేలను పంటచేలుగా తీర్చిదిద్దు కొనడం వెనుక వాళ్ళ కఠోర శ్రమ దాగి వుంది. దట్టమైన జెముడు అడవులతో వాళ్ళు పెను పోరాటమే చేసినారు. జెముళ్ళను వేళ్ళతో పాటు లోడి ఆ వేళ్ళను వేరుచేసి మరీ పారేయాల్సి వచ్చేది. అలా లోడేటప్పుడు పెద్ద బండరాళ్ళు తగిలి, వాటిని కూడా పెకలించాల్సి వచ్చేది. అట్లా పెకలించగా ఏర్పడ్డ గుంటలను పూడ్చి చదును చేయాల్సి వచ్చేది. చేసి చేసి సొక్కిపోయేవాళ్ళు. ఈ అడవిని ఇంక మంట పెట్టకుండా తీర్చలేమని కనుక్కొన్నారు. ఒక మంచి ఎత్తుగడతో ఎంతమేర అడవిని తీర్చుకోవాలో దాని చుట్టూ చెట్లని నరికి లోపలిపక్కకు వేసి మంట పెట్టారు. మూడు రేయింబవళ్ళు మంట మండి అడవి నిలిచి కాలింది. తర్వాత కూడా చానానాళ్ళు అక్కడ నిప్పు కణికలు కొన్నిచోట్ల నివురుకప్పి మండుతూనే వుండేవి. చీమల దండులాగా చురుగ్గా పనులలోకి దిగినారు. వాళ్ళు మొదట అనుకొన్నంత తేలికగా, తొందరగా ఆ కాలిన తావునంతా పొలంగా తీర్చలేకపోయినారు. నేలలోని రాళ్ళూ బండలే కాక, మట్టికింద కాలకుండా నిలిచిపోయిన

పెను వేర్లు వాళ్ల పనులకు అడ్డం పడేవి. ఆ తావును అంతా మంచి పొలంగా మార్చడానికి పలు ఏడాదులు పట్టింది. వాళ్ళు విత్తిన గురుములు మొలకెత్తుతూ ఉంటే బ్రతుకు మీద వాళ్ళ నమ్మకమూ మొలకెత్తసాగింది. ఆ నేల సాగుకు వాళ్ళు పడరాని పాట్లు పడినారు. అందుకేనేమో ఆ నేలతల్లి కళ్ళు తెరిచింది."

దేశంలో పాలెగాళ్ళ పాలన ముగిసి కంపెనీ వారి (ఈస్ట్ ఇండియా కంపెనీ) ఏలుబడి ఇంకా పూర్తిగా ఏర్పడని ఆ నడుమ కాలంలో దివిటీ దొంగలు, దోవ ముచ్చులు ఎలా వీర విహారం చేశారో, వాళ్ళని అడ్డుకోవడానికి పల్లెజనులు తమని తాము ఎలా కాపు కాసుకొన్నారో, దోపిడీగాళ్ళను పట్టుకొని ఊరి పంచాయితీలో విచారించి దండించడం ఈ 'గోపల్లె' నవలలో కిరా వివరించారు. ఈ నవల కంపెనీ వారి నుండి గోపల్లె గ్రామం విక్టోరియా దొరసాని ఏలుబడిలోకి వెళ్ళడంతో ముగుస్తుంది. అయితే అప్పటికే ఊరి జనాలకు మిడతల కరువు సందర్భంలో దొరల నుండి ఎలాంటి సాయం రాకపోవడం పట్ల అసంతృప్తి ఏర్పడుతుంది. అదేవిధంగా తెల్లవాళ్ళను ఎదిరించిన వీరపాండ్య కట్ట బ్రహ్మనకు ఉరితీయడం ఎదిరించిన వాళ్ళను శిక్షించడం ఇవన్నీ కూడా కాలం గడిచేకొద్దీ మంది గుండెల్లో నివురు కప్పిన నిప్పులా రగులుతున్న స్వాతంత్ర్యేచ్ఛ, బ్రిటీష్‌వారి పట్ల నిరసనను నానాటికి పెనుగాలిలా పెంచింది.

కిరా ఈ నవలను రాసిన విధానం గతం, వర్తమాన కాలాలను రెంటినీ కలిపిన ఒక మౌఖిక కథనం. ఈ నవలలో వందేళ్ళ పైబడిన జేజవ్వ తన చిన్నతనాన తాము ఆ ప్రాంతానికి ఎలా వలస వచ్చారో కళ్ళకు కట్టినట్లు ఇంటిలోనివారందరికీ చెబుతూ ఉంటుంది. ఆ కాలాన ఇప్పటి ఆంధ్రనాడును ఉత్తరాంధ్ర అని, దక్షిణాన ఉన్న తమిళనాడు ప్రాంతాన్ని దక్షిణాంధ్ర అని పిలిచేవారు. తెలుగు రాజులు ఆ ప్రాంతంలో ఏలుబడి సాగించినపుడు వచ్చినవాళ్ళు, కరువు కాటకాల వల్ల తరలి వచ్చినవాళ్ళు, ముస్లిం రాజులకు వెరచి పారిపోయి వచ్చినవాళ్ళు ఇలా.... 'గోపల్లె' నవలలో గోవింద నాయకర్ పూర్వీకులు కూడా అలా వచ్చినవారే!, ఆ కుటుంబంలోని ఒక ఆడబిడ్డను రాచనగరుకు పంపమని పల్లకి పంపి నిర్బంధించి వివాహమాడ చూసిన ముస్లిం రాజు పరివారాన్ని ఏమార్చి పారిపోయి దక్షిణానికి వచ్చినవాళ్ళే. గతానికి చెందిన విషయాలు తలపోస్తున్న జేజవ్వ మనకు చెప్పే కథనం, వర్తమానంలో గోవింద నాయకర్ తదితరుల జీవితాన్ని చూపే కథనం ఈ రెండింటి కలబోత ద్వారా రచయిత మనల్ని కూడా గోపల్లెకు తీసుకొని వెళతాడు. నంద్యాల నారాయణరెడ్డి అనువాదం మనకు ఎన్నో పాత తెలుగు పదాల్ని సరికొత్తగా పరిచయం చేస్తుంది. ఇక్కడ తెలుగు ప్రాంతంలో మనం నిత్యజీవితంలో వాడటం మానేసిన ఎన్నో తెలుగుపదాల తీయదనాన్ని ప్రతీ వాక్యంలోనూ రసాత్మకంగా తేనెలూరేలా అనువదించారు నంద్యాల నారాయణరెడ్డి. పాఠకుల్ని మైమరపించే శైలితో ఆకట్టుకుంటుంది ఈ నవల. కడ కునుకు, మేను, లేతపొద్దు, వానతరి, ఒక తరిన, ముంగిలి, ఓపలేనంత, ఓరిమి, జగడాలు, పొద్దుపోకడ, మానుపు మందు, తగవరి, సుంత, నాడు, ఏలుబడి, వెరపు, తావు, నిరుసద్దు, ఉడుపులు, చిరుదోవ, జాడ, ఆనవాళ్ళు, బాటసారులు, పెన్నిది, విద్దూరాలు, మక్కువ, మనుములు, ఎలమి, చిరునగవు, ఉసురు, కెరలు, సత్తువ, రవంత, బాట, అబ్బురం, పెను ముంగోపి, వెలపట, ఇడుములు, ఎరుక, ఈడుపులు, మందల.... ఇలా ఎన్నెన్ని అతి సులువైన పదాలు.... ఈ నవలలో అలవోకగా ప్రయోగించారు. (ఇవి కేవలం మొదటి 10 పేజీలలోని కొన్ని పదాలు మాత్రమే)

'గోపల్లె' నవలను చదువుతుంటే మనకు 'ఏడు తరాలు'లోని కింటాకుంటే గుర్తుకొస్తాడు. తను పుట్టిన ఊరు, తన దేశం, తన భాష, సంప్రదాయాలను తర్వాతి తరం బిడ్డలకు నేర్పడానికి అమెరికాలో కింటాకుంటే, ఆయన తర్వాత తరాలు ఏవిధంగా మౌఖికంగా వారసత్వాన్ని కొనసాగించారో, ఈ నవలలో కూడా అదే కొనసాగింపు మనకు కన్పిస్తుంది. దేశ, కాల, స్థల పరిస్థితుల్లోను, పడిన కష్టాల్లోనూ తేడా ఉండవచ్చుగాక, తన భూమి మీద మూలాలనొదిలి పరాయి ప్రాంతానికి వలస వెళ్ళిన అందరి పరిస్థితి ఒకటే.

కొన్ని తరాలు గడిచేసరికి వెళ్ళిన ప్రాంతానికి అనుగుణంగా తమను తాము సర్దుకుంటారు మనుషులు. అలా వచ్చిన తమ పూర్వీకుల గురించి కి. రాజనారాయణన్ వ్రాసిన 'గోపల్లె' నవలకు కొనసాగింపు 'గోపల్లె జనాలు'. ఆ ప్రాంతంలో కొత్తగా బ్రిటీష్‌వాడి రాకతో వచ్చిన మార్పులు మట్టినూనె (కిరోసిన్, సీమనీళ్ళు), హరికేన్ లాంతరు, గోడ గడియారం, అగ్గిపెట్టె, నిద్రరాకుండా ఉండటానికి వచ్చిన ఆకు (తేయాకు), ఊరిలోకి వీధి బడి వచ్చి బిడ్డలు చదువుకోవడం, బయటి ఊర్లకు వెళ్ళి చదువుకొనే ఆంగ్ల మాధ్యమం కొత్త చదువు, పిలక బదులు క్రాఫు, రైల్వేలైను, చేతిలైటు, తాళాలు, గాజు సిరాబుడ్డీ, ఫౌంటైన్ పెన్ను, మౌత్‌ఆర్గాన్లు, దిక్కుల్ని చూపించే సాధనం.... ఇవన్నీ కూడా గ్రామీణ జీవితాన్ని మార్చడంలో పాత్ర పోషించాయి. బయట ఊరెళ్ళి ఇంగ్లీషు చదువులు చదువుకుంటున్న పిల్లలు సెలవుల్లో ఇంటికొచ్చినపుడు పల్లెలోనివారు వాళ్ళ చదువుని పరీక్షించి చూడాలని నోటి లెక్కలు ఇచ్చి చూస్తే సరైన సమాధానం చెప్పలేకపోవడం, నోము రోజున నయనారు కథను రాగయుక్తంగా పాడమంటే మాట్లాడేవిధంగా చదవడం; వడ్డీ లెక్క చూడమంటే కాగితాలకు కాగితాలు రాయడం.... వీటన్నిటి ద్వారా కిరా నాటి ఇంగ్లీషు చదువుల తీరును బహిర్గతం చేశారు. అదేవిధంగా తాలూకా ముఖ్య పట్టణంగా ఉన్న ఒడ్డపిడారంలో తహసీల్దారు నిమ్నజాతికి చెందినవాడవడం వల్ల ఎవరూ ఇల్లు అద్దెకు ఇవ్వకపోవడం అనే ఘటన ద్వారా కిరా నాటి సమాజంలో వేళ్ళూనికొని వున్న అంటరానితనం పట్ల నిరసనను వ్యక్తం చేశారు. ఊరిలోన చదువుకున్న యువకులు కొందరు కల్లు అంగళ్ళను మూయించడానికి ప్రయత్నిస్తే, ఊరి జాతరలో సారాయి దుత్త ఎత్తడం ద్వారా "మద్య నిషేధం ఒక్కటే అయితే ఎదిరించవచ్చు కానీ ఇందులో దేవుడు కూడా ఉన్నాడు కదా" అని యువకులు వెనుకంజ వేస్తారు. ఈ ఘటన ద్వారా కిరా సమాజంలో అవకాశవాద శక్తులు దేముడ్ని ఎలా ఉపయోగించు కుంటున్నారో చర్చకు పెట్టాడు. అదే సందర్భంలో ఆ యువకులు పట్టు వదలకుండా తాగుతున్న వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడే సందర్భంలో త్రాగుడుకు బానిసైన బాలన్ మాదిగ కోపోద్రిక్తుడై ఊరిలోని యువకులకు ఎదురు తిరిగి కర్ర తీసుకొని మాట్లాడగా అతని తరపువాళ్ళు గట్టిగా పట్టుకొని తోసుకొని వెళ్తారు. తల్లి కేకలు వేయగా బాలన్ కర్రను నేలమీద విసిరికొట్టి చేతులు కట్టుకొని నిలబడతాడు.

ఊరి కుర్రాళ్ళు వెనక్కి తిరిగి వస్తారు. ఈలోపు బాలన్ మాదిగవారందరినీ కర్రతో తీవ్రంగా కొట్టాడనే పుకారు ఊరంతా వ్యాపించి దుడ్లున్న ఆసాములను కొడతాడా అని గ్రామసభను సమావేశపరచి, సాష్టాంగంగా బోర్లాపడి మాదిగ గూడెంలోనివారంతా మన్నింపు కోరినా మన్నించక అతన్ని ఊరు వదలి పొమ్మని తీర్పు ఇవ్వడం జరుగుతుంది. నిజానికి చాలా మంచివాడు, పనిమంతుడు, యోగ్యుడుగా ఊరిలో గుర్తింపు ఉన్న బాలన్ మాదిగ మద్యానికి బానిసైన బలహీన క్షణంలో ఆ పని చేశాడు. ఫలితంగా తాను కొట్టనప్పటికీ శిక్షింపబడ్డాడు. ఈ ఘటన ద్వారా కిరా ఆనాడు గ్రామాల్లో ఉన్న అగ్రకుల ఆధిపత్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపాడు. అదే సందర్భంలో పిళ్ళైయారు గుడి పూజారి అయ్యరు కల్లు తాగుతూ అదేమిటని అడిగినవారిని "మధువు దేవతల పానీయం; అందువల్లనే మధుభాండం ఎత్తుకొని స్వామికి జాతరలు, ఉత్సవాలు జరిపిస్తాము" అంటూ నెపం దేముడిపైకి నెడతాడు.

క్రమేపీ గోపల్లెలో స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన రాజకీయ బహిరంగ సమావేశాలు, వందేమాతరం నినాదం వచ్చి చేరడం, వార్తాపత్రికల ద్వారా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలను చర్చించడం మొదలుపెట్టారు. ఊరిలోకి జిల్లా బోర్డు పాఠశాల రావడం, అందులో పిల్లలందరూ ఒకచోట చదువుకోవడం, దానిని కొంతమంది పెద్దలు నిరసించినా వాళ్ళ మాట నెగ్గకపోవడం.... వీటితోపాటు ఎక్కడో నల్లరేగడి పొలాల్లో ఒక మూలన ఉన్న గోపల్లె జనాల మనస్సులో భారతదేశ స్వాతంత్ర్య పోరాట అగ్నికణం ప్రజ్వరిల్లడం మొదలవుతుంది. గాంధీ భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురుల ఉరిశిక్ష గురించి ఇర్విన్‌ని ఏమీ అడగలేదని వార్తాపత్రికల్లో చదివిన కుర్రాళ్ళకు గాంధీపై ఉవ్వెత్తున కోపం రావడం, అంతకన్నా ఎక్కువగా తమ దేశ ప్రజలపై కాల్పులు జరపమన్న గూర్ఖా సిపాయిలను జీవిత ఖైదు చేసి అండమాన్ దీవులకు తరలించినపుడు గాంధీ మాట్లాడకపోవడం ఆ యువకుల్లో ఆవేశాన్ని రగిలించింది. పంజాబు హత్యాకాండ గురించి విని రగిలిపోయారు. ఈ నవలలో వాద వివాదాలు జరుగుతున్నప్పుడు కిరా అళగరసన్ అనే యువకుని ద్వారా తెల్లవాడి ఆధిపత్యంనుండే కాదు; బ్రాహ్మణాధిపత్యం నుండి కూడా దేశ ప్రజలు విడుదల పొందాలి అని చెబుతూ గాంధీజీ వర్ణాశ్రమ ధర్మాలన్నీ ఉండాలి అని చెప్పడాన్ని ఖండిస్తాడు. ఈ నవలలో కిరా రెండవ ప్రపంచయుద్ధం, హిట్లర్ దురాక్రమణ, అదే సందర్భంలో వలస పాలనకు వ్యతిరేకంగా వివిధ దేశాల్లోనూ, మనదేశంలోనూ జరిగిన ప్రజా పోరాటాలను ప్రస్తావించారు. బెంగాల్ కర్షకుల తెభాగా పోరాటాన్ని, తెలంగాణా ప్రజల సాయుధ పోరాటాన్ని, కాశ్మీర్ రాజుపై పోరాటాన్ని తిరువాన్కూరులో జరిగిన పున్నప్ర వాయలార్ పోరాటాన్ని రచయిత ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారత కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయవాదులు ఆ పోరాటాల్లో భాగస్వాములయ్యారని చెప్పారు. తెల్ల సైన్యాన్ని ఎదిరించి బొంబాయిలోనూ, కరాచీలోనూ యుద్ధం చేసిన భారత నావికాదళం, వారికి వత్తాసుగా వైమానికదళం, ప్రజలు నిలిచిన తీరు అద్వితీయంగా వివరించారు. చివరికి బ్రిటీష్‌వాళ్ళు ఏ ఒక్క భారతీయ సైనికుడినీ నమ్మలేని పరిస్థితిలో వాళ్ళు భారత జాతీయ నాయకుల్ని ప్రయోగిస్తారు. తమ పోరాటం నిలుపుచేయమని జాతీయ నాయకులు పిలుపునిచ్చినప్పటికీ దేశవ్యాప్తంగా ప్రజలు ఊరేగింపులు, నిరసనలు జరపటంతో ఇక వారు తమ అదుపులో ఉండరు అనే భావనకు వచ్చారు. దేశం రెండుగా చీలిపోవడం, మత కల్లోలాల మధ్య భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ఇచ్చామనడాన్ని రచయిత అది కేవలం అధికార మార్పిడిగానే ప్రస్తావించాడు. మరుసటిరోజు పత్రికా విలేఖరులు గాంధీజీని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో మీ స్పందన తెల్పండి అని అడిగితే దేశానికి ఆయన చెప్పిన ఒకే మాట 'ఏమీ లేదు'. కలకత్తాలో గాంధీ చెప్పిన ఈ మాట గోపల్లెలోనూ ప్రతిధ్వనించింది. దీనితో ఈ నవల ముగుస్తుంది.

భారతదేశ స్వాతంత్ర్యాన్ని కేవలం అధికార మార్పిడిగానే చెప్పిన కి. రాజనారాయణన్ నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం ఆశ్చర్యకరమైన విషయం. రైతుల పక్షాన ప్రజాఉద్యమాలలో పాల్గొన్న కి.రా. తన పల్లె జీవితాన్ని అక్షరబద్ధం చేసిన నవలలే 'గోపల్లె', 'గోపల్లె జనాలు'. ఈ రెండు నవలలను డా॥ సగిలి సుధారాణిగారి సహాయ సహకారాలతో ఆర్ట్ అండ్ లెటర్స్ చెన్నూరు ఆంజనేయరెడ్డిగారు తెలుగులో ముద్రించారు. తెలుగువాడి చెమట, నెత్తురు నుండి జాలువారిన ఈ రెండు నవలలు తమిళభాషలో రాసి, తన మూలాలను, తాను వలస వెళ్ళిన ప్రాంతాన్ని సమానంగా సొంతం చేసుకోవడాన్ని కి.రా. మనకు నేర్పారు. ✹

## జాంబియా మొదటి అధ్యక్షుడు, నల్లజాతి పోరాట నాయకుడు కెన్నెత్ డేవిడ్ కౌండా మరణం



బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో ముందు వరుసలో వున్న నాయకుడు కౌండా తన 97వ ఏట 17-6-2021న మరణించారు. ఆయన 28-4-1924న జన్మించారు.

కౌండా తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. కౌండా కూడా టీచర్‌గా, హెడ్‌మాస్టర్‌గా పనిచేశారు. జాంబియాకు స్వాతంత్ర్యం సాధించిన తర్వాత అధ్యక్షునిగా 1964 నుండి 1991 వరకు పనిచేశారు. జాంబియాలో ఉచిత విద్యను ప్రవేశపెట్టారు. 1966లో లుసాకాలో యూనివర్శిటీని ప్రారంభించారు. ఆఫ్రికన్ దేశాల్లో జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమాలకు చేయూతనందించారు. ఆఫ్రికన్ ఐక్యతా సంస్థకు ఛైర్మన్‌గా రెండేళ్ళు 70-71; 87-88లలో చేశారు. తన పాలనలో ప్రతిపక్షం లేకుండా చేసి వ్యక్తి ఆరాధన పెంచడంతో, 1991లో జరిగిన ఎన్నికలలో ఓడిపోయి, గెలిచిన పక్షానికి అధికారం అప్పచెప్పారు. చివరివరకు నల్లజాతి ప్రజల కోసం పోరాడారు. ✹




సత్యజిత్ రాయ్ శతజయంతి సందర్భంగా....

# 'గణశత్రు' (1989)

– బాలాజీ (కోల్‌కతా)

**కృష్ణపట్నం** ఆనందయ్య కరోనాను తగ్గించే అద్భుతమైన మందు ఇస్తున్నాడన్న ప్రచారంతో జనం తండోపతండాలుగా తరలి వెళ్లారు. లాక్‌డౌన్ నిబంధనలు కూడా పాటించకుండా, ఒకరి మీదికొకరు ఎగబ్రాకారు. కరోనా పోయేది అటుంచి అదే వ్యాధిని కోరి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. టెక్నాలజీ ముద్దు బిడ్డ ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఈ నాటు మందు మీద సైన్సు వ్యతిరేక ప్రచారాలు సాగాయి. ఇప్పటికీ సాగుతున్నాయి. ఈ సందర్భంగా సైన్స్ వర్సెస్ విశ్వాసం, అలోపతి వర్సెస్ ఆయుర్వేదం వంటి ఎన్నో విషయాలపై చర్చలు సాగుతున్నాయి. ఇది ప్రజారోగ్య సమస్య అని మొత్తుకుంటున్న కొందరిని డ్రగ్ మాఫియాలుగా, దేశ ద్రోహులుగా, ప్రజాశత్రువులుగా చూపడానికి ప్రయత్నిస్తున్నారు. సరిగ్గా ఇటువంటి దృశ్యమే సత్యజిత్ రాయ్ నిర్మించిన 'గణశత్రు' అనే బెంగాలీ సినిమాలో మనకు కనిపిస్తుంది. "మా మందిరం చారణామృతంలో గంగ నీరు వుంది, పాలు, మారేడు, నువ్వులు, అన్నింటికీ మించి తులసి ఉంది. తులసి ఆకుతో నీటిలోని విషక్రిములన్నీ నశిస్తాయని మీకు తెలీదా? హిందువులకు ఈ సంగతి వేల సంవత్సరాల నుండే తెలుసు. మా తీర్థాన్నే తప్పుపడతారా?" – అని గద్దిస్తాడు ఒక సైన్సు తెలీని పెద్దాయన ఓ పేరు మోసిన డాక్టర్తో. ఆ సందర్భమేమిటో సినిమా కథలో చూద్దాం.




చండీపూర్ అనే వూరిలో చాలా నిజాయితీ గల వైద్యుడు డాక్టర్ అశోక్ గుప్తా. అ వూరు అతడి పుట్టినూరు. కాబట్టి ఆ వూరి మంచి కోసం ఏమైనా చేస్తాడు. వూరిలో ఈ మధ్య జాండిస్ కేసులు పెరుగుతున్నాయి. కొందరు చనిపోతున్నారు కూడా. కేవలం వైద్యం చేస్తూ వూరుకోకుండా, ఈ వ్యాధికి మూల కారణమేమిటా అని ఆరా తీస్తాడు డాక్టర్ గుప్తా. వివిధ ప్రాంతాల నీటి శాంపిళ్లను కలకత్తా టెస్టింగ్ ల్యాబుకు పంపిస్తాడు. ఆ రిపోర్టు వస్తుంది. ఊరికి నడుమ జన సమ్మర్ధంగా వుండే భువన్‌పల్లి ప్రాంతపు నీటిలో సమస్య వుందని రిపోర్టు వస్తుంది. బహుశా అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ లీకేజి ద్వారా నీరు కలుషితమై రోగాలకు దారి తీస్తోంది. మరో డేంజర్ ఏమిటంటే ఆ ప్రాంతంలో త్రిపురేశ్వర్ మందిరం వుంది. భక్తులకిచ్చే తీర్థం ఆ కలుషిత జలంతోనే తయారౌతోంది. రోజూ వేలాది మంది ఆ చరణామృతాన్ని సేవిస్తున్నారు. ఎపిడెమిక్ వచ్చే పరిస్థితి వుంది. కొన్ని రోజులు మందిరాన్ని మూసివేసి భూగర్భ పైప్‌లైన్ డిఫెక్ట్ కనుగొని రిపైర్ చేయిస్తే సరిపోతుంది అన్నది డాక్టర్ గుప్తా ఆలోచన. తన సోదరుడు నిసిత్ గుప్తా ఆ వూరి పురపాలక సంఘం చైర్మన్ కావడం వలన తను అనుకున్న పని సులువుగా ఐపోతుందని భావిస్తాడు డాక్టర్. రిపోర్టు సంగతి తమ్ముడికి చెబుతాడు కూడా. కానీ కథ అడ్డం తిరుగుతుంది. ఆ మందిరం సంస్థాపకుడు భార్గవ అనే పారిశ్రామికవేత్త. అతడికి మందిరం రాబడిలో వాటా వుంది. డాక్టర్‌గారి తమ్ముడికీ వాటా వుంది. కాబట్టి సహకరిస్తాడనుకున్న వాడే అడ్డు తగులుతాడు. ఓ రోజు నిసిత్, భార్గవ కలిసి డాక్టర్ ఇంటికి వస్తారు. భార్గవ తన జేబులోంచి చరణామృతం శాంపిల్‌ను ఆ డాక్టర్ ముందు పెడతాడు. ఆ సందర్భంలోనిదే ఇది వరకు చెప్పుకున్న తులసి ఆకు డైలాగు. రోగ కారణాన్ని కనిబెట్టిన కీర్తి అన్నయ్యకు వచ్చేస్తుందని నిసిత్‌కు అసూయ. పైప్‌లైన్ రిపేరు కోసం పురపాలక సంఘం నిధులు ఖర్చు చేయడం కూడా అతడికి ఇష్టం లేదు.

ఆ వూరి దినపత్రిక 'జనవార్త' కోసం డాక్టర్ గుప్తా ఒక వ్యాసం రాస్తాడు. జాండిస్ మహమ్మారిపై ప్రజాభిప్రాయం కూడగట్టాలను కుంటాడు. ఆ పత్రిక ఎడిటర్, ప్రింటర్ మొదట్లో సహకరిస్తామంటారు. కానీ రాజకీయ వత్తిడికి లొంగి వ్యాస ప్రచురణ ఆపేస్తారు. పైపెచ్చు త్రిపురేశ్వర్ మందిరాన్ని తప్పుపట్టే వారి మాటల్ని నమ్మొద్దంటూ మునిసిపాలిటీ తరుపున ఇచ్చిన స్టేట్మెంట్‌ను మొదటి పేజీలో ప్రచురిస్తారు.

ఆఖరు ప్రయత్నంగా డాక్టర్ గుప్తా తన వ్యాసాన్ని ఏదైనా హాల్లో ప్రజల ముందు చదివి వినిపించాలనుకుంటాడు. కానీ గవర్నమెంటు హాళ్లు అద్దెకు దొరక్కుండా చేస్తాడు నిసిత్. చివరికి డాక్టర్‌గారికి కాబోయే అల్లుడు రొనేన్ ఒక చిన్న హాలు సంపాదిస్తాడు. రొనేన్ థియేటర్ మిత్రులు వూరంతా పోస్టర్లు అంటిస్తారు. కానీ అక్కడికీ దాపురిస్తాడు నిసిత్ తన బలగంతో! పథకం ప్రకారం సభను హైజాక్ చేస్తాడు. వ్యాసం చదవబోతున్న డాక్టర్ను మైకులో సభికుల ముందు ప్రశ్నించడం మొదలు పెడతాడు.

**నిసిత్ :** నిన్ను నువ్వు హిందువునని నమ్ముతున్నావా?

**డాక్టర్ గుప్తా :** అవును, ముమ్మాటికీ నేను హిందువునే.

**నిసిత్ :** ఎప్పుడైనా ఆలయానికి వెళ్ళావా?

**డాక్టర్ గుప్తా :** లేదు, కొన్ని హిందూ ఆచారాలను పాటించను. సైన్సు మనకు ఇంకో రకమైన అవగాహననిచ్చింది. కానీ, అది వ్యక్తిగత విషయం.

**నిసిత్ :** ప్రతిరోజూ ఎంతమంది చరణామృతం తాగుతారో నీకు తెలుసా?

**డాక్టర్ గుప్తా :** ఇంచుమించూ వెయ్యి మంది.

**నిసిత్ :** గత పదిహేను రోజుల్లో ఎంతమంది రోగులు వచ్చుంటారు?

**డాక్టర్ గుప్తా :** సుమారుగా 500 మంది. ఇంకా ఇతర డాక్టర్ల వద్దకు వెళ్లిన రోగులూ వుంటారు అని చెపుతుంటే వినకుండా మధ్యలోనే అడ్డు తగుల్తూ – "15000 మందిలో 500 మందే జబ్బుపడ్డారన్న మాట! అయినా సరే తీర్థాన్ని తప్పుపడుతున్నాడు, ఈయన మాటలు విందామా" అని సభను రెచ్చగొడతాడు నిసిత్. ఆ ప్రశ్నకు మూక సమాధానం ఎలా వుంటుందో మనకు తెలిసిందే. అదే అదనుగా అద్దెకు వచ్చిన గూండాలు హాల్లో బాంబులు పేలుస్తారు. డాక్టరు గార్ని దొడ్డిదారిన కాపాడాల్సి వస్తుంది.

సమాజానికి మంచి చేయాలనుకున్న నీతివంతుడ్ని ప్రజాశత్రువుగా ముద్ర వేస్తారు. 'ప్రజాశత్రువు డాక్టర్ అశోక్ గుప్తాను గుర్తించండి' అన్న రాతలు అతడి ఇంటి గోడలపై వెలుస్తాయి. అతడి గాజు కిటికీలపై రాళ్లు కురుస్తాయి. అతడి ఉద్యోగమూ, అతడి కూతురి టీచరు ఉద్యోగమూ పోతాయి. ఇంటాయన ఇల్లు ఖాళీ చేయమంటాడు. దారులన్నీ మూసుకు పోయాయనుకున్న తరుణంలో – దేరీజ్ ఎ రే ఎట్ ది ఎండ్ ఆఫ్ ది టనెల్ – అన్నట్టు ఆశావహంగా ముగుస్తుంది సినిమా. రొనేన్ స్నేహితులైన ప్రగతిశీల యువకులు ఒక ర్యాలీ తీస్తూ "లాంగ్ లివ్ డాక్టర్ అశోక్ గుప్తా – డాక్టర్ గుప్తా మీ వెంట మేమున్నాం" అని నినదిస్తున్న ధ్వని నేపథ్యంలో వినిపిస్తుంది. 'జనవార్త'కు రాజీనామా చేసిన ఉప సంపాదకుడు ముందుకొస్తాడు. డాక్టరు గారి ఇంటర్వ్యూతో పాటు, అతని వ్యాసాన్ని కలకత్తాలోని ప్రముఖ వార్తాపత్రికలకు ప్రచురణ కోసం పంపిస్తున్నట్టు ఆయన చెబుతాడు. నిరాశపడిన డాక్టరుగారికి వెయ్యేనుగుల బలం వస్తుంది. సైన్సుకూ, విశ్వాసాలకూ సంఘర్షణ కొనసాగుతూనే వుంటుందని చెప్పేలా, డాక్టరుగారి టేబుల్‌పై స్టెతస్కోపు పక్కనే చరణామృతం సీసా కనిపిస్తుంది. ఆ సీసాలో ఓ తులసి ఆకు అమాయకంగా తేల్తూ వుంటుంది.

సౌమిత్రా ఛటర్జీ డాక్టర్ గుప్తాగా అద్భుతంగా నటించాడు. నిసిత్‌గా ధృతిమాన్ ఛటర్జీ తన సంభాషణా శైలితో, వంకర చూపుల్తో అచ్చమైన విలన్ అగుపిస్తాడు. కుమార్తెగా మమతా శంకర్, భార్యగా రుమా గుహా ఠాకుర్తా పాత్రోచితంగా నటించారు. డాక్టర్ గుప్తాకూ, అతడి భార్యకూ మధ్య ఓ ఆసక్తికరమైన సంభాషణ ఇలా సాగుతుంది –

**డాక్టర్ గుప్తా :** తులసి ఆకుతో నీరు శుద్ధమౌతుందట! చరణామృతంలో రోగ కణాలు వుండే ప్రసక్తే లేదట! ఈ మాటలు నువ్వెప్పుడన్నా విన్నావా? నువ్వు నమ్ముతావా?

**మాయ :** చిన్నప్పుడు నాన్న చెబితే నమ్మేదాన్ని. సైన్సు చదివిన భర్త అప్పట్లో నా చెంత వుండేవాడు కాదుగా!

**డాక్టర్ గుప్తా :** నిజం చెప్పు మాయా! నీకు మందిరానికి వెళ్లాలపించదా?

**మాయ:** నిజమే చెబుతా, ఒకప్పుడు అన్పించేది. కానీ ఇప్పుడు మీ ఇష్టాలకూ, నా ఇష్టాలకూ వ్యత్యాసమే లేదు. దేవుడ్ని నమ్మకపోయినా నిజాయితీగా వుండొచ్చని మిమ్మల్ని చూస్తే నాకర్థమైంది.

దినపత్రిక ఎడిటర్ హరిదాస్ బయటికి మాత్రమే ప్రగతిశీలుడిగా కనిపించే అవకాశవాది. ఆ సంగతిని చెప్పడానికా అన్నట్టు అతడ్ని ప్రతి దృశ్యంలోనూ ఎరుపురంగు బాహ్య వస్త్రంతో చూపిస్తాడు దర్శకుడు.

1983లో 'ఘరే బాయిరే' సినిమా షూటింగు జరుగుతుండగా సత్యజిత్ రాయ్‌కి హార్ట్‌ఎటాక్ వచ్చింది. ఆ తర్వాత చాలాకాలం సినిమాలు తీయలేదు. 1987లో డాక్టర్ పర్మిషన్‌తో ఇండోర్ షూటింగులకే పరిమితమౌతూ ఈ సినిమా తీశాడు. ఇండోర్ కాబట్టి హెన్రిక్ ఇబ్సన్ నాటకాన్ని ఆధారం చేసుకుని ఈ సినిమా తీశాడు. ఇబ్సన్ జీవితానికీ, రాయ్ జీవితానికీ ఒక ఆసక్తికరమైన పోలిక వుంది.

1881లో ఇబ్సన్ 'ఘోస్ట్స్' అని ఓ నాటకం రాశాడు. ఇందులో అతడు ఆనాటి సాంఘిక విలువలపై, మత మౌఢ్యంపై ధ్వజమెత్తాడు. అతడ్ని ప్రజాశత్రువు అని ముద్ర వేశారు. ఆ తర్వాతి సంవత్సరం ఆ కోపంతోనే 'ది ఎనిమీ ఆఫ్ ది పీపుల్' అనే నాటకం రాశాడు. రాయ్ విషయానికొస్తే మూఢనమ్మకంతో ఇంటి కోడల్ని అమ్మవారుగా మార్చేసే కథతో 1960లో 'దేవి' అనే సినిమా తీశాడు. చాలామంది రాయ్‌ను హిందువుల శత్రువు అని విమర్శించారు. ఇది జరిగిన ముప్పై యేళ్ల తర్వాత రాయ్ 'గణశత్రు' (ప్రజాశత్రువు) సినిమా తీశాడు. దానికి 'ది ఎనిమీ ఆఫ్ ది పీపుల్' నాటకాన్నే ఆధారంగా తీసుకున్నాడు. ఆధారంగా మాత్రమే! సినిమా కథాకాలమూ, నేపథ్యమూ, ఇతివృత్తమూ నాటకం కంటే బిన్నంగా వుంటాయి. సత్యజిత్ రాయ్ తన జీవిత ఆఖరు దశలో తీసిన ఆణిముత్యం 'గణశత్రు'.

పాలస్తీనా పోరాట చిత్రం

(అంతర్జాలం నుండి)



అదృష్టదీపక్ సంస్మరణలో....

# నిబద్ధ కవిత్వం ఫలించిన “నిరీక్షణ”

- అదృష్ట దీపక్

**ఆధునిక** సమాజం అన్నిరంగాలలోనూ విపరీతమైన వేగాన్ని అందుకుంటోంది. జీవితంలో వేగం” మంచిదే కాని నిర్దిష్టమైన లక్ష్యం లేనప్పుడు అది ప్రమాదాలకు దారి తీస్తుంది. ఇటీవలి కవిత్వంలో ఈ వేగోధృతి బాగా పెరిగిపోయింది. శుభ్రమైన ఆహారం తయారు చేసుకునే ఓపిక లేని వాళ్లు ఫాస్ట్ ఫుడ్ కోసం వెంపర్లాడుతున్నట్టే – ఒక చక్కని కవిత రాసి పాఠకుడిని ఆ వాతావరణంలోకి ప్రవేశపెట్టే సామర్థ్యం లేని కొంతమంది కవులు మినీ కవితలూ, హైకూలూ ఎక్కువగా వెలువరిస్తున్నారు. మంచి కవిత్వం ఏ రూపంలో ఉన్నా ఆహ్వానించతగినదే కానీ హైకూల ఆకర్షణలో కొట్టుకుపోతున్న ప్రగతిశీల కవులు కూడా సామాజిక ప్రయోజనాన్ని విస్మరించి శుద్ధ కళావాదులుగా మారిపోతున్నారు. తమకు తెలియకుండానే రూపవాదాన్ని భుజాన వేసుకుని ఊరేగుతున్నారు.

ఇలాంటి వాతావరణంలో జనసాహితి వారు ప్రచురించిన ఛాయరాజ్ దీర్ఘకవిత “నిరీక్షణ” ఏటికి ఎదురీదుతూ పాఠకుల ముందుకు వచ్చింది. ప్రజాపోరాటంలో నిమగ్నమయిన విప్లవ యోధుని కోసం అతని జీవన సహచరి నిరీక్షణను ఛాయరాజ్ 13 భాగాల దీర్ఘ కవిత ద్వారా అక్షరాల్లోకి అనువదించాడు. విప్లవ కవిత్వమంటే అరుపులు, కేకలూ, నినాదాలూ మాత్రమే అనుకునేవారికి కనువిప్పు కలిగించేలా కవి ఛాయరాజ్ తన “నిరీక్షణ”ను సాంద్రమయిన భావుకత్వంతో మన ముందుంచాడు. తన సహచరుని కోసం ఎదురు చూసే స్త్రీ హృదయంలో చెలరేగిన ప్రకంపనాలను రికార్డ్ చేసి మనకు అందించడంలో చక్కని కవితాశక్తిని ప్రదర్శించాడు.

నిరీక్షణకు మూలకారణమైన “ప్రేమ” ఈ కవితలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. విప్లవ కవిత్వంలో “ప్రేమ” అంటే కొంతమందికి కొరుకుడు పడకపోవచ్చు. ఇది ప్రబంధాల్లో పెల్లుబికిన వికృత శృంగారం కాదు. భావ కవితాయుగంలో చెలరేగిన వైయక్తిక శృంగారమూ కాదు. ఇది తన సహచరుడి జీవితాదర్శాన్ని అర్థం చేసుకుని, అతనికి అడుగడుగునా నైతిక బలాన్ని సమకూర్చే ఇల్లాలిలో వెల్లువైన ప్రేమభావం.

**“నీ యుద్ధరంగానికొచ్చి నేనేద్వను సహచరుడా”** – అనడంలోనే నిరీక్షణలోని వేదనతోపాటు అతని ఆశయాన్ని నీరుకార్చకూడదనే లక్ష్యం కూడా మనకు కనిపిస్తుంది.

**“ఒకే ఒక చిన్న ఊహా సమయంలో**
**నువ్వు భుజం తట్టినట్టున్న స్పర్శకే**
**నేనొక నూతన యుగమంత మేర విస్తరించాను”.**

అన్నప్పుడు సహచరుని ఆచరణతో కలబోసిన ఆమె ఆలోచన ఎంత స్ఫూర్తిని సంతరించుకుందో మనకు అర్థమవుతుంది. భౌతిక సుఖం కంటే భర్త ఆశయం ఎంతో గొప్పది అనే స్పృహ ఆమెలో ఉంది కనుకనే

**“గౌరవం చెడని చనువుతో**
**ఒక్కసారి నిమ్ము చూడాలని ఉంది”** – అంటుంది.

“ఒక్కసారి నిన్ను చూడాలని ఉంది” అనే సాధారణమైన వాక్యాన్ని” గౌరవం చెడని చనువుతో” అనే ప్రయోగం మహోన్నతమైన ఆదర్శ శిఖరాల మీదకు తీసుకుపోయింది. బ్రతుకుతెరువు కోసమో, మరే ఇతర కారణం చేతనో దూరంగా ఉన్న భర్త కోసం భార్య నిరీక్షించడంలో పెద్ద విశేషం లేదు. కాని విప్లవ పోరాటంలో ఏ మూల ఏ ప్రమాదం పొంచి వుందో – ఎక్కడ ఏ ఎన్‌కౌంటర్ నక్కివుందో తెలియని పరిస్థితుల్లో సహచరుని కోసం కొనసాగుతున్న ఈ నిరీక్షణ పాఠకుడి మనసును ఆర్ద్రం కావిస్తుంది.

చివరిగా –

**“నీ జీవిత పర్యవసానాన్ని**
**నేమనుభవిస్తాను.**
**నీ ఆయుధాన్ని**
**వేనందు కుంటాను”** –

అన్నప్పుడు ఒక్కసారిగా పాఠకుడి గుండె ఝల్లుమంటుంది. భర్త జీవితాదర్శాన్ని తనలో ఆవాహన చేసుకున్న ఆ స్త్రీమూర్తి జీవన చైతన్యానికి పరాకాష్ఠగా నిలుస్తుంది. లావాలో విరిసిన ఎర్రగులాబీలా కన్పిస్తుంది.

ఈ చిన్న పుస్తకానికి వరవరరావుగారు రాసిన “పారస్పర్యం”లో **“ఇంటి దగ్గరి నిరీక్షణ ఎండాకాలపు నిమిషాలవలె నిడివిగా ఉంటుంది. యుద్ధ రంగంలోని నిరీక్షణ చలికాలపు ఆవలింతలోని మంచు పొగలా వుంటుంది”** అంటూ “నిరీక్షణ”ను చక్కగా కవిత్వీకరించారు.

దివికుమార్‌గారు “ముందుమాట”లో ఛాయరాజ్ కవితాతత్త్వాన్ని సమగ్రంగా విశ్లేషించారు. నాయకుల బాధ్యత గురించి చెబుతూ – **“కుటుంబాలకు దూరంగా వున్నాం కనుక అందుబాటులో ఉన్నవారితో భౌతిక వాంఛలు తీర్చుకోవడమనేది ఒక అరాచక సిద్ధాంతం. ఆచరణలో అది స్త్రీలకు ఎక్కువ నష్టదాయకంగానూ, పురుషులకు సౌకర్యవంతంగానూ వుండే విధానం”** అన్నమాటలు ఇటీవల తెలుగు సాహిత్యంలో “హో”రెత్తి పోతున్న అరాచక వాదులకు చెంపపెట్టుగా ఉన్నాయి.

(**“నిరీక్షణ”** దీర్ఘ కవిత. రచన : **ఛాయరాజ్.**
వెల : **8 రూ॥లు.** ప్రతులకు : **మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ – 520002)**

– ‘ప్రజాసాహితి’ నవంబరు 1997 సంచిక నుండి ✹

జూలై 24 నిర్మలానంద 3వ వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ....

# అతను ఎన్నుకున్న బాట అందరికీ వెలుగుబాట

నిర్మలానంద



'నేను నేలకొరిగితే.... పాలస్తీనా పోరాట సాహిత్యం' అనే కథల, కవితల, అనుబంధాల సంకలనాన్ని నిర్మలానంద సంపాదకత్వంలో అంతర్జాతీయ పాలస్తీనా సంఘీభావదినం 29-11-84న జనసాహితి ఆవిష్కరించింది. ఈనాటి పాలస్తీనా పరిస్థితులకూ అన్వయించుకోగలిగిన ఆ సంకలనానికి సంపాదకుడిగా నిర్మలానంద రాసిన వ్యాసాన్ని ఆయన 3వ వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ ప్రచురిస్తున్నాం.



**"అటు చూడండి పాలస్తీనా దేశభక్తుణ్ని!**
**బతుకుతూనే, ప్రాణాలు విడుస్తూనే నిటారుగా నిలబడ్డాడు**
**పోరాడుతూనే వాస్తవం గ్రహిస్తాడు**
**పోరాడుతూనే రేపు గురించి కలలు కంటాడు"**

\- రె. విలియం రెనెల్

లక్ష్యసాధన కోసం ప్రాణాలు అర్పించడమో లేదా శత్రువుని హతమార్చడమో - ఏదో ఒకటి చేయాలి. పాలస్తీనా జాతీయ విప్లవకారుని ఆలోచన సరిగ్గా ఇలాగే వుంటుంది. అంతేకాదు, కళ్ళముందే శత్రువు తన పిల్లల్ని నిలువునా చీరేస్తూ వుంటే, తన యిల్లు కనుమరుగయిందని తెలిసి కూడా నిటారుగా నిలబడి, ప్రతిరోజూ నవోషస్సుని తిలకించడం అంటే - అది అతని చైతన్య స్థాయిని తెలిజేస్తుంది. సరిగ్గా అతను అలాగే చేస్తాడు.

పాలస్తీనా పోరాటం ఆ దేశ ప్రజల స్వయంకృతమా? లేక ఏ దుష్టశక్తులో వాళ్ళని ఆ పరిస్థితిలోకి బలవంతంగా నెట్టేశాయా?

బ్రిటిష్ సామ్రాజ్యవాదం యూదు జాతీయ దురహంకారాన్ని ఎగదోసి, వాళ్ళని పాలస్తీనాలోకి దిగుమతి చేసింది. విభజించి పాలించే రాజకీయపు ఎత్తుగడలో యూదుల్ని పాలస్తీనా ప్రజలమీదకి పావులుగా ఉపయోగించింది. సైనిక శిక్షణ యిచ్చి, ఉవ్వెత్తున లేచే జాతీయ పోరాటం మీద, తన సైన్యంతో పాటుగా, యూదు మూకల్ని కూడా ఉసిగొల్పి, ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా బ్రిటిష్ ప్రభుత్వం అణచివేసింది. ఎందరో పాలస్తీనా విప్లవకారులు ఉరికంబాలెక్కారు. మర్నాడు తనపై ఉరిశిక్ష అమలు జరుగుతోందనగా (1937), ఓ ఖైదీ ఇలా రాశాడు :

"ఓ అన్యాయమా!
.....................
నా కన్నీరు - భయం వల్ల వచ్చింది కావు
నా కన్నీరు - మాతృదేశం కోసం."

ఆనాటి పై కవిత ("ఖైదీ గీతం") ఈనాటికీ పాలస్తీనా ప్రజలకి పోరాటస్ఫూర్తినిస్తూనే వుంది.

పాలస్తీనా ప్రజలు సౌమ్యులు. శాంతి స్వభావులు. ఇంటికొచ్చిన ఆత్మీయుల్ని హృదయపూర్వకంగా ఆదరిస్తారు. పాలకులు తమ దేశంలోకి దిగుమతి చేస్తున్న (యూదు) బంధువుల్ని చాలాకాలందాకా గుమ్మంలోంచి పొమ్మనలేదు. అయితే ఒకనాటి ఉదయం లేచేసరికి-

"పండించిన పంటంతా ఎత్తుకుపోయారు
పాడుచేసి, నా భార్యని దూలానికి వేలాడగట్టారు
నా చిట్టిబాబు వీపుని గాయాల పొలంగా మార్చేశారు"

అంతే. అతనికి ఒళ్ళు భగ్గుమంది. ఇంటి గుమ్మంలో బాకులు, మందుగుండు పాతర నాటాడు - వాటిని మిత్రుని రూపంలో ఉన్న శత్రువుపై ప్రయోగించేందుకు. అప్పటిదాకా తాత్త్విక స్వాప్నికుల కవిగా వుండిన పాలస్తీనా కవి, ఒక్కసారిగా బద్దలు కావడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంగా మారిపోయాడు.

యూదుల దృష్టిలో అరబ్బులు అంటే ఆటవికులు, అనాగరికులు, సంస్కారం లేనివారు. వారి ఆస్తుల్నీ, భూముల్నీ గుంజుకొని గ్రామాల నించి వాళ్ళని తరిమి కొట్టవచ్చు; తప్పులేదు. అయినా పాలస్తీనా ప్రజలకి యూదులంటే ద్వేషం లేదు; అసహ్యం కలుగదు.

"కాని - నేను ఆకలితో చావవలసివస్తే
నా దొంగల మాంసం తినేస్తాను
నా ఆకలి, జాగ్రత్త!
నా ఆగ్రహం, జాగ్రత్త!" అంటాడు మొహమద్ దర్వేష్
("గుర్తింపుకార్డు" కవిత).

అప్పటిదాకా ప్రియురాలి మెల్లకన్ను మీద, మెహబూబా ముంగురుల మీద, క్రీగంటి చూపు మీద కవితలల్లిన పాలస్తీనా కవి ధోరణే గుణాత్మకమైన మార్పుకి లోనయి, దేశంలో ఉవ్వెత్తున లేస్తున్న జాతీయ ప్రజాపోరాటాలతో శృతి కలిపింది అతని కవిత.

"చేతిలో బాంబు ఓ కవితగా పేలింది
......... ......... .........
నేలకింద గనులుగా బద్దలు కావడానికి
కవితా సంకలనాలు కలలు గంటున్నాయి."
("గోడలూ - వార్తాపత్రిక")

అలా మారింది కవితా స్వరూపం.

1948, 67లతో యూదు విస్తరణవాదులు మొత్తం పాలస్తీనాని ఆక్రమించుకున్నారు. సైనిక శాసనం విధించి గృహ దహనాలు, పూచకోతలు, మేధావుల్నీ, కవుల్నీ, కళాకారుల్నీ నిర్బంధించడం, దేశం నించి బహిష్కరిస్తూ రావడం నిత్యకృత్యమయిపోయింది.

"చరిత్రకి పిచ్చెక్కింది
కాలికి బుద్ధి చెప్పక తప్పదు మనం
"…..మనం తొలగిపోయి తెరమరుగు కాలేదు
కష్టాలలో రాటు తేలి నవ చైతన్యం పుంజుకుంటున్నాం."

చనిపోయిన ఆత్మీయుల్ని సమాధిచేసి, పాలస్తీనా ప్రజలు సాగిపోయారు 'వాన కోయిలలా' ఇరుగు పొరుగు దేశాలకి. ఆక్రమిత ప్రాంతంలో పాలస్తీనియులకి నిత్యమూ ఆరడే, నిర్బంధాలే; ఆంక్షలే. మొత్తం దేశమే ఓ బందిఖానాగా మార్చివేయబడింది.

"చేతులకి బేడీలు వేసి
నోళ్లు కుట్టేసి
నరకం నీడలో
చీకటి గుడారాలలో
నా జాతినంతటినీ ఖైదు చేశారు వాళ్లు"
("నరకంలో పూలు")

అంతేకాదు, ఆక్రమిత ప్రాంతంలో భూ ఆక్రమణలకి వ్యతిరేకంగా అమాయిక రైతులు సైతం ఎలా తిరగబడుతున్నదీ "న్యాయం" కథ స్పష్టం చేస్తోంది.

పాలస్తీనా పోరాటంలో "రఫా" నగరం పిల్లలకి ఓ ప్రత్యేకత ఉంది. శత్రువు ఎడల వయసుకు మించిన కసి, చైతన్యం సంతరించుకున్నారు వారు. 1964లో రఫా బాలుడు అల్లా ఉద్దీన్, తన ముందునించి పోతున్న కారుమీద రాళ్ళవర్షం కురిపించి, శత్రువు తుపాకీకి బలి అయిపోయాడు. అప్పటిదాకా శత్రువు తరమివేస్తే దేశం నించి, తల వంచుకుపోయే పాలస్తీనా ప్రజలలో అమరుడయి అల్లా ఉద్దీన్ పోరాట చైతన్యం రగల్చాడు. అంతేగాదు – పరోక్షంగా 1964న పాలస్తీనా విమోచనాసంస్థ ఆవిర్భావానికి సైతం ప్రేరణ కాగలిగాడు.

"రఫా పిల్లలు" (కవిత), "అమరవీరుడు" (కథ) వంటి రచనలకి అల్లా ఉద్దీనే ఊపిరి.

పాలస్తీనా కాందిశీకుల శిబిరాలలో వందల, వేల సంఖ్యలో "ఉమ్మసాద్" వంటి తల్లులు మనకి నిత్యం కనిపిస్తూంటారు.

పి.యల్.ఓ.(పీపుల్స్ లిబరేషన్ ఆర్గనైజేషన్)లో చేరి పాలస్తీనా విముక్తి పోరాటంలో పాల్గొనడానికి యువకులు వేల సంఖ్యలో ముందుకి వస్తున్నారు – పోరాటంలో పాల్గొనేందుకు "మూగతనం" ఓ అడ్డంకి కానేకాదు ("కేసు" కథ)

ఈనాడు ప్రతి పాలస్తీనీయుడూ పడుతున్న ఆవేదన ఒహటే – అది : కోడిపెట్టకి, కుందేలుకి, గుర్రానికి, చేపకి, పక్షికి తలదాచుకునేందుకు ఓ ఆశ్రయం అంటూ ఉంది – మరి తనకి లేదేం?

'టెంటులా? – డేరాలా?
ఇవి ఇళ్ళు కావే! వాకిళ్ళు కావే!'
("పాలస్తీనా నా ఇల్లు")

శత్రువులు ఆక్రమించుకున్న ఇళ్ళని మళ్ళీ తాము స్వాధీనం చేసుకున్నదాకా నిద్రపోరాదు.

"మీ కాళరాత్రి ఆర్పలేదు
మా విప్లవ జ్యోతుల్ని
నా ప్రజల పోరాట జ్వాలల తాకిడికి
ఉదయిస్తుంది స్వేచ్ఛా ఉషస్సు"
("ఆశావాదం")

ఇజ్రాయిల్ ఉనికిలోకి వచ్చి, 36 ఏళ్ళయినా కూడా అది ప్రజల సమస్యల్ని పట్టించుకున్నది లేదు. నిర్మాణాత్మక ప్రణాళికల్ని చేపట్టింది లేదు. ఎప్పుడూ యుద్ధం! యుద్ధం!! యుద్ధం!!! అది తప్ప దానికి వేరే పని లేదు. అందుకోసమే అది పుట్టినట్టుంది. దేశం నిరంతరం యుద్ధాల్లో మునిగి తేలుతూండటం వల్ల ఇజ్రాయిలీ ప్రజలు ఎన్నో కష్టనష్టాలకు లోనయ్యారు. నిత్యావసర వస్తువుల కొరత, రోజురోజుకీ ఆకాశాన్ని అంటే ధరలు, తీవ్రమయిన ఆర్థిక సంక్షోభం విలయతాండవం జేయడం.

ఆగస్టు 1984లో ఇజ్రాయిలీలో ద్రవ్యోల్బణం 400 శాతం అయితే అది అక్టోబరు 1984లో 930 శాతానికి చేరి నవంబరు 1984 చివరికి 1000 శాతం పెరగవచ్చు. ఈనాడు ఇజ్రాయిలీ ప్రజలకి తమ కరెన్సీ మీద, ఆర్థికవ్యవస్థ మీద, ప్రభుత్వం మీద పూర్తిగా విశ్వాసం పోయింది. ప్రభుత్వ పాలనకి వ్యతిరేకంగా ఇజ్రాయిలీ ప్రజలు సమ్మెలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. జూలై 1984లో ఇజ్రాయిలీ పార్లమెంటుకి జరిగిన ఎన్నికలలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. గత ఏడేళ్ళుగా పాలించిన లికుడ్ పార్టీకి 41 స్థానాలు, లేబర్ పార్టీకి 44 స్థానాలు, మిగతా మతతత్త్వ పార్టీలకి 35 స్థానాలు వచ్చాయి.

దేశంలో నెలకొని ఉన్న ఈ సంక్షోభానికి ఇజ్రాయిలీ మేధావివర్గం కూడా తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. అంతేకాదు, యుద్ధ వ్యతిరేకత కూడా నానాటికీ ఇజ్రాయిల్‌లో పెరుగుతోంది.

★ ★ ★

22-11-1974న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పి.ఎల్.ఓ అధ్యక్షుడు యాసర్‌అరాఫత్ సభ్యులను ఉద్దేశించి ఉద్వేగంతో యిలా ప్రకటించాడు.

"నేను ఇక్కడికి శాంతి చిహ్నమయిన ఆలివ్ కొమ్మని ఓ చేతితోనూ, స్వాతంత్ర్య సమరయోధుని తుపాకీ వేరొక చేతితోనూ పట్టుకొచ్చాను. నా చేతిలోంచి ఈ ఆలివ్ కొమ్మని పడిపోనివ్వకండి."

పాలస్తీనా ప్రజలు శాంతినే కోరుతున్నారు. కానీ యుద్ధోన్మాదులు, జాత్యహంకారులూ అయిన ఇజ్రాయిలీలు, వారికి ప్రత్యక్ష మద్దతునిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదులు, పరోక్షంగా సహాయపడుతున్న రష్యా సోషల్ సామ్రాజ్యవాదులు శాంతి ఏర్పడకుండా చేస్తున్నారు. అది వారికి సహజమే! శాంతిని యుద్ధం ద్వారానే సాధించుకోవాల్సిన నేటి స్థితిలో, తుపాకీ రాజ్యాలిని అంతం చేయాలంటే, తుపాకీతో తప్ప సాధ్యంకాని ఈ కాలంలో, పాలస్తీనా ప్రజలు పోరాటాన్ని కొనసాగించి అంతిమ విజయం సాధిస్తారని ప్రపంచ ప్రజానీకం – ముఖ్యంగా రచయితలు, కళాకారులు వారికి తమ సంఘీభావాన్ని అందించి, వారి పోరాటానికి ఊపుని ఇస్తారని ఆశిస్తున్నాము.

ఈ విధంగా పాలస్తీనా పోరాటానికి అంతర్జాతీయ సంఘీభావాన్ని అభివ్యక్తం చేయడం తన కర్తవ్యంగా భావించి జనసాహితి ఈ పుస్తకం ప్రచురిస్తోంది.

**విజయవాడ,**
**25-11-1984**

నిర్మలానంద
సంపాదకుడు

# సంతాపాలు

## 'ఫాదర్ ఆఫ్ కరిసాల్' - కి. రాజనారాయణన్ (కీరా) మరణానికి సంతాపం



**తెలుగు** మూలాలున్న తమిళ జానపద సాహిత్యకారుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాయంగళ శ్రీకృష్ణ రాజనారాయణ పెరుమాళ్ రామానుజన్ నాయకర్ (కిరా) 2021 మే 17న పాండిచ్చేరిలో తన 98వ ఏట మరణించారు. ఆయన 1923 సెప్టెంబర్ 16న తమిళనాడులోని తూత్కుడి జిల్లాలో గల కోవిలపట్టు గ్రామ సమీపంలోని ఇదిసైవల్ ప్రాంతంలో జన్మించారు.

కీరా కుటుంబం మూడు తరాల క్రితం పొట్ట చేతపట్టుకుని తమిళ ప్రాంతానికి ఇతర వలసదారులతో కలసి వలస వెళ్ళారు. నదీ పరివాహక ప్రాంతాన్ని ఎన్నుకుని బంజరు భూముల్ని సాగుచేస్తూ అనేక కష్టనష్టాలు, ఆటుపోట్ల నడుమ జీవనం సాగించారు. ఆ నేపథ్యంలో పెరిగిన కీరా బంజరు భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతాంగపు జీవితాలను, వారి జీవన సంఘర్షణను, వారి విశ్వాసాలను ఆ సాంస్కృతిక జీవన నేపథ్యంతో కథలూ, నవలలూ, వ్యాసాలూ రాశారు. బాల్యంలో ఆరోగ్యం సహకరించకపోవటంతో ఆయన ఏడవ తరగతి వరకే చదవగలిగారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా వుంటూ, రైతుకూలీల సమస్యలపై పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1947-51ల మధ్య జైలు జీవితం గడిపారు. 1952లో ప్రసిద్ధిగాంచిన నెల్లై కుట్రకేసులో కీరా కూడా ముద్దాయే. కీరా తన ముప్ఫైవ ఏట నుండి కథలు రాయటం ప్రారంభించారు. 30కి పైగా పుస్తకాలు రాశారు. ఆయన రాసిన 'గోపల్లపురత్తు మక్కళ్' (గోపల్లె పురజనులు) నవలకు 1991లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆయన రాసిన కథ 'కరెంట్'నూ 1992లో 'కద్దై'ను 'ఒరుత్తు' అనే పేరుతో 2003లోనూ తమిళ సినిమాలుగా మలిచారు. ఇవి జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో బహుమతులు అందుకున్నాయి.

కీరా తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుండి మౌఖిక కథలను సేకరించి ప్రచురించారు. మాండలికాలకు నిఘంటువును రూపొందించారు. తెలుగులో వాడుకభాష కోసం గిడుగు రామ్మూర్తి పంతులు కృషి చేసినట్లుగానే తమిళంలో ఆయన విశేష కృషి చేశారు. 'మక్కళ్ తమిళ్ వాళ్గ' (వాడుక తమిళం వర్ధిల్లాలి) అన్న వీరి రచన తమిళనాడులో వాడుకభాష ప్రచారానికి నాంది పలికింది. 1989 నుండి పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో జానపద సాహిత్య విభాగానికి ఆయన డైరెక్టరుగా వున్నారు. 1998 నుండి 2002 వరకూ ఆయన సాహిత్య అకాడమీ అడ్వైజర్‌గా వున్నారు. 2007లో ఆయన రచనలన్నిటినీ అండమాన్ నాయకర్ 'నట్టుపుర కథై కళాంజియా' (దేశీయ కథల సంకలనం)ను ప్రచురించారు.

ప్రజాసాహిత్యానికై కృషిచేసిన కీరాకు జనసాహితి సంతాపం ప్రకటిస్తుంది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తుంది.

## అభ్యుదయ కవి , స్నేహశీలి అదృష్టదీపక్ మరణానికి సంతాపం



**అభ్యుదయ** కవి, రచయిత, సాంస్కృతిక కళాకారుడు అదృష్టదీపక్ మే 16, 2021న కోవిడ్‌తో కాకినాడలో మరణించారు. ఆయన జనవరి 18, 1950లో తూర్పుగోదావరిజిల్లా రావులపాలెంలో జన్మించారు.

స్నేహం మన ఆదర్శం! స్నేహమే మన సందేశం!! అంటూ స్నేహాన్ని మంచితనంగా మార్చుకుని అందరితో స్నేహం చేసే అదృష్టదీపక్ తన స్నేహ ప్రపంచాన్ని వీడి శాశ్వతంగా భౌతికంగా నిష్క్రమించారు. ఉత్తమ నాటక ప్రదర్శనల న్యాయమూర్తి, చరిత్ర పాఠాలు బోధించిన అధ్యాపకుడు ... ఇలా బహుముఖ జీవన కార్యకలాపాలలో ప్రజ్ఞావంతుడైన అదృష్టదీపక్ మరణ వార్త ప్రగతిశీల సాంస్కృతికోద్యమ శిబిరానికి ఊహించలేనిది.

తాను అభ్యుదయ రచయితల సంఘానికి చెందినవాడే అయినప్పటికీ ప్రజా సాంస్కృతికోద్యమ సంస్థలతో వ్యక్తులతో కలసి నడవటం అదృష్టదీపక్ తత్వం. ఆయన బెర్టోల్డ్ బ్రెఫ్ట్, ప్లాబో నెరూడా కవితలను తెనిగించారు. 'కోకిలమ్మ', 'సమరశంఖం', 'ప్రాణం', 'ఆశయాల పందిరిలో' 'శ్రీశ్రీ ఒక తీరని దాహం' మొదలైన పుస్తకాలను వెలువరించారు. ఆయన రచనలు ప్రారంభించిన రోజుల్లో 'జోకర్', 'బుడుగు', 'నవ్వులు - పువ్వులు', 'పకపకలు' మొదలైన పత్రికలలో ఆయన రచనలు విరివిగా రాశారు. 'ప్రజాసాహితి'లో ఛాయరాజ్ రాసిన దీర్ఘకవిత 'నిరీక్షణ'ను సమీక్ష చేశారు. మరికొన్ని సమీక్షలు, రచనలు చేశారు. ఆయన బాల్యాన్ని 'ప్రజాసాహితి'లోని 'బాలసాహితి' శీర్షిక ద్వారా పంచుకున్నారు. ఆయన కవితలు కొన్నింటిని నిర్మలానందగారు హిందీలోకి కూడా అనువాదం చేశారు.

"నేటి భారతం" సినిమాలో ఆయన రాసిన 'మానవత్వం పరిమళించిన' పాటకు నంది అవార్డు లభించింది.

"జీవించటం తెలియని జీవితం చావలేక జీవిస్తోంది!
జీవించడం మరచిన జీవితం శవం లాగా జీవిస్తోంది."

అంటూ శవం లాంటి జీవితాన్ని మార్చుకోమని ప్రబోధించిన, ప్రజా ఉద్యమశక్తులు ఐక్యంగా సాగి నడవాలని చివరికంటా ఆశించిన అదృష్టదీపక్ మరణానికి జనసాహితి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూంది.



## ప్రముఖ లౌకిక మేధావి రిజ్వా ఖైజర్ మరణం

**ప్రముఖ** లౌకిక మేధావి రిజ్వా ఖైజర్ కోవిడ్‌తో తన 61వ ఏట 5-6-2021న మరణించారు. ఆయన 1960లో మాంఘీర్ (బీహార్)లో జన్మించారు.

ఆయన 1980లో జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో బిపిన్ చంద్ర, మృదులా ముఖర్జీ, కె.ఎన్. పణిక్కర్, సర్వసాచి భట్టాచార్యల పర్యవేక్షణలో ఆధునిక భారత చరిత్రపై అధ్యయనం చేశారు. 1989 నుండి జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో చరిత్ర శాఖాధిపతిగా వున్నారు. సెంటర్ ఫర్‌ది స్టడీ ఆఫ్ కంపారిటివ్ రిలిజన్స్ అండ్ సివిలైజేషన్స్ గౌరవ డైరెక్టర్‌గా వున్నారు.

బాబ్రీ మసీదు కూల్చివేసిన సందర్భంగా జరిగిన మతహింసను వ్యతిరేకిస్తూ గ్రామాలలో పర్యటించి మత సామరస్యానికై క్రియాశీలంగా కృషి చేశారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌పైనా, భారత జాతీయ కాంగ్రెస్‌పైన పుస్తకాలు రాశారు.

## సాహిత్య పరిశోధకుడు కట్టా నరసింహులు మరణం

**మెకంజీ** రాసిన కడపజిల్లా కైఫీయతులను పరిష్కరించి 8 భాగాలుగా వెలువరించిన సాహితీవేత్త, పరిశోధకుడు కట్టా నరసింహులు తిరుపతిలో తన 72వ ఏట 15-5-2021న మరణించారు. ఆయన ఒంటిమిట్ట మండలం చిన్న కొత్తపల్లె గ్రామవాసులు.

సంప్రదాయ సాహిత్యంలో విశేష పాండిత్యం గల్గిన ఆయన టి.టి.డి. వారి పోతన భాగవతం ప్రాజెక్టులో మూడేళ్ళు పనిచేశారు. కడపలోని సి.పి. బ్రౌన్ గ్రంథాలయ నిర్వహణలో పాలుపంచుకున్నారు. బ్రౌన్ జాబులు ప్రచురణకు సిద్ధం చేశారు.

## రేఖాచిత్రకారుడు గోపి మరణం



**అనేక** పత్రికలలో ఇల్లస్ట్రేటర్‌గా ప్రఖ్యాతిగాంచిన గోపి (లగుసాని గోపాల్ గౌడ్) తన 69వ ఏట 21-5-2021న మరణించారు. ఆయన మహబూబ్‌నగర్‌జిల్లా కల్లాపూర్ సమీపంలోని ఎనమెట్ల గ్రామంలో 06-06-1952న జన్మించారు.

1980వ దశకంలో వివిధ పత్రికలలో కథలకు ఆయన రేఖాచిత్రాలను తన సొంత శైలిలో గీసారు. 1975లో ఆయన జె.ఎన్.టి.యు.లో బి.ఎఫ్.ఏ. చదివారు.

విజయవాడలో వున్న కాలంలో జనసాహితి ప్రచురణలకు సోల్ డిస్ట్రిబ్యూటర్‌గా వున్న మైత్రి బుక్‌హౌస్ లోగో లోని అక్షరాలను 1980లో గోపీ అప్పటి మైత్రి మేనేజర్, ఇప్పటి శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు కోరగా రాశారు.



## 'చిప్కో' ఉద్యమనేత సుందర్‌లాల్ బహుగుణ మరణం

**పర్యావరణ** సంరక్షణ కోసం క్రియాశీలంగా కృషిచేసిన ప్రసిద్ధ పర్యావరణ వేత్త సుందర్‌లాల్ బహుగుణ తన 94వ ఏట 21-5-2021న మరణించారు. ఆయన ఉత్తరాఖండ్‌లోని తెహ్రీగఢ్వాల్ జిల్లాలోని మరోడా గ్రామంలో 9-1-1927న జన్మించారు.

తన 13వ ఏటనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న బహుగుణ 17వ ఏట జైలుశిక్ష అనుభవించారు. 1949లో సామాజిక ఉద్యమకారుడిగా కులవ్యవస్థపై పోరాడారు. బిష్ణోయ్ గిరిజన తెగలవారి 'చిప్కో ఉద్యమ' సంప్రదాయాన్ని (అంటే చెట్లను కౌగిలించుకుని, వాటిని నరకడానికి వచ్చినవారిని అడ్డుకోవడం) పునరుద్ధరించి పర్యావరణ రంగంలో విశేష కృషి చేశారు. గంగోత్రి, యమునోత్రి ఆలయాల్లోకి దళితుల ప్రవేశాన్ని సాధించారు. తెహ్రీలో అన్ని కులాలవారు కలసి వుండే వసతిగృహాన్ని ఏర్పాటుచేశారు.

## కథా రచయిత, నాస్తికవాది కాలెపు శివశేఖర్ మరణం

**కవి,** బుల్లితెర రచయిత, కథారచయిత, వివిధ పత్రికలలో జర్నలిస్టుగా పనిచేసిన నాస్తిక సంఘం సభ్యులు శివశేఖర్ గుండెపోటుతో 26 మే 2021న మరణించారు. ఆయన 14-3-1957న జన్మించారు. 'ప్రజాసాహితి' పాఠకుడైన శివశేఖర్ - 'శేఖర్ వ్యూస్' శీర్షికను ఫేస్‌బుక్‌లో నిర్వహిస్తూ నాస్తిక భావజాలాన్ని వ్యాప్తిచేసారు. శివశేఖర్ మరణానికి సంతాపం తెలియచేస్తున్నాం.

## ఫిరా నాయకుడు రాజా సురేశ్ మరణం

**రాజా సురేశ్** (65) ప్రముఖ నాస్తికుడు, కమ్యూనిస్టు, అఖిల భారత హేతువాద సంఘాల సమాఖ్య (fira) కార్యదర్శి బరంపురం(ఒరిస్సా)లో అనారోగ్యంతో గత కొద్ది రోజులుగా వైద్యం పొందుతూ కోవిడ్ బారినపడి 14 మే 2021న మరణించారు. రాజా సురేశ్‌గారు AISF, అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (Aipso), ఇస్కస్, ఇస్కఫ్ తదితర సంఘాల్లో క్రియాశీల బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగు రాష్ట్రాల నాస్తిక హేతువాద సంఘాలతో కలసి పనిచేస్తున్నారు. వారి మరణానికి సంతాపం తెలియచేస్తున్నాం. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాం.

## బొమ్మల కట్టయ్య మరణం



**వరంగల్** నగరంలో నివసించే బొమ్మల కట్టయ్య 11.05.2021న మరణించారు. ఆయన మరణం అణగారిన వర్గాలకు, ప్రజాస్వామిక ఉద్యమాలకూ తీరని లోటు. కట్టయ్యగారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అంబేద్కర్ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడుగా చాలా ఏళ్ళుగా సేవలందించారు. దళితుల, ఆదివాసీ, మైనారిటీల ప్రజాస్వామ్య హక్కులకై పోరాటంలో ముందు వరుసలో ఉండేవాడు.

ఎక్కడ దళితులపై దాడులు జరిగినా, ప్రజలపై నిర్బంధం జరిగినా అక్కడ ప్రత్యక్షమయ్యేవాడు. మానవతావాది, దళితసంఘం నాయకుడు కట్టయ్య మరణానికి సంతాపం.

## స్నేహశీలి, సేవాతత్పరుడు నన్నపనేని అయ్యన్‌రావు మరణం



**నన్నపనేని** పున్నయ్య, లక్ష్మీనరసమ్మ ట్రస్టు ఛైర్మన్, అమ్మ అవార్డు, గుంటూరు ఫౌండర్ నన్నపనేని అయ్యన్‌రావుగారు 17 మే 20201న గుంటూరులో కోవిడ్ వల్ల కలిగిన అనారోగ్యంతో చనిపోయారు. ఆయన 6 ఆగస్టు 1940న గుంటూరు జిల్లా కొల్లూరులో జన్మించారు.

మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన అయ్యన్‌రావుగారు అనేక ఆటుపోట్లను, ఒడుదుడుకులను తట్టుకుని నిలబడ్డారు. అమెరికాలో 20 సం॥ల ఉద్యోగం తర్వాత మాతృభూమిపట్ల మమకారంతో 2011లో గుంటూరుకు తిరిగివచ్చారు. అప్పటినుండి ఈ పదేళ్ళ కాలంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలను, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా మిత్రుల సహాయ సహకారాలతో ఆయన నిర్వహించిన ఆదిధ్వని, కన్యాశుల్కం నాటకాలు వంటివి చిరకాలం గుంటూరు ప్రజలకు గుర్తుండిపోతాయి. చిత్రకళ మీద మక్కువతో చిత్రకళాప్రదర్శనను ఏర్పాటుచేశారు. ఆయన నిర్వహించిన కార్యక్రమాలను వివరంగా తెలియచేస్తూ చిన్న చిన్న పుస్తకాల రూపంలో ముద్రించారు. ఇవేగాక ఆయారంగాల్లో విశిష్టమైన సేవచేసే మహిళలకు 'అమ్మ అవార్డ్స్'ను ప్రతి సంవత్సరం బహూకరించేవారు. తనకు తోచినంతలో సమాజానికి సేవ చేయాలన్న స్థిర సంకల్పంతో, మరుగునపడిన కళారూపాలను, సాహిత్యాన్ని పునరుద్ధరించే కార్యక్రమాలు నిర్వహించారు.

2018 గుంటూరులో జనసాహితి, కలకత్తా బృందం వారు కలసి నిర్వహించిన మాక్సింగోర్కీ నవల 'అమ్మ' నాటకం ప్రదర్శన సందర్భంగా అయ్యన్‌రావుగారు జనసాహితికి పరిచయం అయ్యారు. అప్పటి నుండి క్రమం తప్పకుండా 'ప్రజాసాహితి'ని చదువుతూ ఆయన అభిప్రాయాలను పంచుకునేవారు. కొత్తపల్లి రవిబాబు అనువదించిన పాల్ రోబ్సన్ స్వీయకథ "నా జాతి ప్రజల కోసం నిలబడతా!" పుస్తకాన్ని ఏప్రియల్ 2021న వెలువరించటానికి ఆయన ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించారు. ప్రజాసాహిత్యం, కళలు అవసరాన్ని గుర్తించి - ఆచరిస్తున్న అయ్యన్‌రావు మరణానికి జనసాహితి సంతాపం తెలుపుతోంది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాం.

# ఒరియా కథా కథన చక్రవర్తి మనోజ్‌దాస్ మరణం



**ఒరియా,** ఇంగ్లీషు భాషలలో పలు రచనలు చేసిన మనోజ్‌దాస్ తన 87వ ఏట పాండిచ్చేరిలో 27-4-2021న మరణించారు. ఆయన ఒడిస్సాలోని బాలసోర్ జిల్లా, భోగ్రాయి ప్రాంతంలోని తీరప్రాంత గ్రామం శంకరిలో 27-2-1934న జన్మించారు.

మనోజ్‌దాస్ హైస్కూలు విద్యార్థి దశలోనే 1949లో తొలి కవితాసంపుటి ప్రచురించారు. 1951లో తొలి కథాసంపుటి వెలువరించారు. కటక్‌లో బి.ఏ. విద్యార్థిగా రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నారు. తీవ్రవాద భావాలు గల యువ నాయకునిగా చేపట్టిన కార్యక్రమాల వల్ల 1959లో ఒక ఏడాది జైలుశిక్ష అనుభవించారు. 1956లో ఇండోనేసియాలోని బాండుంగ్‌లో జరిగిన ఆఫ్రో – ఆసియా విద్యార్థి కాన్ఫరెన్స్‌కు ప్రతినిధిగా హాజరయ్యారు.

బాల్యంలోనే తల్లి కాదంబరీదేవి నుండి రామాయణ, మహాభారత గాధలను ఆయన విన్నారు. చరిత్ర శాఖలో ప్రొఫెసర్ అయిన ఆయన సోదరుడు మన్మథనాథ్ దాస్ ఆయనలో జ్ఞాన పిపాస రగిలించాడు. అలాగే మార్క్సిజం వైపు ఆకర్షణ కలుగచేశారు. ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రటరీగా పనిచేస్తూ యూనివర్సిటీ లా కళాశాల విద్యార్థి యూనియన్‌కు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కటక్‌లో అసంపూర్తిగా వదిలేసిన బి.ఏ. డిగ్రీని 1955లో పూరీలోని సామంత చంద్రశేఖర కళాశాలలో పూర్తిచేశారు. రావన్ షా కళాశాలలో ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ. చదివి కటక్‌లోని క్రైస్ట్ కళాశాలలో కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత అరవిందుని బోధనలకాకర్షితుడై పుదుచ్చేరి చేరి అక్కడ 1963లో అరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రంలో ఇంగ్లీషు లెక్చరర్‌గా చేరి అక్కడే స్థిరపడ్డారు.

ఫాంటసీ, వ్యంగ్యం మిళాయించి రాసిన ఆయన కథలు బహుళ ప్రచారం చెందాయి. పంచతంత్ర కథలు చెప్పిన విష్ణుశర్మతో ఆయనను విమర్శకులు పోల్చారు. గ్రామాలలోని ప్రజల బాధల గాథలే ఆయన కథా వస్తువులు. 1965 నుండి ఆయన ఇంగ్లీషులో రాయడం ప్రారంభించారు. 1985-89 మధ్య చెన్నై నుండి వెలువడే 'హెరిటేజ్' పత్రికకు సంపాదకునిగా పనిచేశారు. 2004లో తన 'జ్ఞాపకాలు' ప్రచురించారు.

1999లో చైనాలో పర్యటించిన భారత రచయితల ప్రతినిధివర్గానికి మనోజ్‌దాస్ నాయకత్వం వహించారు. 1983-85లలో సింగపూర్ ప్రభుత్వపు విద్యామంత్రిత్వశాఖలో రచయితగా, సలహాదారుగా వున్నారు. 2001లో భారత ప్రభుత్వపు పద్మశ్రీని, 2020లో పద్మభూషణ్‌లను అందుకున్నారు. కె.కె. బిర్లా ఫౌండేషన్‌వారి సరస్వతీ సమ్మాన్ స్వీకరించారు. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ ఫెలోషిప్ ఇచ్చి గౌరవించింది. 1998-2002 మధ్య కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యునిగా కొనసాగారు.

ఆయన మరణించిన తర్వాత ఒడిస్సా ప్రభుత్వం ఆయన పేరుతో ఆయన జ్ఞాపకార్థం అంతర్జాతీయ సాహిత్య అవార్డును ప్రకటించింది. ఆయన పేరుతో ఒక మ్యూజియం, ఒక గ్రంథాలయం, ఆయన పూర్వీకులు వున్న ఇంటిలో అంటే శంకరి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక ప్రభుత్వం హైస్కూలు విద్యార్థులకు 'మనోజ్ కిశోర్ సాహిత్య ప్రతిభా సమ్మాన్' ఏర్పాటు చేసింది.

మనోజ్‌దాస్ ఒరియాలో రాసిన 'దశాంక కథా – ఓ కహానీ'; రావిశాస్త్రి తెలుగులో రాసిన 'ఇల్లు', భైరప్ప రాసిన 'పర్వ', ఇంకా ఏడుగురు భారతీయ రచయితల రచనలను కేంద్ర సాహిత్య అకాడెమీ చైనీస్, రష్యన్ భాషల్లోకి అనువదించి ప్రచురించింది.

# ప్రముఖ బెంగాలీ చలనచిత్ర దర్శకుడు, కవి బుద్ధదేవ్ దాస్ గుప్తా మరణం



**ఫిల్మ్** సొసైటీ ఉద్యమంలో క్రియాశీల కార్యకర్త, డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ దర్శకుడు బుద్ధదేవ్‌దాస్ గుప్తా తన 77వ ఏట 10-6-2021న కోల్‌కటాలో మరణించారు. ఆయన పశ్చిమబెంగాల్‌లోని పురూలియా దగ్గర అనార్దాలో 11-2-1944లో జన్మించారు.

కోల్‌కటాలో ఎం.ఏ. చదివి ఆర్థికశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసిన ఆయనపై నక్సల్బరీ ఉద్యమ ప్రభావం పడింది. చిత్ర పరిశ్రమలోకి దర్శకునిగా ప్రవేశించేనాటికే రచయితగా 9 కవితా సంపుటులు; 4 నవలలు ఆయన రాశారు. 1960ల చివర్లో డాక్యుమెంటరీ రంగంలో ప్రవేశించి, 1970లలో ఫీచర్ సినిమాలకు దర్శకత్వం వహించారు. ఎమర్జన్సీ తర్వాత 1978లో తీసిన 'దూరత్వ' ఎన్నో అవార్డులు అందుకుంది. అది కవితాత్మక చిత్రం. 1989 నాటి 'బాగ్ బహదూర్'లను మన రాష్ట్రంలోని జానపద కళారూపమైన పులివేషాల నేపథ్యంలో చిత్రించారు. 'లాల్ దర్జా', చరాచర్, 'కాల్ పురుష్', 'నీమ్ అన్నపూర్ణ', 'తహదేర్ కథ', 'మెండో మేయర్ ఉపఖ్యాన మొదలగునవి. ఆయన ఇతర చిత్రాలు మొత్తం 32 జాతీయ అవార్డులు అందుకున్న గుప్తా, గోవిందన్ అరవిందన్, అదూర్ గోపాలకృష్ణన్, శ్యామ్ బెనగల్ సరసన నిలబడిన దర్శకుడు.

# భారతీయ జ్ఞానపీఠ్ సంస్థ బాధ్యురాలు ఇందు జైన్ మరణం



**ఇందు** జైన్ తన 84వ ఏట 13.5.2021న మరణించారు. జైన్ కుటుంబానికి చెందిన టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపుకు ఆమె అధ్యక్షురాలు.

సాహు శాంతిప్రసాద్ జైన్ కాలంలో 1944లో భారతీయ జ్ఞానపీఠ్ ప్రారంభమైంది. మొదట్లో దాని ద్వారా భాషా, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆర్థికంగా సహాయం చేసేవారు. 1962 ఏప్రిల్ 2న ప్రముఖ రచయిత ధర్మవీర భారతి నేతృత్వంలో 300 మంది రచయితల సమావేశంలో జ్ఞానపీఠ అవార్డును ప్రారంభించాలని నిర్ణయించారు. 1965లో అవార్డులు ఇవ్వడం ప్రారంభించారు.

ఇందు జైన్ అవయవదానానికి తన సమ్మతిని ప్రకటించినా కరోనాతో మరణించడం వల్ల అది సాధ్యం కాలేదు.

# రచయిత మైథిలీ శివరామన్ మరణం



**బహుగ్రంథకర్త,** ట్రేడ్ యూనియన్ నాయకురాలు, సామాజిక న్యాయం కోసం పోరాడిన మైథిలీ శివరామన్ తమిళనాడులో 81వ ఏట 30 మే 2021న మరణించారు. ఆమె 14-12-1939న కాకినాడలో జన్మించారు.

మైథిలీ శివరామన్ న్యూయార్కులోని సిరక్యూస్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను పూర్తిచేశారు. ఆ తర్వాత పౌరాణిక మిషన్ ఆఫ్ ఇండియాలో ఐరాస పరిశోధనా సహాయకురాలిగా పనిచేశారు. ఆ సమయంలో క్యూబాకు వెళ్ళారు. అప్పుడు సామ్రాజ్యవాదులు చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా వియత్నాం పోరాటంలో ఆమె పాల్గొన్నారు. ఆ స్ఫూర్తితో సుఖవంతమైన ఉద్యోగాన్ని వదులుకుని అట్టడుగు వర్గాలతో కలసి పనిచేయటానికి చెన్నై తిరిగి వచ్చారు. కమ్యూనిస్టు పార్టీలో సభ్యురాలైన మైథిలీ ఎమర్జన్సీ సమయంలో సి.ఐ.టి.యు.లో చేరారు. అనేక రూపాలలో ప్రజలపై సాగుతున్న దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు నాయకత్వం వహించారు.

1968 నాటి కీలవేన్మణిలో భూస్వాముల నుండి మెరుగైన జీతాన్ని అడిగినందుకు 44 మంది దళితుల ఊచకోత జరిగినపుడు ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించి మొట్టమొదటిగా వివరాలు బహిర్గతం చేశారు. అంతర్జాతీయ దృష్టికి తీసుకు వెళ్ళగలిగారు. కీలవేన్మణి ఊచకోతపై ఆమె రాసిన "హాంటెడ్ బై ఫైర్; ఎస్సేస్ ఆన్ కాస్ట్, క్లాస్" వ్యాస సంకలనం ప్రసిద్ధి చెందినది. 1985లో మెరినా బీచ్ సుందరీకరణ చర్యలో భాగంగా తమని పని నుండి బలవంతంగా తొలగించటాన్ని నిరసిస్తున్న 5గురు మత్స్యకారులను పోలీసులు కాల్చి చంపినపుడు ఆమె నాయకత్వంలో విడుదల చేసిన నిజనిర్ధారణ కమిటీ రిపోర్టు "రాడికల్ రివ్యూ"లో ప్రచురించటంతో పాలకులు సుందరీకరణను ఆపివేశారు. 1992లో చందనం స్మగ్లర్ వీరప్పన్‌ను పట్టుకోవటం పేరుతో ధర్మపురిలోని వచతి గ్రామంలోని గ్రామస్థులపై పోలీసులు, అటవీ అధికారులు దాడులు చేసి, మహిళలపై అత్యాచారాలు చేసిన సంఘటనపై ఆమె విడుదల చేసిన నిజనిర్ధారణ కమిటీ రిపోర్టు మద్రాస్ హైకోర్టు బాధితులను పట్టించుకునేలా చేసింది. ఎన్నో ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగడుతూ ఆమె ప్రజలను చైతన్యపరిచారు. ఆమె 'ఐద్వా' మహిళాసంఘానికి మొదటి ఉపాధ్యక్షురాలు కూడా.

ఆమె విస్తృతంగా రచనలు చేశారు. 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ', 'మెయిన్ స్ట్రీమ్', 'రాడికల్ రివ్యూ', పత్రికలలో క్రమం తప్పకుండా వ్యాసాలు రాశారు. 'కొన్ని పెంగళం మాధ సార్చిన్నైయం', 'పెన్నూరిమై', 'సిలా పర్వైగల్', 'ఓరుమారు పార్వై', 'ఆన్ కుజందైదాన్ వెండుమా', 'వెన్మణి', 'ఓరు కలాతిన్ పాతివు', 'ఫ్రాగ్మెంట్స్ ఆఫ్ ఎ లైఫ్', 'ఎ ఫ్యామిలీ ఆర్కైవ్' మొదలైన పుస్తకాలు రాశారు. దోపిడీ పీడనలకు గురౌతున్న ప్రజలపక్షాన నిలబడి ఆమె జీవితాంతం కృషిచేశారు. ఆమె రాసిన "మా అమ్మమ్మ సుబ్బలక్ష్మి" తెలుగులోకి అనువాదమయ్యింది.

# యలవర్తి రాజేంద్రప్రసాద్ (రాజా) మరణం

**తొలితరం** పి.డి.ఎస్.యు., అరుణోదయ సంస్థల నాయకుడు. అరుణోదయ వ్యవస్థాపకుడు అయిన యలవర్తి రాజేంద్రప్రసాద్ హైదరాబాదులో తన 66వ ఏట 13-5-2021న మరణించారు. ఆయన గుంటూరుజిల్లా అప్పికట్లలో జన్మించారు.

1973-75 సంవత్సరాలలో హైదరాబాదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిగా పి.డి.ఎస్.యు సంస్థలో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. సాంస్కృతిక సంస్థ అరుణోదయ వ్యవస్థాపకుల్లో ఒకరు. ఎమర్జన్సీ తర్వాత అరుణోదయ పునరుద్ధరణలో ఆసక్తి చూపారు. 15 ఏళ్ళక్రితం శంకరం వేదిక అనే సాహితీ, సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేసి వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు బాసటగా నిల్చారు. హైదరాబాదులో 'అమ్మ' నాటక ప్రదర్శన నిర్వహణకు సహకరించారు.

## ఎం. రాజేంద్ర మరణం

**'ఇండియా టుడే'** (తెలుగు) పత్రికకు తొలి సంపాదకునిగా పనిచేసిన ముత్తిరేవుల రాజేంద్ర తన 84వ ఏట హైదరాబాదులో మరణించారు. ఆయన చిత్తూరు జిల్లా అరగొండలో జన్మించారు.

'ఆంధ్రప్రభ' వారపత్రికలో పనిచేసి తానే సంపాదకునిగా కొంతకాలం 'పొలికేక' వారపత్రికను ప్రచురించారు. ఆయన కథారచయిత కూడా. ఆయన సంపాదకునిగా వెలువరించిన 'ఇండియా టుడే' వార్షిక సాహిత్య సంచికలు ఉత్తమ స్థాయిలో వుండి సాహితీవేత్తల ప్రశంసలందుకున్నాయి.

## నేతల ప్రతాప్‌కుమార్ మరణం



**అంబేద్కర్** బోధనలను, వాదాన్ని తన కవిత్వంలో ప్రతిభావంతంగా చిత్రించిన దళిత కవి, నేత ప్రతాప్‌కుమార్ తన 56వ ఏట తణుకులో 18-6-2021న మరణించారు. ఆయన 13-8-1965లో పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో జన్మించారు.

ఎం.ఏ. తెలుగు, న్యాయశాస్త్రం అభ్యసించిన నేతల వివిధ కళాశాలల్లో పనిచేసి ముక్కామల జిల్లా పరిషత్తు హైస్కూలులో ఉపాధ్యాయునిగా స్థిరపడ్డారు. విద్యార్థి దశలోనే దళిత మహాసభ, హేతువాద సంఘ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2001లో తణుకులో అంబేద్కర్ సాహిత్య అకాడమీ నెలకొల్పారు. అంబేద్కర్‌వాద రచయితల సంఘం స్థాపించారు. 'పాలకంకి', 'దళిత నానీలు', 'పిల్లల కోసం అంబేద్కర్' బౌద్ధ భాషితాలు ఈయన రచనలు. వీరి 'అన్నం గిన్నె' కవితాసంపుటి మూడు ముద్రణలు పొందింది.

## జనవాదీ సాంస్కృతిక మంచ్ స్థాపకుడు లాల్ బహదూర్ వర్మ మరణం



**గోరఖ్‌పూర్** కేంద్రంగా ప్రజాసాహిత్య, సాంస్కృతిక ఉద్యమ సంస్థ జనవాదీ సాంస్కృతిక మంచ్‌ను స్థాపించిన ప్రొఫెసర్ లాల్ బహదూర్ వర్మ తన 83వ ఏట 17-5-2021న మరణించారు. ఆయన బీహార్‌లోని చాప్రా జిల్లాలో 10-1-1938న జన్మించారు.

వర్మ గోరఖ్‌పూర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తిచేసి, లక్నో యూనివర్శిటీలో ఎం.ఏ. చదివి, డాక్టరేట్‌ను గోరఖ్‌పూర్ విశ్వవిద్యాలయం నుండి పొందారు. 1991 నుండి 1998 వరకు అలహాబాద్ విశ్వవిద్యాలయంలో చరిత్ర అధ్యాపకునిగా వున్నారు. 'ఇతిహాస్ బోధ్' పత్రిక సంపాదకునిగా పనిచేశారు. 1789-1945 కాలపు నాటి 'యూరప్ కా ఇతిహాస్' అనే ప్రామాణిక చరిత్ర గ్రంథం రాశారు. ఇది కాక 'ఆధునిక విశ్వకా ఇతిహాస్' కూడా రచించారు. జనవాదీ సాంస్కృతిక మంచ్ తరపున గోరఖ్‌పూర్‌లో 1984 మే 16 నుండి 20 వరకు ప్రజాసాహిత్య సాంస్కృతిక ఉద్యమంపై వారు నిర్వహించిన సెమినార్లో జనసాహితి తరపున నిర్మలానంద, రవిబాబు, దివికుమార్ పాల్గొన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యాన హిందీలో 'లోక్ చేతన' అనే సాహిత్య, సామాజిక పత్రికను కొద్దికాలం నడిపారు.

## అభ్యుదయవాది జక్కం రమణారెడ్డి మరణం

**ప్రగతిశీల** భావాలు గలిగిన విద్యావేత్త జక్కం రమణారెడ్డి 25-6-21న అనారోగ్యంతో తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన నెల్లూరు జిల్లా గూడూరు మండలంలోని వెడిచర్ల గ్రామంలో జన్మించారు.

రమణారెడ్డి విశ్రాంత ఐఎఎస్ ఆఫీసరు ఎస్.ఆర్. శంకరన్ శిష్యుడు. ఆయన ఎన్‌సిఇఆర్‌టి సహాయ సంచాలకుడిగా పనిచేశారు. ఆ సమయంలోనే ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలకపాత్ర వహించారు. ఆ సందర్భంలో ఎస్.ఆర్. శంకరన్‌తో ఏర్పడిన స్నేహ సంబంధాలు చివరవరకూ కొనసాగాయి. పేదల, దళితుల హక్కుల కోసం, వారిరువురూ కలసి కృషి చేశారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లు విద్య, వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించినపుడే అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మారు. శంకరన్ ఆశయ సాధనలో భాగంగా గూడూరు మండలం కొమ్మనేటూరులో 15 ఏళ్ళుగా 'ఎస్.ఆర్. శంకరన్ గ్రామ చైతన్య కేంద్రాన్ని' స్థాపించారు. దీని ద్వారా యువతీ యువకులకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చారు. వందల ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ గ్రామీణుల్లో విద్య వైద్యంపై చైతన్యాన్ని కల్పించారు. అనేక హేతువాద పుస్తకాలు రచించారు. 'ప్రజాసాహితి' మిత్రులైన జక్కం రమణారెడ్డి మృతికి సంతాపం తెలియచేస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాం.

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## సంపుటి 14, సంచిక 11, జూన్ 1991; 1/8 క్రౌన్, వెల : రూ. 4/-

**'బాల్యాన్ని** కోల్పోతున్న బాలలు' ఫోటోను 'ఆనందవికటన్' తమిళ పత్రిక సౌజన్యంతో ముఖచిత్రంగా ముద్రించారు. బాలల ప్రత్యేక సంచికగా వెలువడిన ఈ సంచికలో 1959 నవంబర్ 20న ఐక్యరాజ్యసమితి ఆమోదించిన బాలల హక్కుల ప్రకటనను, 'దగ్ధమవుతున్న బాల్యం' శీర్షికతో సంపాదకీయంను రాశారు. మూడు ఎన్‌కౌంటర్లూ, ఆరు చిత్రహింసలుగా పరిపాలన సాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని తక్షణమే భర్తరఫ్ చేయాలంటూ 'హింసా రాజకీయ సంస్కృతి' అనే రెండవ సంపాదకీయాన్ని ప్రచురించారు. '21వ శతాబ్దంలో కూడా బాల్య వివాహాలే!' అన్న సమాచారాన్నీ, ఆంక్షలు - నిషేధాలు శీర్షికలో 'అనధికార సెన్సార్ అధికార్లు - కస్టమ్స్ శాఖవారి "దేశభక్తి!" గురించీ, సూర్యసాగర్ రాసిన 'బాలల్ని నేరస్తులుగా మారుస్తున్న జైళ్ళు' వ్యాసాన్నీ, లేఖాసాహిత్యం శీర్షికలో 'ప్రముఖ విప్లవకారుడు చేగువేరా తన పిల్లలకు రాసిన ఉత్తరాన్ని', బి.ఎస్.ఆర్. రాసిన 'వేశ్యావాటికల నరక కూపాల్లో బాలవేశ్యలు' వ్యాసాన్నీ, శాంతికుమార్ రాసిన పిల్లల నాటిక 'గాలి కబుర్లు', వి.ఆర్. మాటూరి రాసిన "అంబేద్కర్ - బాల్యం - విద్యార్థి దశ", చలం ఆత్మకథ నుండి 'నా బాల్యం', గల్పిక శీర్షికలో దివికుమార్ రాసిన 'రాజస్వామ్యం', ప్రతీక రాసిన 'తెలుగు కలాలు చిత్రించిన బాల్యం' అనే వ్యాసం, ప్రభాత్‌కిరణ్ రాసిన "మినీ జపాన్‌కు చెందిన బాలకార్మికులపై చలన చిత్రం" సమీక్ష, ధారావాహికగా ఫిదాయి రాస్తున్న 'మరో జాతీయోద్యమం' వ్యాసం, భమిడిపాటి అనంత నారాయణను స్మరించుకుంటూ రామతీర్థ రాసిన 'అనంత స్మృతి', సమకాలీనం శీర్షికలో 'ఢిల్లీలోని పబ్లిక్ స్కూళ్ళలో మత ప్రచారం!' గురించీ, 'జనార్ధనరెడ్డి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి' అన్న జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య ప్రకటననూ, 'స్పందన' శీర్షికలో 'చట్టాలు మార్చుకోండి!' అని విజయవాడ నుండి రాజు రాసిన స్పందననూ, ఉదయ్ రాసిన 'ఒరిస్సా గడజాత (దేశీయ రాజ్యం) వ్యతిరేక పోరాట బాలయోధుడు బాజీరౌత్' గురించీ, డా॥ కిరణ్మయి రాసిన 'బాలలా? వీరు బాధల గాధలా?' వ్యాసాన్నీ, ధారావాహికగా ప్రచురిస్తున్న రాల్ఫ్ ఫాక్స్ 'నవల - ప్రజలు నాల్గవ అధ్యాయం నవల - వాస్తవికత'నూ, మిరియాల రామకృష్ణ రాసిన 'పాపాయిల రూపాయలు' కవితనూ, మిత్ర రాసిన 'ప్రజాస్వామ్య బురఖా' పాటతో పాటుగా నాల్గవ అట్టమీద జయ రాసిన 'బాలసంఘం చెట్టు' పాటను ప్రచురించారు. స్వీకారం శీర్షికలో అందుకున్న పుస్తకాల వివరాలు, చైతన్యవాహిని శీర్షికలో జనసాహితి సంస్థ కార్యక్రమాల వివరాలను ప్రచురించారు.

## సంపుటి 14, సంచిక 12, జూలై 1991; 1/8 క్రౌన్, వెల : రూ. 4/-

'అమ్మా, అయ్యా అంటూ అడుక్కుతింటున్న ఆర్థికవ్యవస్థ మనది' అనే సుబ్బో ముఖర్జీ వేసిన ముఖచిత్రంతో పెరుగుతున్న ధరలూ - నిరుద్యోగమూ, పన్నుల నేపథ్యంలో 'దివాళాకోరుతనం' అనే సంపాదకీయంతో ఈ సంచిక వెలువడింది. 'కరపత్రం - కదిలేచరిత్ర' శీర్షికలో 'తెలుగు రేడియోలో అవకతవకలు' అనే 1969లో కన్నెగంటి జగ్గయ్య, తెనాలి నుండి ప్రచురించిన కరపత్రాన్నీ, 'ఆంక్షలు-నిషేధాలు' శీర్షికలో 'హాస్యప్రియత్వం లోపించిన (వి)నాయకుల లీలలు'ను, డా॥ బి. సూర్యనారాయణరెడ్డి రాసిన 'ప్రభుత్వ నిరంకుశ కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి మాతృమూర్తులు బలికావలసిందేనా?' అనే వ్యాసాన్నీ, 'దేశ దేశాల్లో' శీర్షికలో ఉదయరేఖ అనువదించిన ఆంటోనీ చెహోవ్ రాసిన రష్యన్ కథ 'వాంకా రాసిన ఉత్తరం'ను, స్పందన శీర్షికలో విజయనగరం నుండి ఎ. లక్ష్మిరాజు రాసిన 'నినాదాల్లో పాలకుల వైఖరి'నీ, భూస అప్పలరెడ్డి రాసిన 'గోడ మీద రాతలు'నూ, జగం రాసిన 'నిర్ణయం' అనే కథనూ, 'ఆకాశంలో సగం' శీర్షికలో అల రాసిన 'తెలుగు పాఠ్యపుస్తకాల్లో స్త్రీల చిత్రణ' వ్యాసాన్ని, ప్రజామిత్ర రాసిన 'స్వతంత్ర భారతం : వ్యక్తివాద పూరితం' అనే స్పందననూ, సుమంతా బెనర్జీ రాసిన "హిందూత్వ" సిద్ధాంతం : సామాజిక మనః ప్రవృత్తి" అనే వ్యాసాన్ని, పి. చంద్రశేఖర్ ఆజాద్ రాసిన 'అతను' అనే స్కెచ్‌నూ, దివికుమార్ రాసిన 'మతతత్త్వ రాజకీయాలు' అనే వ్యాసాన్ని, ధారావాహిక శీర్షికలో కొత్తపల్లి రవిబాబు అనువదించిన రాల్ఫ్ ఫాక్స్ "నవల - ప్రజలు నాల్గవ అధ్యాయం 'నవల - వాస్తవికత"నూ రఘు రాసిన "కామ్రేడ్ అంటే" కవితను ఆర్. రామకృష్ణ రాసిన 'మతానికి కేంద్రం దోపిడియే' పాటను, రాజశేఖర్ రాసిన 'స్త్రీ విముక్తి మార్గం' పాటతోపాటుగా మూడవ అట్టమీద మునిపల్లె సుబ్బారావు రాసిన 'శ్రమ సౌందర్యం' పాటనూ, నాల్గవ అట్టమీద 'వెలుగు చుక్కలు' అనే నక్షత్రం రాసిన పాటను ముద్రించారు. వీటితోపాటుగా స్వీకారం శీర్షికలో అందుకున్న పుస్తకాలు, వివరాలు, చైతన్యవాహిని శీర్షికలో జనసాహితి సంస్థ కార్యక్రమాల వివరాలు వున్నాయి.

వ్యంగ్యం

# అమూల్ యం

– శంకరం

**ఆయన** కడు దయాళువు. అపార కరుణాంతరంగుడు. తన ఏలికలో ఆడ, మగ; తల్లీ, పిల్ల; బిక్కీ, బీదా; పశుపక్ష్యాదులూ అన్నీ ఎటువంటి సంకటమూ లేకుండా హాయిగా, నిశ్చింతగా జీవించాలని నిరంతరం తపిస్తూ వుంటాడు. ధర్మరాజు వంటి ఆయన తండ్రి హఠాన్మరణంతో తట్టుకోలేని ఎందరో సామాన్యులు వేదనతో అశువులు బాసారు. రాజ్యమంతా కకావికలమైపోయింది. తన తండ్రి పట్ల ప్రజలకు గల అపారమైన భక్తి ప్రపత్తులకు కరిగిపోయిన యువరాజు రాజ్యమంతా పర్యటించి, వివిధ వర్గాల ప్రజల ఇక్కట్లను తెలుసుకొని వారి దీనావస్థకు కరిగి నీరైపోయాడు. ఆ నీరు ప్రవాహంగా, వరదగా మారి ప్రజలకు అనేక వాగ్దానాల పరంపరను కురిపించింది. ఆ వాగ్దానాల జడివానలో ఆయనా, ప్రజలూ కూడా తడిసి ముద్దైపోయారు.

పట్టాభిషిక్తుడు కాగానే యువరాజావారు (యువకుడైన రాజావారు) శివాజీ ఆస్థానంలోని అష్ట ప్రధానుల వంటి వారిని నియమించుకున్నారు. అయితే వీరంతా పరమ ప్రభుభక్తి పరాయణులు. ఆయన చెప్పిందే వేదం వీరికి. సింహరాజు దగ్గర నక్కల మాదిరిగా మిగిలిందేదైనా వుంటే చీకుతుంటారు. అదే విధంగా చంద్రగుప్త విక్రమార్కుని ఆస్థానంలోని 'నవరత్నాలు' అనే గొప్ప పాండిత్యం కలిగిన కవులకు మాదిరిగా విలువైన రాళ్ళు : ముత్యాలు, కెంపులు, రత్నాలు, గోమేధికాలు, వజ్రాలు, పగడాలు, పుష్యరాగాలు, పచ్చలు, నీలం వంటి అమూల్యమైన కానుకలు తన ప్రజలకు కానుకలుగా, తన భావి జీవితానికి సోపానాలుగా గతంలో తను చేసిన వాగ్దానాల పరంపర వలె గుప్పించడం మొదలుపెట్టాడు.

రాజ్యంలోని రైతులందరికీ 'నేనున్నాను' అనే భరోసానిచ్చారు. ఆ పేరుతో ముత్యాలు పంపకం చేసారు. అయితే కౌలురైతులకు ఎంత దక్కిందో వారికే తెలియాలి. పండించిన పంటలకు గిట్టుబాటు మాత్రం లేదు. రైతుల వద్ద నుండి కొన్న ధాన్యానికి, చెరుకుకు చెల్లింపులు మాత్రం చేయలేదు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల ధరలు తగ్గించలేదు.

పేద ప్రజలందరికీ ఉచితంగా ఆరోగ్యాన్ని కల్పించడం తన తండ్రి ధర్మరాజు వలె తన భాధ్యత అనుకున్నాడు. ప్రభుత్వ వైద్యశాలలను అలా ఉత్సవ విగ్రహాలవలె నుంచి, బయటి వ్యక్తులు పెట్టుకున్న వైద్యశాలలకు రోగులందరినీ, వారితో పాటు ప్రభుత్వ.... అంటే ప్రజల ధనాన్ని (కెంపులను) తరలిస్తున్నాడు. అక్కడ వారికి నచ్చితే ఈ రోగులను చూస్తారు లేదా బయటికి పొమ్మంటారు. అయినా పరవాలేదు!

ఇక రాజ్యంలోని తల్లులందరూ ఆయన ఆడపడుచులు, వారి పిల్లలకు ఆయన మేనమామ. అప్పచెల్లెళ్లను, మేనమామగా వారి పిల్లలను ఆదుకోవడం తన ముఖ్య కర్తవ్యంగా భావించి, విద్యాభ్యాసానికి పంపిస్తున్న పిల్లలందరి తల్లుల పేరా 'రత్నాల'ను పంచసాగాడు. కాకపోతే ఈ రత్నాలను రాజ్యంలోని ప్రజలందరూ ఘనంగా జరుపుకునే 'పెద్ద పండగ' సమయంలోనే పంచడం వలన అవి వెంటనే వస్త్ర వ్యాపారులు మరియు గృహ సామాగ్రి దుకాణాలకు, అక్కడి నుండి పన్నుల రూపంలో తిరిగి రాజ్య ఖజానాకు చేరుతాయన్నమాట!

అపర భగీరదుని వలె రాజ్యంలోని భూములన్నిటినీ సస్యశ్యామలం చేసేందుకు జలయజ్ఞాన్ని ప్రారంభించాడు. కాకపోతే యాగం చేయడానికి కావలసిన సమిధలు దొరకక చక్రవర్తి వద్ద తన గోడు వెళ్ళబోసుకుంటున్నాడు.

రాజ్యంలోని ప్రజలలో అత్యధికులు మద్యపానానికి బానిసలై ఇళ్ళూ, ఒళ్ళూ గుల్ల చేసుకుంటున్నారనీ, తనకు అత్యంత ఇష్టులైన తన అక్కచెల్లెల్ల పుస్తెలు తెగిపోతున్నాయని భావించి చాలా క్రుంగిపోయారు. దాంతో ఎప్పటి వలె ఎవరినీ సంప్రదించకుండా తనకు తానే మద్యం ధరలను విపరీతంగా పెంచేసారు. గృహ హింస కూడా పెరిగింది.

అన్నిటికంటే గొప్పది వజ్రంతో సమానమైనది ఆయన వివిధ వర్గాల ఆడపడుచులకు ఇస్తున్న చేయూత. గొర్రెలు, బర్రెలు, కోళ్ళు, పందులు, గాడిదలు కొనుక్కునే విధంగా అన్ని వర్గాల మహిళలకు వజ్రాలను పంపిణీ చేస్తున్నారు. తన ఆడపడుచుల సాధికారతే ఆయన కంటున్న గొప్ప కల.

బర్రెలు, మేకలు అందజేసినంత మాత్రాన వారి ఇక్కట్లు తీరిపోవని భావించి, తన రాజ్యంలో పాల వెల్లువ సృష్టించి, తద్వారా తన ఆడపడుచుల కళ్ళలో వజ్రాలను చూడాలనుకున్నాడు. అందుకొరకై సౌరాష్ట్ర (గుజరాతు)కు చెందిన 'అమ్ములు' అనే బడా పాడి పరిశ్రమతో ఒప్పందం చేసుకున్నాడు. వారికి కావలసిన మౌలిక వసతులు కల్పించడానికి లక్షల గోమేధికాలు, పుష్యరాగాలను వెచ్చించడానికి సిద్ధపడినాడు. అప్పటికే తన రాజ్యములోనున్న ఇతర ప్రభుత్వ లేదా పెద్ద షావుకార్ల పాడి సంస్థలు చెల్లించే రుసుము కంటే లీటరుకు 5 నుండి 10 పచ్చలు అధికంగా ఇప్పించగలనని రంగులు చూపించాడు.

మొదటి విడతగా టంగుటూరి ప్రకాశం పంతులుగారనే గొప్ప దేశభక్తుడు నివసించినచోట ఈ పాల వెల్లువను అట్టహాసంగా ప్రారంభించాడు. మొదటి మూడు నెలలు చక్కగానే చెల్లింపులు చేసారట. దానితో ఇతర పాడి పరిశ్రమలకు పాలు పోసే అక్కచెల్లెమ్మలు అమ్ములు పాడికే పాలు వేయడం మొదలుపెట్టారు. మూడు నెలల తర్వాత ఒక్కసారిగా కథ అడ్డం తిరిగింది. వెయ్యి రూకలు ఈయాల్సినచోట మూడు వందల రూకలు తగ్గించి ఇవ్వసాగారట. ఏమిటిలా చేస్తున్నారు అని అడిగితే పాలలో వెన్న, కొవ్వు శాతాలను బట్టి తగ్గిస్తున్నాం అంటున్నారట. గట్టిగా అడిగితే బెదిరిస్తున్నారట. ప్రకాశంగారి ఊరిలోని రైతు అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు పాల వెల్లువకు బదులుగా రూకలు తగ్గించి విలవిల లాడిస్తున్నారట. దానితో తిరిగి వారు పాత పాడిపరిశ్రమలవైపే మొగ్గుతున్నారట.

ఇదిలా వుండగా రాజ్యంలోని మేధావి వర్గాలు, రాజావారి దాయాదులు ఈ విషయమై రకరకాలుగా వ్యాఖ్యానించడం మొదలు పెట్టారు. మన రాజ్యంలోనే జయ, రంగం, వైశాఖి వంటి లాభాలలో నడుస్తూ, రైతులకు ప్రతి సం॥ము ప్రోత్సాహకాలిస్తూ, ప్రతి పెద్ద గ్రామంలోనూ రైతులు రకరకాల కార్యక్రమాలు చేసుకోవడానికి సామాజిక భవనాలు నిర్మిస్తూ, రైతుల బిడ్డలకు విద్యకు ప్రోత్సాహకా లిస్తున్నటువంటి సహకార పాడి పరిశ్రమలున్నాయి కదా. ఆ అమ్ములు కు వెచ్చించాలనుకున్న గోమేధికాలు, పుష్యరాగాలను వీటి మౌలిక వసతులకు వెచ్చిస్తే పాల వెల్లువ ఇక్కడే జరిగి సంపద వెల్లువ కూడా సత్య ప్రమాణకంగా మన అక్క చెల్లెమ్మలకే ఉంటుంది కదా. ఎందుకు ఎక్కడో సౌరాష్ట్రలోనున్న అమ్ములు కంపెనీతో చేతులు కలిపినట్టు అని ఒకటే కలకలం.

కొంతమంది అంటారు కదా, మా యింటికొస్తే ఏమి తెస్తావు? మీ యింటికొస్తే ఏమిస్తావు? అన్న చందాన మన యువరాజుగారు ఏదో అలా.. మరికొందరంటారు : సౌరాష్ట్ర మన చక్రవర్తిగారి మాతృభూమి కదా. అక్కడి కంపెనీతో చేతులు కలిపి వారికి లబ్ధి చేకూరిస్తే సంతసించిన చక్రవర్తిగారు ఈయనపై దయతలచకపోతారా అంటున్నారు. ఇంకొందరేమో ఈయనకంటే ముందు పరిపాలించిన చంద్ర వంశపు రాజు తాను కూడా రాజ్యంచే ఏర్పాటు చేయబడ్డ పారి పరిశ్రమలను తొక్కిపెట్టి స్వంతంగా బ్రహ్మతేజ అనే పాడి పరిశ్రమను పెట్టారు కదా. దాయాదుల మధ్య సహజంగా వుండే ఈర్ష్య, అసూయల కొద్దీ దానిని మూతబెట్టేందుకే అమ్ములును తీసుకువచ్చి ఉంటాడు అంటున్నారు.

ఏదేమైనా మన సామ్రాజ్యంలో చక్రవర్తిగారిని ఆదర్శంగా తీసుకొని యువరాజాలందరూ రాజ్య భారాన్ని తగ్గించి, రాజోద్యోగులను కష్టపెట్టడం యిష్టంలేక రాజ్యాలలోని విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, వైద్యం వంటి ప్రజలకు అమూల్ యమైన వాటినన్నిటినీ అమ్ములు లాంటి బడాబాబులకు దారాదత్తం చేసేస్తున్నారు. లేదంటే విదేశాల నుండి మనకు అందవలసిన అమూల్ యమైన రుణాలు అందవు. ఏ రత్నాలూ మనకు మిగలవు పంచడానికి!! ఇది చేయూతా లేక చాపకింద నీరు వ్యవహారమా? ✸

# కాళీపట్నం రామారావు మాస్టారు మృతికి సంతాపం



**తెలుగు** కథకు గూడై నిలిచిన కాళీపట్నం రామారావు మాస్టారు కథల మాస్టారుగా ప్రసిద్ధిచెందారు. నిన్నటి మొన్నటి తరాలకూ, నేడూ రేపటి తరాలకూ వారధిగా నిల్చి కథాసాహిత్యానికి పెద్ద దిక్కుగా నిలిచిన ఆయన 97వ ఏట 04 మే 2021 తేదీన తన ఇంట్లో తుది శ్వాస విడిచారు. 1924 నవంబర్‌లో శ్రీకాకుళం జిల్లాలోని మురపాక గ్రామంలో ఆయన జన్మించారు. శ్రీకాకుళం పట్టణంలో ఎస్.ఎస్.ఎల్.సి వరకు చదివారు. భీమిలిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేశారు. 1948లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి బదిలీలే లేని ఎయిడెడ్ పాఠశాలలో ఒకే కేడర్లో 30 ఏళ్ల పాటు ఉద్యోగం చేశారు.

సంప్రదాయ పెత్తందారి (తండ్రి కరణం) కుటుంబంలో పుట్టిన కారా మాష్టారు ప్రజా ఉద్యమాల చైతన్యంతో ప్రగతిశీల రచయితగా తన ప్రస్థానాన్ని కొనసాగించారు.

సామాజిక జీవితంతో బలంగా పెనవేసుకున్న ప్రగతిశీల కథలు, కథానికలను ఆయన రచించారు. కారా మాస్టారు విరసం ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా కొంతకాలం ఉండి తర్వాత రాజీనామా చేశారు. 1964లో తను రాసిన "యజ్ఞం" కథ, నెహ్రూవియన్ తరహా పరిపాలన కష్టజీవులకు వ్యతిరేక ఫలితాలను ఇచ్చేదిగా ఎలా ఉంటుందో తెలుపుతూ పాఠకుడి పై బలమైన ముద్రవేసింది. ప్రజల జీవన సంఘర్షణలను పలు కోణాలలో కారా మాస్టారు తన రచనల్లో ప్రతిబింబించారు. అలాగే కారా మాస్టారు రాసిన "కుట్ర" కథ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ముసుగులో దళారీ పాలక వర్గాలు దేశీయ గుత్త పెట్టుబడిదారులకూ, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకూ, దేశ ప్రజల సర్వస్వాన్ని ఎలా ధారపోస్తున్నారో 50 ఏళ్ల క్రితమే స్పష్టంచేసింది.

రావిశాస్త్రిగారి స్నేహంతో తన గుంభనమైన వ్యక్తిత్వంతో, తన సాహిత్యంతో ప్రజాపక్షం వహించిన కారా మాస్టారు తరువాత తరాలకు కథా దీపధారిగా నిలిచారు. జనసాహితి తన సాంస్కృతిక బాధ్యతతో, కారా మాస్టారి 'యజ్ఞం' కథకు కొనసాగింపుగా అట్టాడ అప్పలనాయుడు రచించిన 'యజ్ఞం తర్వాత' కథను 2001లో 'ప్రజాసాహితి'లో ప్రచురించటమే కాక పై రెండు కథల ఆధారంగా 'మరో యజ్ఞం' కోసం అనే సాహితీ కళారూపకాన్ని రచించి పలుచోట్ల ప్రదర్శించి దాని వర్తమాన అన్వయాన్ని, కొనసాగింపుని చర్చకు పెట్టింది. సామాజికరంగంలో విచ్ఛిన్నమౌతున్న వ్యక్తిత్వాలు ఎలా హరాకిరీ చేసుకుంటున్నాయో కారా మాష్టారి సాహిత్యం స్పష్టం చేస్తుంది. 1972 తరువాత కథలను రాయటం ఆపేసినా కథాసాహిత్యం ఉనికినీ, ప్రస్థానాన్ని నిక్షిప్తం చేసే భాండాగారంగా శ్రీకాకుళంలో "కథా నిలయాన్ని" కారా మాస్టారు నిలిపారు.

"ఒక దేశంలో ప్రజ ఎంత పేద ప్రజైనా, ఆ దేశంలో కోటీశ్వరులు ఎంత గొప్ప కోటీశ్వరులైనా దేశపరపతి కాదకొచ్చేసరికి ప్రజల్దే పరపతి" (కుట్ర కథ) అనే ప్రజాదృక్పథాన్ని మరింత ముందుకు తీసుకుపోవడమే కథల మాస్టారు కాళీపట్నం రామారావుగారికి మనమిచ్చే నివాళి. కారా మాష్టారి మృతికి జనసాహితి సంతాపం తెలియజేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తోంది. ✸

## కె. సచ్చిదానందన్ ఫేస్‌బుక్‌లో పెట్టిన వీడియోను 24 గంటలపాటు తొలగించిన ఫేస్‌బుక్ యాజమాన్యం!

**కేంద్ర** సాహిత్య అకాడెమీ పూర్వ కార్యదర్శి, ప్రముఖ మలయాళీ సాహితీవేత్త, కవి, సచ్చిదానందన్ కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షాపై వ్యాఖ్యానించే ఒక హాస్యభరిత వీడియోను తన ఫేస్‌బుక్ పేజీలో పెట్టగా, దానిని తొలగించిన యాజమాన్యం 24 గంటల తరువాత మరల పునరుద్ధరించింది.

హిట్లర్ అంతిమదినాల్లో తన ఓటమికి అనుచరులను నిందించడాన్ని, అమిత్‌షా కేరళలో తమ పార్టీ ఓడిపోయినందుకు తమ అనుచరులను తప్పు పట్టడంతో పోల్చిన ఆ వీడియో నేటి పాలకులకు ఆగ్రహం కల్గిస్తుందేమోనన్న అనుమానంతో ఫేస్‌బుక్ దానిని తొలగించింది. అది విమర్శనాత్మకమైన వ్యంగ్య వీడియో. ఎవరినీ దూషించినది కాదు. ఈ సంఘటనపై సచ్చిదానందన్ వ్యాఖ్యానిస్తూ "గత 12 సంవత్సరాలుగా రాస్తున్న నిరసన కవిత్వం, ఫేస్‌బుక్‌లో 24 గంటలు తొలగిస్తే అదృశ్యమయ్యేది కాదు. ఫేస్‌బుక్‌లో వుండాలా లేక ప్రజాస్వామ్యవాదిగా మానవ హక్కుల పరిరక్షకునిగా వుండాలా అన్నప్పుడు నేను ఏది ఎన్నుకోవాలో నాకు తెలుసు." అన్నారు.

ఏప్రిల్ చివరి వారంలో సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్ కనీసం 100 పోస్టులు, యుఆర్ఎల్‌లు తొలగించాయి. వైద్యరంగంలో ఏర్పడిన సంక్షోభం సందర్భంగా అవి ప్రభుత్వాన్ని విమర్శించాయి.

అంతేకాదు 'మోడీ! రాజీనామా చేయ్!' అనే దానిని కూడా ఫేస్‌బుక్ అదృశ్యం చేసింది. అయితే అది సాంకేతిక పొరపాటు వల్ల జరిగిందని తర్వాత వివరణ ఇచ్చింది. ఈ విధంగా పాలకులు విమర్శల పట్ల తమ అసహనాన్నీ, ఆగ్రహాన్నీ ప్రదర్శించడం ఫాసిస్టు ధోరణే! ✸

---

## తులు భాషకు అధికార భాష స్థాయి కొరకు ప్రజాందోళన

**ప్రస్తుతం** భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూలు దేశంలోని 22 భాషలను అధికార భాషలుగా గుర్తించింది. మొదట్లో (1950)లో 14 భాషలే వుండగా, 1967లో సింధీ; 1992లో కొంకణి, మణిపురి, నేపాలీ; 2004లో బోడో, డోగ్రి, మైథిలి, సంతాలీ భాషలను రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. ఇంకా 38 భాషలవారు ఈ ఎనిమిదవ షెడ్యూలులో తమనూ చేర్చమంటూ కోరుతున్నారు.

మౌఖికభాష, లిఖితభాషగా అభివృద్ధి ఐన తర్వాత, ఆ భాషలో వచ్చిన సాహిత్యం దానిని సుసంపన్నం చేస్తుంది. అలా అభివృద్ధి చెందిన భాషలవారు తమ భాషను గుర్తించమని ఆందోళన చేస్తున్నారు.

తులు భాషను ప్రధానంగా దక్షిణ కన్నడ ప్రాంతంలోనూ, కర్నాటకలోని ఉడుపి తీర ప్రాంత జిల్లాలలోనూ, కేరళలోని కసరగోడ్ ప్రాంతంలోనూ మాట్లాడేవారు 18,46,427 మంది వున్నారు. కాని నిజానికి 20 లక్షల పైనే వుంటారు.

భాషాశాస్త్రవేత్త రాబర్ట్ కాల్డ్‌వెల్ (1814-1891) ఈ భాషను 2000 క్రితం నాటి తొట్టతొలి ద్రవిడ భాషగా నిర్ధారించారు. 'ద్రవిడ భాషా కుటుంబం బాగా అభివృద్ధి చెందిన భాషలలో ఒకటి' అన్నారు. ఈ భాష మాట్లాడే ప్రాంతాన్ని 'తులు నాడు' అని పిలుచుకుంటున్నారు.

కొన్నేళ్ళ క్రితం కర్నాటక ప్రభుత్వం స్కూలు స్థాయిలో తులు భాషను ప్రవేశబెట్టింది. ఈ భాషను నూతన విద్యావిధానంలో చేర్చమంటూ "జై! తులునాడు" అనే ఆన్‌లైన్ ప్రచారం జరుగుతోంది. ది 'తులునాడు'ను ఒక భాషాప్రయుక్త రాష్ట్రంగా ప్రకటించమని కోరుతూన్న 'తులువారె పక్ష' అనే పార్టీని 2021 ఫిబ్రవరిలో ఎన్నికల కమీషన్ గుర్తించింది.

ఈ భాషలో ఇప్పటికే ఏడాదికి 5 నుంచి 7 చలనచిత్రాలు వస్తున్నాయి. మంగుళూరు, ఉడుపి పట్టణాలలో ఏదో ఒక థియేటర్‌లో తులు చలనచిత్రాలు ప్రదర్శితమవుతున్నాయి. కర్నాటక ప్రభుత్వం - మంగుళూరు కేంద్రంగా 'తులు భవన్"లో 1994లో స్వయం ప్రతిపత్తి గల 'తులు సాహిత్య అకాడెమీని' ఏర్పాటు చేసింది. ఈ అకాడెమీ తరఫున ఇప్పటికే కార్యశాలలు, సెమినార్లు వార్షిక అవార్డులు, 'మదిపు' అనే మాసపత్రిక నిర్వహణ లాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి. ✸

---

## కేరళ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ గిల్బర్ట్ సెబాస్టియన్ తాత్కాలిక తొలగింపు

గిల్బర్ట్ సెబాస్టియన్ కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ సంబంధాల శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసరు. ఆయన ఏప్రిల్ 19న ఆన్‌లైన్‌లో 'ఫాసిజం-నాజీజం'పై పాఠం చెబుతూ, "మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయమనీ, ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. ఫాసిస్టు సంస్థలు" అని చెప్పాడని ఆర్.ఎస్.ఎస్. పత్రిక 'ఆర్గనైజర్' ఆరోపించింది. వెంటనే ఆర్.ఎస్.ఎస్. అనుబంధ విద్యార్థి సంస్థ సెబాస్టియన్‌పై కేసు పెట్టింది. విద్యా మంత్రిత్వశాఖకు చెందిన వినోద్ కరువారకుండ్ కూడా "విద్యార్థులలో ద్వేష భావాన్ని రెచ్చగొట్టి, మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విషాన్ని వెదజల్లుతున్నాడ"ని కేసు పెట్టాడు.

వైస్ ఛాన్సలర్ త్రిసభ్య కమిటీని వేసి సంజాయిషీ కోరింది. ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేదంటూ సెబాస్టియన్‌ను సస్పెండ్ చేశారు. ఒక పరిణితి చెందిన సమాజంలో తరగతి గది విభిన్న భావాల చర్చావేదికగా వుండాలి. విద్యార్థులు తన అభిప్రాయాలతో ఏకీభవించడం లేదని ఉపాధ్యాయుడు విద్యార్థులను శిక్షించకూడదు. చైనాలోనూ, సోవియట్ యూనియన్‌లోనూ అధికారిక దృక్పథాన్ని ప్రశ్నించకూడని నిరంకుశత్వం వుందని విమర్శిస్తుంటారు. మరి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకునే మన దేశంలో కొనసాగుతున్న ఆంక్షల మాటేమిటి?

ఆన్‌లైన్ క్లాసులో సెబాస్టియన్, 'సంఘ పరివార్‌ను ఒక ఫాసిస్టు సంస్థగా చెబుతూ, స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకోను, పోర్చుగల్‌లో సాలబార్‌ను, అర్జంటీనాలో పీరానును, చిలీలో పినో చెట్‌ను, దక్షిణాఫ్రికాలో జాతి వివక్షా పాలకులను, రువాండాలో హూతు ప్రభుత్వాన్నీ ఫాసిస్టులుగా పేర్కొన్నారు', అని ఆయన చెప్పిన పాఠం రికార్డును సాక్ష్యంగా చూపిస్తున్నారు.

మోదీ ప్రభుత్వంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయగూడదనడం ప్రజాస్వామ్యంలో అసమంజసం. కాని గత ఏడేళ్ళుగా పలువురు ఉపాధ్యాయుల మీద ఆర్.ఎస్.ఎస్. ఈ కారణంతోనే దాడులు చేసింది. కొన్ని పాఠ్యపుస్తకాలను ఉపసంహరించేట్లు ఆందోళన చేసింది. తాము తప్పు పడుతున్న పుస్తకాలలో వున్న విషయాలను పూర్వపక్షం చేస్తూ మరో పుస్తకం రాయవచ్చు. కాని అటువంటి మేధోపరమైన చర్చలకు బదులు ప్రొఫెసర్లపై భౌతికదాడులు చేయడం, పుస్తకాలను గ్రంథాలయాలను ధ్వంసం చేయడం, లేదా రాజ్యం సహకారంతో కేసులు పెట్టి శిక్షలకు గురిచేయడం - మొదలగు ఫాసిస్టు చర్యలనే ఆర్.ఎస్.ఎస్. చేబట్టింది.

కొసమెరుపు : ఏప్రిల్ 19న ఆన్‌లైన్ క్లాసు జరిగింది. మే 17న సస్పెండ్ చేశారు. జూన్ 10న "ఇక ముందు వైషమ్యాన్ని రెచ్చగొట్టకుండా జాగ్రత్తగా వుండమని హెచ్చరిస్తూ" విశ్వవిద్యాలయం సస్పెన్షన్‌ను రద్దు చేసింది.

**- 'ది వైర్' సౌజన్యంతో** ✸

## కారల్‌మార్క్స్ - కరోనా మాత

**ఉత్తరప్రదేశ్‌లో** ఇటీవల ఒక విచిత్ర సంఘటన జరిగింది. ప్రతాపగిరి జిల్లాలో జుహి షుకుల్పూర్ గ్రామంలో కరోనా మాతకు గ్రామస్థులు కట్టిన గుడిని పోలీసులు నేలమట్టం చేశారు. కోవిడ్-19 నుంచి రక్షణ కోరుతూ గ్రామస్థులు కరోనా మాత అనే దేవతకు ఈ ఆలయం కట్టి పూజలు చేస్తున్నారు. ఇక్కడే కాదు. అస్సాం, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలలో, దక్షిణాదిన తమిళనాడు, కర్నాటకలోనూ కరోనా దేవి ఆలయాలు మొదటివిడత కోవిడ్-19 కాలంలో వెలిసాయి. సాధారణంగా రోడ్ల విస్తరణ సమయంలో, అడ్డుగా వున్న మతపరమైన కట్టడాలను తొలగిస్తే అది హిందూమతంపై దాడిగా ఆందోళన చేసే మతవాదులను బలపరిచే బిజెపికి చెందిన యోగి ఆదిత్యనాథ్ (అజయ్‌సింగ్ భిస్ట్) హయాంలో ఈ సరికొత్త ఆలయాన్ని కూల్చివేయడం వెనుక వున్న ఆంతర్యమేమిటి? దేశంలో ఎన్నో వ్యాధులకు, వాటికి సంబంధించిన దేవతలకు గుడులు - బెంగాల్ నుండి రాజస్థాన్ వరకు వున్నాయి. మశూచికం, కలరా తగ్గించే శీతలమాతను ఉత్తర భారతమంతా పూజిస్తుంది. అసలు మశూచికాన్నే నిర్మూలించిన తర్వాత గూడా ఈ శీతల మాతను కొలిచే గుడులు ఉండగా, కొత్తగా కట్టిన కరోనా మాత ఆలయాన్ని కూల్చేయడమేమిటి? పాలకులు మూఢనమ్మకాల వ్యతిరేకులుగా మారిపోయారా?

19వ శతాబ్దంలోనే కారల్‌మార్క్స్ 'అణచబడ్డవాడి నిట్టూర్పు మతం. అది హృదయరహిత ప్రపంచపు హృదయం.... అది ప్రజల పాలిట మత్తుమందు' అన్నాడు. అణచివేతను భరిస్తున్న ప్రజల బాధలకు కొంత తాత్కాలిక ఉపశమనం కలిగించేది మతం అని మార్క్స్ భావం. కనుకనే ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా అకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించిన కాలంలో, ప్రజలకు ఏ మార్గమూ తోచక కరోనా మాతను సృష్టించుకున్నారు. ఇలా కరోనా మాతను పూజించడం మే 2020లో వలసకూలీల సంక్షోభంతో మొదలైంది. ప్రాణాలను, ఆరోగ్యాలను రక్షించుకోవడానికి అవసరమైన జీవన భృతి శూన్యమైన నిస్సహాయ పరిస్థితిలో ఈ 'అనాగరిక, తెలివితక్కువ' ప్రజలు ఈ మూఢనమ్మకం వైపు ప్రయాణించారు. ప్రభుత్వం సరైన, ఉచిత వైద్యం అందించడంలో విఫలమైంది. జీవనభృతిని కల్పించలేకపోయింది. అవసరమైన ప్రాణవాయువు సరఫరా చేయలేకపోయింది. జీవితం అల్లకల్లోలమైన పరిస్థితిలో అసమర్ధ ప్రభుత్వంపై ఆధారపడలేక దేవుడిని ఆశ్రయించారు. అంటే కరోనా మాత గుడి - అశేష ప్రజానీకపు నిస్సహాయత, తెగింపులకు, ప్రభుత్వ అలసత్వానికి, వైఫల్యానికి ప్రతీక అన్నమాట. తమ మరణాలకు బాధ్యురాలైన ప్రభుత్వం పట్ల చూపే నిరసనే ఈ ఆలయ నిర్మాణం! కనుకనే ప్రభుత్వం దానిని పడగొట్టింది!

**- 'మద్రాస్ కొరియర్' జూన్ 23, 2021 సౌజన్యంతో** ✸

## మయన్మార్ నిరసన కవుల ఊచకోత

"**తలని** తుపాకీ గుండ్లతో పేల్చేయవచ్చు
అలా పేల్చినవారికి తెలియదు
నిరసన హృదయానికి చెందినదని
హృదయాన్ని పేల్చితే ఏమౌతుంది
భావాలు టపటపలాడుతూ ప్రజలకు చేరుతాయి -
ఈ విషయం వారికి తెలియదు"

అని జుంటాను వ్యతిరేకిస్తూ కవితలు రాస్తూ, ప్రజల నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న 45 ఏళ్ళ ఖెట్ థి అనే కవిని, జుంటా ఇంటరాగేషన్ పేరుతో చిత్రహింసలు పెట్టి హత్య చేసింది.

ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికైన ఆంగ్ సాన్‌సూకీని నిర్బంధించి, ఫిబ్రవరి 1న ఆ దేశ సైన్యాధికారులు సాగిస్తున్న నియంతృత్వ పాలన 781 మంది ప్రజాతంత్రవాదులను పొట్టన బెట్టుకుంది. 154 మందికి అరెస్టు వారంటులను జారీచేసింది. 3,843 మందిపై ఆరోపణలు చేసి శిక్షించింది.

ఖెట్ థీని, అతని భార్య చాసును మే 8వ తేదీన ఇంటరాగేషన్ పేరుతో తీసుకొని వెళ్ళి, భార్యను వెనక్కి పంపేశారు. ఆ తర్వాత కొన్ని రోజులకు పోలీసులు ఆమెను ఫోను చేసి, ఎక్కడో దూరంగా వున్న ఆసుపత్రిలో ఖెట్ థీ ఉన్నాడు తీసుకెళ్ళమని చెప్పారు. అక్కడకు వెళ్ళిన ఆమెను శవాల గదిలోకి తీసికెళ్ళి శవాన్ని చూపిస్తూ గుండెపోటుతో మరణించాడని రిపోర్టు ఇచ్చారు. శవాన్ని ఇవ్వడానికి నిరాకరించగా ఆమె ఆందోళన చేసి శవాన్ని తెచ్చుకుంటే, అతని శరీర అవయవాలన్నీ తొలగించబడి వున్నాయి. అంటే చిత్రహింసల వల్ల చనిపోయినట్లు ఆమె ప్రకటించారు.

ఖెట్ థీ ఒక ఇంజనీరుగా 2004-2012 వరకు పనిచేశాడు. అయితే స్వతంత్రంగా జీవించాలని తన ఉద్యోగం వదిలేసి, కేకులు, ఐస్‌క్రీంలు అమ్ముతూ గిటారు వాయించుకుంటూ కవిత్వం రాసుకుంటూ జీవితం కొనసాగిస్తున్నాడు. మయన్మార్‌లో ఆకస్మిక సైనిక తిరుగుబాటు జరిగిన రెండు వారాల తర్వాత,

నేనొక హీరోను కావాలనుకోవడంలేదు
నేనొక అమరవీరుడినవుదామనుకోవడం లేదు
నేనొక బలహీనుడిగా మిగలదల్చుకోలేదు
నేనొక బుద్ధిహీనుడిగా బతకాలనుకోవడం లేదు
అన్యాయాలను బలపరచాలనుకోవడం లేదు
నా జీవితం ఇక ఒక్క నిమిషమే వుందనుకున్నా
ఆ నిమిషం కూడా నా అంతరాత్మ స్వచ్ఛంగా వుండాలనుకుంటున్నా

అనీ,

'నా ప్రజలను కాల్చి చంపేవారిపై
నా కవితలను విసరగలను' అనీ నినదించాడు.

సైనిక నియంతృత్వ వ్యతిరేక నిరసన ప్రదర్శనతో ముందు వరుసలో నించున్న క్రియాశీల ఆందోళనకారుడు ఖెట్ థీ.

సైనిక పాలన ప్రారంభమైన తరువాత పాలకుల చేతిలో మరణానికి గురైన కవులలో ఈయన మూడోవాడు. అంతకుముందే మార్చి 3న క జా విన్ (Ka Za Win) అనే 39 ఏళ్ళ కవిని కాల్చి రోడ్డుపై పడేసి లాక్కెళ్ళారు. ఈయనతోపాటు మరో కవయిత్రి మింట్ మింట్ జిన్‌ను కూడా కాల్చి చంపారు. వీరిద్దరూ ఉపాధ్యాయులు. వీరిని కాల్చి చంపిన వీధిని 'అమరవీరుల వీధి' అని ప్రజలు పిలుస్తున్నారు. మింట్ మింట్ జిన్ సామాజిక మాధ్యమాల్లో తన రక్తం ఏ గ్రూపుకు చెందినదో చెప్పి, రక్తం కావాలంటే తనను సంప్రదించమని కోరింది.

"మమ్మల్ని భూమిలో పాతిపెట్టాలని చాల కష్టపడుతున్నారు
మీకు తెలియదు మేము విత్తనాలుగా మారి మొలకెత్తుతామని"

అనీ,

"మా చేతుల్లో ఆయుధాలేమీ లేవు
మాకు వున్నవల్లా కుండలూ, చట్లూ మాత్రమే
మా చేతుల్లో అధికారం లేదు
మాకున్నది కుండలూ, చట్లూ మాత్రమే
అయితేనేం? ఆ కుండల్నే మోగిస్తాం
ఆ చట్లనే తట్టుతాం
ఇది మా విప్లవం" అని వై యాన్ ఆంగ్‌థాన్ అనే కవీ నిరసన తెలియచేశాడు. ష్వా పో ఇయాన్ (Shwe Poe Eain) అనే కవి –
'శీతాకాలపు పూలు మీపై దండెత్తుతాయి
వర్షాకాలపు వానలు మిమ్ములను ముంచెత్తుతాయి
ఒక న్యాయమైన కోర్కె కోసం
మా రక్తమొడ్డుతామని ప్రతిన బూనుతాం
మా వసంతాన్ని నాశనం చేసే వారినెవరినైనా ఎదుర్కొంటాం' అని ప్రకటించాడు.

2015 ఎన్నికల్లో 28 మంది కవులు ఎన్నిక కావడం, వారిలో 11 మంది మంత్రులుగా పనిచేయడం గమనిస్తే, కవులు, రచయితలు ప్రజలకెంత దగ్గరవుతున్నారో అర్థమవుతుంది.

# చైతన్యవాహిని

**07-05-2021** విరసం మరో 15 ప్రజాసంస్థలపై తెలంగాణ ప్రభుత్వం విధించిన నిషేధానికి నిరసన తెల్పుతూ – అధ్యక్షునిగా అరసవిల్లి కృష్ణ, యాకూబ్, ఖాదర్, సంగిశెట్టి శ్రీనివాస్, పెనుగొండ, రవిబాబు, కాత్యాయిని విద్మహే, సి.ఎస్.ఆర్. ప్రసాద్, సాహితీస్రవంతి పాల్గొన్నారు.

**29-5-2021** అదృష్టదీపక్ సంతాపసభను జూమ్ ద్వారా రాఘవాచారి ట్రస్టు, అభ్యుదయ రచయితల సంఘం కలసి నిర్వహించారు. మొదట విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి. రామారావు మాట్లాడుతూ అదృష్టదీపక్ సాహిత్య కృషిని వివరించారు. దీపక్ జీవిత విశేషాలు, ఆయన సినీగేయాలు, కవితలు, సాహిత్య విమర్శలు మొదలైనవన్నీ పరామర్శించారు. కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ 'ప్రజాసాహితి'కి, దీపక్‌కు వున్న అనుబంధాన్ని చెప్పారు. ఆయన నిర్మొహమాట విమర్శకునిగా పేరు తెచ్చుకున్నారన్నారు. నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ధవళ సత్యం మాట్లాడుతూ దీపక్ రాసిన సినీగేయాల విశిష్టత వివరించారు. ఇంకా కొప్పర్తి, జ్యోత్స్న, పెనుగొండ, దీపక్‌కు నివాళులు అర్పించారు.

**15-6-2021** శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాత్రి 7 గంటలకు "కరోనా సంక్షోభ కాలంలో శ్రీశ్రీ సాహిత్యం" అనే అంశంపై ఉత్తరాంధ్ర జనసాహితి శాఖ గూగుల్ మీట్‌ను నిర్వహించారు. జనసాహితి విశాఖజిల్లా కార్యదర్శి నూకాచారి ప్రజలను తీవ్రంగా కృంగదీస్తున్న ఈ కరోనా వాతావరణంలో శ్రీశ్రీ సాహిత్యం ధైర్యాన్నీ, ఉత్తేజాన్నీ ఇస్తుందన్నారు. 'ప్రజాసాహితి' సంపాదకులు పి.ఎస్. నాగరాజు మొదట మాట్లాడుతూ సమష్టి నుండి వ్యక్తిని విడదీసి తీవ్ర భయాందోళనలకు గురిచేసే అభద్రతాపూరిత వాతావరణాన్ని సామ్రాజ్యవాద శక్తులు మన చుట్టూ వ్యాపింపజేస్తున్నాయని, దీనిని ఎదుర్కొనే సమష్టి చైతన్యాన్ని పెంపొందించుకునేందుకు శ్రీశ్రీ సాహిత్యం మనకెంతగానో ఉపయోగ పడుతుందన్నారు. తెలుగు అధ్యాపకులు, కవి, టి.ఎన్.రసూల్‌గారు మాట్లాడుతూ జాతీయ దురహంకారం స్వేచ్ఛాజీవనాన్ని హరించివేస్తున్న ప్రస్తుత తరుణంలో శ్రీశ్రీ కవిత్వం సమాజానికి ఎంతో అవసరమన్నారు. జనసాహితి విశాఖజిల్లా అధ్యక్షులు ఐటిఆర్‌వి శివాజీ మాట్లాడుతూ శ్రీశ్రీ ప్రజాకవిగా, పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తగా గొప్ప పాత్ర పోషించాడన్నారు. శ్రీకాకుళం జనసాహితి కార్యదర్శి మోహనరావుగారు తూర్పుగోదావరిజిల్లా జనసాహితి సభ్యులు సిరాజ్ తదితరులు ప్రసంగించారు. జనసాహితి ప్రధాన సంపాదకులు రవిబాబుగారు మాట్లాడుతూ ప్రజాతంత్ర సాహిత్యోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన కర్తవ్యాన్ని, యువకులు అందుకోవాలన్నారు. జనసాహితి అధ్యక్షులు దివికుమార్ శ్రీశ్రీ కవిత్వాన్ని ఉదహరిస్తూ శ్రీశ్రీలోని పెట్టుబడిదారీ విధానాల వ్యతిరేకతను బొల్షివిక్కు స్ఫూర్తిపట్ల ఆకాంక్షను వివరించారు. జనసాహితి రాష్ట్ర సహాయకార్యదర్శి ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ వందన సమర్పణ చేశారు.

**గిజుభాయి బదేకా వర్ధంతి** (జూన్ 23) సందర్భంగా జనసాహితి విశాఖ జిల్లా శాఖ గూగుల్ మీట్ నిర్వహించింది. ఉపాధ్యాయులు బలిరెడ్డి శ్రీనివాస్‌గారు గిజుభాయి విద్యారంగంలో చేసిన కృషిని గురించి మాట్లాడారు. మాంటిసోరీ విద్యాపద్ధతులను కథలు, ఆటపాటలతో మేళవించి, మన దేశీయ పరిస్థితులకు అన్వయిస్తూ ఆయన చేసిన కృషి నేటికీ అనుసర ణీయమన్నారు. తదుపరి మరో ఉపాధ్యాయుడు పినిశెట్టి జగదీష్ జాతీయ విద్యావిధానం 2020 – ఒక పరిశీలన అనే అంశంపై మాట్లాడారు. ఒకవైపు స్థానిక వృత్తి విద్యలు పేరిట కులవృత్తులను ప్రోత్సహిస్తూ, మరోవైపు కోడింగ్ తదితర డిజిటల్ అభ్యసనాలను చేర్చి గ్రామీణ పేద విద్యార్థులను న్యూనతలోనికి నెట్టేసే అన్యాయమైన విధానాలు ఇందులో ఉన్నాయన్నారు. 34 వేల పాఠశాలలను మూసివేసేందుకు, 15 వేల పోస్టులు రద్దు చేసేందుకు ఈ జాతీయ విద్యావిధానం 2020 వీలు కల్పిస్తుందన్నారు. ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి కె. గౌరీశంకర్ మాట్లాడుతూ అభ్యుదయకరమైనదిగా భ్రమింపచేస్తూ, మధ్య యుగాలలోకి తీసుకు వెళ్ళేందుకు సహాయపడేదిగా ఈ విద్యావిధానం ఉందని అన్నారు. జనసాహితి సభ్యులు రవిశంకర్ మాట్లాడుతూ ప్రజాస్వామిక భావనలకు పునాదులు వేసే కామన్‌స్కూలు విధానాలను గురించిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసి, బానిస భావజాలాన్ని విద్యార్థులపై రుద్దుతున్నారని అన్నారు. శ్రీకాకుళం ఏపిటిఎఫ్ నాయకులు చావలి శ్రీనివాస్ మాట్లాడుతూ బడి ఆవరణలోకి అడుగుపెడితే యాప్‌లే ఉపాధ్యాయుడి జీవితంగా అయ్యి విద్యార్థి ఉపాధ్యాయ అనుబంధాలను సర్వనాశనం చేస్తున్నాయన్నారు. జనసాహితి సభ్యులు సిరాజ్ మాట్లాడుతూ అప్రజాస్వామిక, అహేతుక విధానాలు నిండి ఉన్న జాతీయ విద్యావిధానం 2020 అమలుకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. భీమారంగ ఉద్యోగి కన్నయశాస్త్రిగారు మాట్లాడుతూ ఒక్కొక్కటిగా అమ్ముతూ పోతున్న ప్రభుత్వాలు చివరకు పేదలకోసం ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యను సైతం అమ్మివేయ పూనుకున్నాయని అన్నారు. జనసాహితి కార్యదర్శి ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ వందన సమర్పణలో గూగుల్ మీట్ ముగిసినది. ✸

# ఈ పుస్తకాలు అందాయి

**నువ్వే నేను, నేనే నువ్వు : కథల సంపుటి**

రచయిత : పులిగడ్డ విశ్వనాథరావు

1/8 డెమ్మీలో 132 పుటలు, వెల : రూ. 80/- మొదటిముద్రణ : ఆగస్టు 2015. ప్రచురణ : కోకిలమ్ గ్రంథమాల. ప్రతులకు : కోకిలమ్ గ్రంథమాల, 404, అంబర్, మైహోమ్ జూవెల్, మదీనాగూడ, హైదరాబాద్ - 500049. మొబైల్ : 70139 65745.

**భిన్న సందర్భాలు : వ్యాస సంకలనం**

రచయిత : పి. పాండురంగవరప్రసాదరావు

1/8 డెమ్మీలో 173 పుటలు. వెల : రూ. 60/- ప్రథమముద్రణ : ఫిబ్రవరి 2021, ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కృష్ణా, గుంటూరు జిల్లా శాఖలు. ప్రతులకు : ఎ.పి.టి.ఎఫ్. రాష్ట్ర కార్యాలయం, చెన్నుపాటి - సింగరాజు భవన్, 29-7-22, విష్ణువర్ధనరావు వీధి, సూర్యారావుపేట, విజయవాడ-520002. ఫోన్ : 0866-2433505 మరియు ఎ.పి.టి.ఎఫ్. కార్యాలయం చెన్నుపాటి లక్ష్మయ్య భవన్, 27-2-43, జిల్లా కోర్టుల ఎదురుగా కన్నావారితోట, గుంటూరు.

**పెన్ కౌంటర్ : వ్యాస సంపుటి**

రచయిత : బంగారు వి.బి. ఆచార్యులు.

1/8 డెమ్మీలో 74+4 పుటలు. వెల : రూ.120/- మొదటిముద్రణ : జనవరి 2021. ప్రచురణ : శివశక్తి పబ్లికేషన్స్, హైదరాబాద్-83. ప్రతులకు : బంగారు వి.బి. ఆచార్యులు, డోర్ నెం. 1-113/17, అరవిందనగర్ నగరం, హైదరాబాద్ - 500083. మరియు విశాలాంధ్ర, ప్రజాశక్తి పుస్తకాలషాపులన్నింటిలో.

**కోయిల చెట్టు : కథల సంపుటి**

రచయిత : డా॥ ఎం. ప్రగతి

1/8 డెమ్మీలో 135 పుటలు. వెల : రూ. 100/-. ప్రచురణ : సాహితీ స్రవంతి, అనంతపురం జిల్లాశాఖ. ప్రతులకు : డా॥ ఎం. ప్రగతి, ఇంటి నెం. 1-4-193, జానకీరామనగర్, హెచ్.ఎల్.సి. కాలనీ, అనంతపురం - 515004. మొబైల్ : 94407 98008.

**హైకూ భావనలు :**

రచయిత : శంకర వెంకట నారాయణరావు

1/8 క్రౌన్‌లో పుటలు : 27. వెల : రూ. 20/- మొదటిముద్రణ : ఫిబ్రవరి 2005. ప్రతులకు : శంకర ధనలక్ష్మి, బ్రాహ్మిన్ స్ట్రీట్, ఆచంట (పోస్టు), పశ్చిమగోదావరి జిల్లా - 534123.

**దక్షిణాంధ్ర దారిదీపాలు : (తెలుగు మహనీయుల వెలుగుజాడలు)**

సంపాదకుడు : డా॥ నాగసూరి వేణుగోపాలరావు

1/8 డెమ్మీలో 166 పుటలు. వెల : రూ. 200/- మొదటిముద్రణ : మార్చి 2018. ప్రచురణ : శ్రీ చాముండేశ్వరి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, పాదిరివేడు. ప్రతులకు : డా॥ రాయదుర్గం విజయలక్ష్మి, చెన్నపురి రచయితల సంఘం. నెం : 62బి, 2వ క్రాస్ వీధి, నాగప్పనగర్, క్రోంపేట్, చెన్నై - 600044. సంచారవాణి : 9840331820. మరియు తెలుగునాట అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలలలో.

**బందగి : కథల సంపుటి**

రచయిత : విడదల సాంబశివరావు.

1/8 డెమ్మీలో 166 పుటలు. వెల : రూ. 150/- మొదటిముద్రణ : జూన్ 2017. ప్రచురణ : విడదల నీహారిక ఫౌండేషన్, ప్రచురణలు, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

ప్రతులకు : విడదల సాంబశివరావు, ఇంటి నెం. 3-173/1, 7వ లైన్, పండరీపురం, చిలకలూరిపేట - 522616. గుంటూరు జిల్లా. మొబైల్ : 98664 00059. మరియు అన్ని ప్రముఖ పుస్తకాల విక్రయశాలలలో.

**దృశ్యం నుండి దృశ్యానికి : కవిత్వం**

రచన : వి.ఆర్. విద్యార్థి.

1/8 డెమ్మీలో 84 పుటలు. వెల : రూ. 60/- మొదటిముద్రణ : అక్టోబర్ 2020. ప్రచురణ : ప్రత్యూష ప్రచురణలు, వరంగల్. ప్రతులకు : శ్రీమతి వేలూరి రత్నమాల, ఇంటి.నెం. 2-7-1083, కనకదుర్గ కాలనీ, వడ్డేపల్లి, వరంగల్ - 506370. మొబైల్ : 90002 83672. నవచేతన, విశాలాంధ్ర, ప్రజాశక్తి అన్ని పుస్తకాల షాపులలోనూ మరియు నవోదయ, హైదరాబాద్‌లోనూ.

**స్వాతంత్ర్యమే మా జన్మహక్కని.... : గుంటూరు జిల్లా పోరాట యోధుల శంఖారావం**

రచయిత : తోటకూర వేంకట నారాయణ.

1/8 డెమ్మీలో 224 పుటలు. వెల : రూ. 180/- మొదటిముద్రణ : 26 జనవరి 2021. ప్రచురణ : రఘురామ్, చిలకలూరిపేట. ప్రతులకు : తోటకూర రామసీత, 2-సి, గీతా రెసిడెన్సీ, ఎన్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట - 522616. గుంటూరుజిల్లా.

**సభల్లో సరదాలు :**

సేకరణ, అక్షరీకరణ : చలపాక ప్రకాశ్

1/8 డెమ్మీలో 40 పుటలు. వెల : రూ.20/- మొదటిముద్రణ : 2020. ప్రచురణ : రమ్యభారతి, విజయవాడ.

ప్రతులకు : చలపాక ప్రకాశ్, 1-4/3-36, సంజయ్‌గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ-520012. మొబైల్ : 92474 75975. మరియు విశాలాంధ్ర పుస్తకాల షాపులన్నింటిలో.

**ఆశాదీపాలు : కథల సంపుటి**

రచయిత : షేక్ బషీరున్నీసాబేగం.

1/8 డెమ్మీలో 164 పుటలు. వెల : రూ. 150/- మొదటిముద్రణ : ఏప్రిల్ 2018. ప్రచురణ : యాస్మిన్ ముద్రణలు, గుంటూరు. ప్రతులకు : షేక్ బషీరున్నీసా బేగం, ఇంటి నెం. 5-66-81, మొదటి లైన్, కోబాల్ట్‌పేట, గుంటూరు - 522002. మొబైల్ 99851 93970.

(ఇంకా వున్నాయి)

కవిత

# శవవాహిని గంగ

గుజరాతీ మూలం : **పరుల్ ఖక్కర్**

ఆంగ్లం : **సలిల్ త్రిపాఠి మరియు రీటా & అభిజిత్ కొఠారి**

తెలుగులో అనుసృజన : **కొత్తపల్లి రవిబాబు**

ముక్తకంఠంతో అరిచాయి మృతదేహాలన్నీ
'ఆందోళన చెందకండి, ఆనందంగా ఉండండి'
ఓ! రాజా! నీ 'రామరాజ్యం'లో 'పవిత్ర' గంగ శవవాహినిగా మారింది.
అడవులన్నీ దోచుకుపోయారు, శవాలను కాల్చడానికి కట్టెలు లేవు,
ఇక కాటిలో చోటే లేకుండా పోయింది - శవ దహనానికి,
బంధుమిత్రులు లేరు, శవవాహకులు అసలే లేరు,
శోకించేవారు శూన్యం, అందరూ వదిలేశారు మమ్మల్ని
మృత్యుభయంతో మాటలు రాని శోకగీతాలు మావి,
అందరి ఇళ్లల్లో మృత్యువు భీకర నృత్యం చేస్తోంది
ఓ! ప్రభువా! నీ 'రామరాజ్యం'లో శవవాహినిగా మారింది గంగ.
దహనయంత్రాల పొగగొట్టాలు విశ్రాంతి కోరుతున్నాయి - వైరస్ మమ్మల్ని వణికించేస్తోంది
మా గాజులూ, నిట్టూర్చే గుండెలు ప్రక్కలవుతున్నాయి
ఫిడేలు మ్రోగుతోంది - నగరం తగలబడుతుంటే!
బిల్లా - రంగా*లు తమ బరిసెలు విసురుతున్నారు
ఓ! పాలకా! నీ రామరాజ్యంలోగంగ శవవాహినై పోయింది.
ఓ! మహారాజా! కాంతులీనుతున్న నీ లాగే నీ దుస్తులూ తళతళ లాడుతున్నాయి
ఎట్టకేలకు నగరమంతా నీ నిజ స్వరూపం చూసింది.
అయితే, గియితేలు వద్దు, ధైర్యం వుంటే
నీ రాజు గురించి వీధిలోకి వచ్చి అరచి చెప్పు గట్టిగా
'రాజు వంటిమీద దేవతా వస్త్రాలు లేవు, దిసమొలతో వున్నాడు
అతడు కుంటివాడు, బక్క పీనుగు కూడా'.
మరి నీవు బక్కపీనుగువి కాదని నిరూపించు!
జ్వాలలు పైకెగసి అంతరిక్షాన్ని తాకుతున్నాయి
నగరం కోపోద్రిక్తంగ వుంది.
ఓ! రాజా! నీ 'రామరాజ్యం'లో గంగా నదిలో ప్రవహిస్తున్న శవాలను చూశావా?

★ **బిల్లా-రంగా:** ప్రముఖ నేరస్తులు, హంతకులు గీత, సంజయ్ చోప్రా అనే పిల్లలను కిడ్నాప్ చేసి చంపేశారు. వీరికి ఉరిశిక్ష పడింది. 1982 జనవరి 31న వీరిని ఉరి తీశారు.

ఈ కవిత రాసిన రచయిత్రి పరుల్ ఖక్కర్ గుజరాతీ సంప్రదాయ కవితారంగంలో ప్రసిద్ధులు. గతంలో ఆమెను గుజరాతీ కవిత్వరంగంలో ఆణిముత్యం అని పొగిడిన సంప్రదాయవాదులు ఈ కవిత రాసినందుకు సామాజిక మాధ్యమాలలో అశ్లీలకరమైన బెదిరింపులు చేసారు. ఇక గుజరాత్ సాహిత్య అకాడెమీ ఛైర్మన్ విష్ణు పాండ్యే, అకాడెమీ వారి పత్రిక 'శబ్దసృష్టి'లో సంపాదకీయం రాస్తూ ఈ కవిత పేరు ఉదహరించకుండా, ఈ కవితపై దాడి చేశారు. ఇది అరాచకత్వాన్ని ప్రేరేపిస్తుంది అన్నారు. దీనిని సమర్థించే 'ఉదారవాదులైన వామపక్షవాదులను' 'సాహిత్య నక్సలైట్లు' అన్నారు. గతంలో ఆర్.ఎస్.ఎస్. వారి గుజరాతీ పత్రిక 'సాధన'తో సంబంధమున్న ఈ అకాడెమీ ఛైర్మన్ స్పందన ఇలా వుండటం సహజమే. మోదీ విధానాలను, వైఫల్యాలను విమర్శిస్తూ ఈ కవిత సామాజిక మాధ్యమంలో రాగానే అతి తక్కువ కాలంలో దీనిని ప్రశంసించిన వేల మంది పాండ్యేగారి దృష్టిలో 'సాహిత్య నక్సలైట్లే'.

PRAJAA SAAHITHI June & July, 2021 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/0571 Postal Regd. No. VJ/030/2021-2023
No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

కవిత

# వేటగాడివి! కవీ

- ఛాయరాజ్


(అంతర్జాలం నుండి)

లాగేసుకున్నారు
మా పాదాల క్రింది
నేలనెవరికో అమ్మేసినారు
ఏంచెయ్యాలి స్థితిలో?
చెబితే చాలదు సుమీ.... చేసి చూపించు! కవీ

"వెంటాడుదామా? వేటాడుదామా?
కలసి మెలిసీ వచ్చి - కదం తొక్కుతుపోయి?"

గూండాలనెందరినో ఉసిగొల్పివారు
అవయవాలన్నిటిపైన ఆయుధాలెన్నో
ఎక్కుపెట్టినారు
ఎలా ఎదుర్కోవాలి పరిస్థితివి?
చెబితే చాలదు సుమీ.... చేసి చూపించు! కవీ

"గాలికీ నేలకూ గజ్జెల్ని కట్టి
గర్జించి శక్తిని - భర్జించి లేద్దాం
పదం పాడుతువచ్చి - కదం తొక్కుతుపోయి".

దోచేసుకున్నారు
శ్రమలను, శక్తులను
దారులన్నింటినీ మూసేసినారు
ఏంచేద్దామిపుడు?
చెబితే చాలదు సుమీ.... చేసి చూపించు! కవీ

"పండింది పాపం - తొణికింది కోపం
పురిటినొప్పుల పొంచి - శ్రమశక్తినుదయించి
దట్టించి దమ్ము - వస్తోంది ఉద్యమం
గ్రామాలలోంచి - నగరాలలోంచి".

శక్తులను పోగేసి
రక్తరసాయనాన్ని - శ్రుతి చేసినావు
ఏం చెయ్యాలో చెప్పి - ఆ రూపు చూపిన
వేటగాడివి! కవీ! ఎచ్చోటనైనా నువ్వు

"మెట్టండి బాటల్ని - పట్టండి కోటల్ని
కొట్టండి చెరతల్ని - కోలాటమాడుదాం".

(ఛాయరాజ్ 8వ వర్ధంతి సందర్భంగా....)


(అంతర్జాలం నుండి)

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI